సంపుటి:78 సంచిక:10 పుటలు:52

జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు పుష్య శుద్ధ విదియ
22-28 డిసెంబర్ 2025
వెల:₹20/-

దైవం మానుష రూపేణ..

సత్యసాయి బాబా
శతజయంతి సందర్భంగా

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

సద్విద్య సదాచారం స్వావలంబన

సాందీపని గురుకులం

(ప్రాచీన భారతీయ & ఆధునిక విద్యా విధానాల మేలు కలయిక)

Registered with NIOS (National Institute of Open Schooling)
Ministry of Education, Government of India

ఏకలవ్య నగర్, జింగుర్తి, తాండూర్ మండలం, వికారాబాద్ జిల్లా, తెలంగాణ - 501141

EMAIL: principal.gurukul@egvf.org Phone: 9154795530

2026-2027 : 4వ తరగతికి ప్రవేశములు జరుగుచున్నవి

పరీక్ష జరుగు తేది (ఆదివారం 04, జనవరి 2026)

పరీక్ష జరుగు స్థలం : సాందీపని గురుకులం, జింగుర్తి గ్రామం, తాండూరు మం. వికారాబాద్ జిల్లా, తెలంగాణ.

లొకేషన్

విద్యార్థుల ఎంపిక పరీక్షలో మెరిట్ ఆధారంగా, ఇంటర్వ్యూ మరియు ముందుగా ఇవ్వబడిన శిక్షణ కాలంలో విద్యార్థుల దక్షత ఆధారంగా జరుగును.

సమర్థవంతమైన మరియు ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలంటే భారతీయ జీవనాన్ని పునరుద్ధరించాలి. అందుకు మన ప్రాచీన గురుకుల విద్యావ్యవస్థను తిరిగి తీసుకురావడం ద్వారానే ఇది సాధ్యమవుతుంది. మన సమాజంలోని ఇప్పటితరానికి మనం ఈ భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అందిస్తే వారు దీన్ని భవిష్యత్ తరాలకు సమర్థవంతంగా వ్యాప్తి చేయగలరు అని మేము నమ్ముతున్నాము. ఈ గురుకుల విద్యను అభ్యసించే కాలం పూర్తిగా 12 సంవత్సరాలు ఉంటుంది. 12 సంవత్సరాల విద్యను పూర్తిచేసుకున్న గురుకుల విద్యార్థులు ఉద్యోగం చేసే వారిగా కాక ఉద్యోగాలు సృష్టించే వారిగా (Entrepreneurs) మారుతారు. గురుకులంలోని విద్యార్థులకు ఈ 12 సంవత్సరాలు గురుకుల శిక్షణాకాలంలో 64 రకాల కళలను దశలవారీగానేర్పబడును. ఇందులో వేదవిద్య, Vedic Maths లతో పాటుగా గుర్రపుస్వారీ, త్రినేత్రవిద్య, మల్లఖంబ విద్య, విలువిద్య, సంగీతము మరియు చిత్రలేఖనము వంటి విషయాలును నేర్పించబడును.

గురుకుల ప్రత్యేకతలు

- ఉచిత విద్య మరియు హాస్టల్ వసతి.
- విద్యార్థులకు జ్ఞానార్జనే ప్రధానము. మార్కుల ఒత్తిడి విద్యార్థి మనసుమీద ప్రభావము చూపరాదు.
- విద్యార్థులకు నాలుగు భాషలు (తెలుగు, ఇంగ్లీష్, హిందీ మరియు సంస్కృతము) నేర్పించడం జరుగుతుంది.
- గురుకులంలో కంప్యూటర్ సైన్స్ ఫిజిక్స్, కెమిస్ట్రి మరియు బయాలజీ లాబ్స్‌తో పాటు ఆధునిక విద్యలయిన ఏఐ మరియు Robotic Science వంటి విషయాలు పూర్తిస్థాయిలో బోధించబడును.
- Innovation and Vocational training కు కూడా ప్రాధాన్యత ఇవ్వబడును.
- గురుకులం అనేది రెసిడెన్షియల్ స్కూల్ కాదు ఒక సాధనా పూర్వమైన సంస్థ. ఈ విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకొని సహకరించే తల్లిదండ్రులు మాత్రమే తమ పిల్లల్ని చేర్పించగలరు.
- శ్రీకృష్ణుడు మరియు సుధాముడు ఒకే గురుకులములో చదువుకున్నట్లు సాందీపని గురుకులంలో కూడా అన్ని వర్గాల విద్యార్థులు కలిసి చదువుకుంటారు.
- కుటుంబం నుండి ఒక అడ్మిషన్ మాత్రమే అనుమతించబడుతుంది.
- ప్రతి సంవత్సరం రూ.25000/- రీఫండబల్ డిపాజిట్ చెల్లించాలి. 12 సంవత్సరాల విద్య పూర్తి అయిన తరువాత విద్యార్థికి తిరిగి ఇవ్వబడుతుంది.
- తల్లిదండ్రులు తమ పిల్లలకు పుస్తకాలు, యూనీఫార్మ్ మరియు ఇతర సామాగ్రిని అవసరానికి తగినట్టుగా అందించాలి.
- తల్లిదండ్రులు తమ పిల్లలను 12 సంవత్సరాల కాలం పాటు గురుకులంలో ఉంచవలసి వుంటుంది.
- పరీక్ష సమయంలో రూ॥ 500/- పరీక్ష రుసుము చెల్లించవలసి ఉంటుంది.

వివరాలకు సంప్రదించండి : 9154795530, 915495527

దరఖాస్తు చేసుకునేందుకు క్యూఆర్ ను స్కాన్ చేయండి

పోర్ట్ బ్లెయిర్‌లో వీర్ సావర్కర్ విగ్రహావిష్కరణ

డిసెంబర్ 12న అండమాన్, నికోబార్ ద్వీపాల్లోని శ్రీ విజయపురం (పోర్ట్ బ్లెయిర్) సమీపంలోని బియోడ్నాబాద్‌లో వీర్ వినాయక్ దామోదర్ సావర్కర్ భవ్యమైన విగ్రహాన్ని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆవిష్కరించారు. అదే సమయంలో 'వీర్ సావర్కర్ ప్రేరణా పార్కు'ను కూడా ప్రారంభించారు. ఈ పార్కు, విగ్రహం సముద్ర తీరంలో, సావర్కర్‌ను నిర్బంధించిన జైలు సమీపంలోనే ఇది ఉంది. విగ్రహాన్ని ప్రముఖ శిల్పి రామ్ సుతార్ తయారు చేశారు. ఆవిష్కరణ తర్వాత అమిత్ షా, మోహన్ భాగవత్ పార్కులో రుద్రాక్ష మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మోహన్ భాగవత్ ప్రసంగిస్తూ సావర్కర్ జీవితం అసాధారణ ప్రతిభ, స్పష్టత, దేశభక్తిని ప్రతిబింబిస్తుందని అన్నారు. సావర్కర్, నేతాజీ అండమాన్‌లో చరిత్రాత్మక వ్యక్తులు అని తెలిపారు. జాతీయ భావన భక్తితో ముడిపడి ఉండాలి. విభజన కోసం కాకుండా ఐక్యత కోసం పనిచేయాలని తెలిపారు. అమిత్ షా ప్రసంగిస్తూ దేశభక్తి, అస్పృశ్యత నిర్మూలన, సామాజిక సంస్కరణలకు సంబంధించి సావర్కర్ చేసిన కృషికి తగిన గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాంస్కృతిక జాతీయవాదానికి సావర్కర్ పునాది వేశారని చెప్పారు. ఈ విగ్రహం, పార్కు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తాయి, సావర్కర్ కలలను నెరవేర్చేందుకు ప్రేరేపిస్తాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అండమాన్ లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ దీకే జోషి తదితరులు పాల్గొన్నారు. తర్వాత బీఆర్ అంబేద్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సావర్కర్ ఆధారిత పాటను విడుదల చేశారు.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - 9959991304

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

తమిళనాట ద్రవిడవాద రాజకీయాలు, ముఖ్యంగా డీఎంకే పోకడలలో హిందూ వ్యతిరేకత ఒక పార్శ్వం. జాతీయస్ఫూర్తి పట్టని ధోరణి సుస్పష్టం. తిరుప్పరంకుండ్రం దగ్గర పురాతన సంప్రదాయాన్ని ఆచరించే హక్కు హిందువులకు ఉన్నదని న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు కొందరికి కంటగింపు కావడమే ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అక్కడి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం వద్ద కార్తికదీపం వెలిగించడానికి మద్రాస్ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం అనుమతించింది. కోర్టు అనుమతి అమలు కాకుండా గూండాగిరికి తీసిపోని విధంగా డీఎంకే ప్రభుత్వం అడ్డగించడం చర్చకు దారి తీయకపోతేనే ఆశ్చర్యం. ఎనిమిది దశాబ్దాల క్రితమే ఆగిపోయినా, తిరుప్పరం కుండ్రంలో దీపం వెలిగించేందుకు హిందువులకున్న ఆ హక్కు సమర్థనీయమని చెప్పిన న్యాయమూర్తిని అభిశంసించాలని కుప్పిగంతులు వేస్తోంది డీఎంకే ప్రభుత్వం. ఈ వికృత చేష్ట స్వతంత్ర భారతచరిత్రలోనే మొదటిది. డీఎంకేకి ప్రతిపక్షాలు వంతపాడడం హేయమైన అడుగు.

తిరుప్పరంకుండ్రం ఏకశిల కొండ. 17వ శతాబ్దంలో ఈ కొండ మీదే సికందర్ బాద్షా దర్గా వచ్చింది. హిందువులకు పరమ పవిత్రమైన క్షేత్రంలో ఇలాంటి ఒక దుండగీడు చిహ్నం మామూలే. ఈ ప్రాంతం మీద హక్కు గురించి 150 ఏళ్ల క్రితమే వివాదం రేగింది. మదురై సబార్డినేట్ న్యాయమూర్తి 1923లో కొండ అంతా, దర్గా ఉన్న ఆ కాస్త స్థలం తప్ప, ఆలయానిదేనని తీర్పు ఇచ్చారు. మెజారిటీ హిందువుల విశ్వాసాలను మన్నించనవసరం లేదన్నదే ఈ దేశంలో బీజేపీయేతర పక్షాల నమ్మకం. కోర్టు తీర్పులయినా అంతే. ఈ హక్కు వివాదాన్ని ఫిబ్రవరి 2025లో కొందరు ముస్లింలు మళ్లీ రేపారు. తిరుప్పరంకుండ్రం పేరునే సికందర్ కొండగా మార్చాలంటూ మళ్లీ తెంపరితనం ప్రదర్శించారు. అందుకే బీజేపీ 'దక్షిణాది అయోధ్య' నినాదం అందుకుంది. రామనాథపురం ఎంపీ నవాజ్ కనీ దర్గా దగ్గర మేకను చంపడంతో వివాదం ముదిరింది. గతం నుంచి ఇక్కడ హిందూ ముస్లిం సామరస్యం పొంగిపొర్లుతున్నదంటూ ఇవాళ కూడా పత్రికలు రాస్తున్న దిక్కుమాలిన రాతలలోని అసలు వాస్తవాలు ఇవే.

శాలివాహన 1947 శ్రీ విశ్వావసు పుష్య శుద్ధ విదియ

లోపలి పేజీలలో...



6లో

ముఖపత్ర కథనం

దైవం మానుష రూపేణ..

ధారావాహిక నవల

15 **గణపతిదేవుడు**

- మత్తి భానుమూర్తి

26లో

వివాదం

తిరుప్పరంకుండ్రం రగడతో రాజ్యాంగ సంక్షోభమేనా?



34లో

జాగృతి

సంపాదకీయం

తిరుప్పరంకుండ్రం

ఈ నేపథ్యంలోనే కొండమీద ఉన్న దీపస్తంభం మీద ఈ ఏడాది డిసెంబర్ 3న కార్తికదీపం వెలిగించుకోవచ్చునని జస్టిస్ జీఆర్ స్వామినాథన్ ఏకసభ్య ధర్మాసనం డిసెంబర్ 1న తీర్పు చెప్పింది. రవికుమార్ అనే హిందూ హక్కుల కార్యకర్త వేసిన పిటిషన్ మేరకు కోర్టు ఈ తీర్పు వెలువరించింది. అదేమీ దర్గా గౌరవానికీ, ముస్లింల విశ్వాసాలకూ భంగం కాబోదని స్పష్టం చేసింది. సంగం యుగం, అంటే క్రీస్తుపూరం 200 లేదా 300 సంవత్సరం నుంచి వస్తున్న ఆచారమిది. 80 ఏళ్ల క్రితమే దీపథూన్ మీద దీపం వెలిగించే ఆచారం నిలిచిపోతే, మళ్లీ ఇప్పుడు మొదలుపెట్టడం కుదరదంటూ డీఎంకే ప్రభుత్వం 144 సెక్షన్ విధించి, కోర్టు తీర్పును పోలీసు బలగం ప్రయోగించి ఆపేసింది. సీఐఎస్ఎఫ్‌ను రంగంలోకి దించాలన్న కోర్టు ఆదేశం కూడా నివ్వెరబోయింది. ఈ తీర్పు ఇచ్చిన ఆ న్యాయమూర్తినే అభిశంసించాలని డీఎంకే ఉవ్విళ్లూరడం వీటికి పరాకాష్ఠ. డిసెంబర్ 9న దాదాపు 100 మంది విపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అభిశంసన నోటీసు అందించారు.

జస్టిస్ స్వామినాథన్‌పై అభిశంసన తీర్మానానికి నోటీసుకు ఎలాంటి ఆధారాలు లేవని, ఇది ప్రజాస్వామ్యంలో మూల స్తంభాలైన చట్టవ్యవస్థకు, న్యాయవ్యవస్థకు మధ్య లక్ష్మణ రేఖను దాటడమేనని మద్రాస్ హైకోర్టు సీనియర్ న్యాయవాదులు వాదిస్తున్నారు. అభిశంసనకు నోటీసు ఇవ్వడం అంటే భారత న్యాయవ్యవస్థను అస్తవ్యస్థం చేయడానికి నేరుగా జరుగుతున్న ప్రయత్నమేనని డిసెంబర్ 13న లోక్‌సభ స్పీకర్‌కు సమర్పించిన వినతిపత్రంలో వారు కూడా ఆరోపించారు. జూన్ 2017 నుంచి ఈ నవంబర్ వరకు జస్టిస్ స్వామినాథన్ పరిష్కరించిన 1,26,426 కేసులలో ఆయన నిష్పాక్షిక వైఖరి వెల్లడవుతుందని గుర్తు చేశారు. నోటీసు ఇచ్చిన ఎంపీలకు ప్రజాస్వామ్యంలోని అత్యున్నత విలువల పట్ల గౌరవం లేదని, రాజ్యాంగానికి ఉన్న పవిత్రత మీద విశ్వాసం లేదని వాస్తవమే చెప్పారు. ఆ నోటీసును ఆమోదించరాదని కోరారు. డీఎంకే, ఇతర ఎంపీల ఈ వికృత విన్యాసాన్ని దేశం నలుమూలలకు చెందిన 56 మంది మాజీ న్యాయమూర్తులు కూడా తప్పు పట్టారు. ఇది తమ రాజకీయ అభిప్రాయాలకు అనుగుణంగా లేని, తమ ప్రయోజనాలకు కలసిరాని 'న్యాయమూర్తులను భయభ్రాంతులను' చేసే ప్రయత్నమేనని విమర్శించారు. అభిశంసనను రాజకీయ ఆయుధంగా మలుచుకోవాలని చూడడం న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని తక్కువ చేయడమేనని దుయ్యబట్టారు. ఆ తీర్పు విధి నిర్వహణలో భాగమేనని గుర్తు చేశారు.

భారతదేశంలో సెక్యులరిజం పేరుతో జరుగుతున్న దగా ఈ ఉదంతంతో మరొక ఎత్తుకు చేరింది. మైనారిటీల బుజ్జగింపు భరించరాని స్థాయికి వెళ్లింది. శతాబ్దాలనాటి ఆచారాన్ని పునరుద్ధరించుకునే అవకాశం హిందువులకు ఉందని న్యాయస్థానం చెబితే, సెక్యులరిస్టులు మోకాలడ్డుతున్నారు. తీర్పు ఇచ్చిన న్యాయమూర్తిని అభిశంసించాలట. ఇది న్యాయవ్యవస్థ చరిత్రలోనే దిగ్భ్రాంతి కలిగించే పరిణామం, కళంకం. రకరకాల పేర్లతో ఆర్ఎస్ఎస్‌ను, బీజేపీని అపఖ్యాతి పాల్జేయాలని చూసి, హిందువులలో వస్తున్న కొత్త చైతన్యాన్ని తక్కువ అంచనా వేసి బొక్క బోర్లాపడిన విధ్వంసక పార్టీలు ఇప్పుడు, న్యాయవ్యవస్థకీ, చట్ట నిర్మాణ వ్యవస్థకీ మధ్య అగాధం సృష్టించే పనిని మొదలుపెట్టాయని చెప్పాలి. ఈ దేశంలో హిందూ వ్యతిరేకులకు ఎలాంటి ఉచ్చనీచాలు లేవు. తమిళనాడు హిందువులు ఇంకాస్త ఐక్యతను ప్రదర్శించి ఈ బుజ్జగింపు తొత్తులను, జాతి వ్యతిరేకులను వచ్చే ఎన్నికలలో బంగాళాఖాతంలోనికి నెట్టే యత్నం చేయాలి. ★

40లో

కథ

దేవుడు

- సుంకోజి దేవేంద్రాచారి



లక్ష్యం అమోఘం.. సాధన మార్గం!? (తెలంగాణ) - 22
అటల్ స్ఫూర్తితో ప్రగతి దిశగా.. (ఆంధ్రప్రదేశ్) - 16
వేయేళ్లనాటి లెక్కల మాస్టారు (గళమెత్తిన గతం) - 30
'సంచలనాత్మక చిత్రం ధురంధర్' పరిచయం - 36
తత్వవిచారానికి సరైన మార్గం (మార్క్సిజం-శ్రీరామరాజ్యం-15) - 42
ఆధునిక భారత క్రికెట్లో అరుదైన రికార్డులు.! (క్రీడ) - 43
బాలజాగృతి - 46
వారఫలాలు - 48
పదరసం-543 - 49
బాలకృష్ణ 'శివ తాండవం' అఖండ 2 (సినిమా) - 50

1926-2025

దైవం మానుష రూపేణ

"భారతదేశంలో ఇతఃపూర్వం ప్రభవించిన అవతారములన్నిటికంటె ఒక విశిష్టమైన అవతారం భగవాన్ సత్యసాయిబాబావారిది పూర్వ అవతారాల ప్రశస్తి ఆనాటి భారతీయులకు మాత్రమే తెలుసు. కాని సత్యసాయిబాబావారి ప్రశస్తి ఈనాటి ప్రపంచానికంతటికి తెలిసిపోయింది. కనుక పూర్వయుగాల మానవులకంటే ఈనాటి కలియుగ మానవాళియే ధన్యతమైంది" అంటారు ఆచార్య బిరుదురాజు రామరాజు.

పశుపక్ష్యాది జంతువులు ఒక పరిధిలో జీవనం సాగిస్తున్నాయి. జంతు ప్రాణులలో అత్యుత్తమ ప్రాణి మానవుడు తన ధర్మాన్ని విస్మరించి వ్యవహరిస్తున్నాడు. అసలు ధర్మం, శాస్త్రం, గురువు అనేవి కేవలం మానవుడికి సంబంధించినవి. వీటి ఆచరణ ద్వారా మానవుడు ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితి, ఉన్నత స్థితి నుండి అత్యున్నత స్థితికి, అత్యున్నత స్థితి నుండి మహోన్నత స్థితి, మహోన్నత స్థితి నుండి దివ్యస్థితి, దివ్యస్థితి నుండి దివ్యోన్నత స్థితి, దివ్యోన్నత స్థితి నుండి దైవస్థాయి స్థితి, దైవ స్థాయి నుండి దైవస్థితి, దైవస్థితి నుండి పరిపూర్ణ 'దైవం'గా మారే అవకాశం మానవుడికి ఒక్కడికే-భగవంతుడు అనుగ్రహించాడు. దేవతలకుగాని, తిర్యక్కులకుగాని కర్మాధికారం లేనందున వాటికి ఈ అవకాశం లేదు.

అందుచేతనే జంతూనాం నరజన్మదుర్లభం అన్నారు జగద్గురు శంకరాచార్యుల వారు. మానవుడు శాస్త్రం, ధర్మం, గురువును విస్మరించినా, ధిక్కరించినా పతనం ఖాయం.

ధర్మాచరణ ప్రధానమైన అంశంగా కల్గిన మానవుడు, ధర్మాన్ని అతిక్రమించి వ్యవహరించడం వలన - మానవాళిని సంస్కరించేందుకు, తనకు తన యదార్థ తత్వం తెలియచెప్పేందుకు, ధర్మాచరణ వైశిష్ట్యం వివరించేందుకు ఒకరు వచ్చి- ఆచరించి చూపవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ ధ్యేయంతో వచ్చిన దానినే 'అవతారం' అంటారు.

సత్యధర్మ స్వరూపులు శ్రీ రామచంద్రమూర్తి కాగా, శాంతి, ప్రేమ స్వరూపులు శ్రీకృష్ణభగవానుడు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసామూర్తి బాబా వారు. 23.11.1926న ఉదయించిన అవతారం శ్రీ సత్యసాయి ప్రేమావతారం. ప్రేమ సేవలతో తరించవచ్చని లోకానికి ఒక గొప్ప దివ్యమైన, నవ్యమైన సందేశం ఇచ్చారు.

అవతరించుట యనుటలో అర్థమేమి, జనులపై ప్రేమ వాత్సల్య పరత తోడు వారి స్థాయికి దైవంబు వచ్చు భువికి, జీవప్రజ్ఞతోపాటుగా దైవప్రజ్ఞ అంటారు భగవాన్ బాబా.

భగవంతుని అవతరణానికి కారణం- పుణ్యాత్ముల, సాధు పురుషుల ప్రార్థన ఒక కారణమైతే, దుర్మార్గుల దురాగతాలు మరొక కారణం. అసలు కారణం జనులపై గల అపారమైన ప్రేమ, ప్రీతి, వాత్సల్యమే. సమాజంను సంస్కరించాలని, మంచి పరివర్తన తీసుకురావాలని, వారి వారి యధార్థ స్వరూపం (ఆత్మస్థితి) తెలుసుకొని, సర్వేశ్వర రూపం ధరించియున్న సమాజంలో సేవ చేయించి తరింపచేయాలని, శాస్త్రము, వేదము ఎడల సదావగాహన, ధర్మాచరణ ఎడల అనురక్తి, ధర్మాచరణీయ జీవన విధానంలో పయనింపచేసి, జీవనం పావనం చేసుకునేలా చేయాలన్న మహాదివ్య సంకల్పమే భగవంతుని అవతరణకు ప్రధాన కారణం.

సత్యసాయి చూపిన అపార ప్రేమ 180 దేశాలకు వ్యాపించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాదిమంది ప్రేమ సేవకు పెద్దపీట వేశారు.

ఆదిశంకరులవారు 'జంతూనాం నరజన్మ దుర్లభం' అంటే, సాయివారు - ఓ మానవా! నీవు దివ్యాంశ సంభూతుడవు, నీలో అనేక దివ్యగుణాలున్నాయి, నీవు సామాన్యుడవు కాదు, నీవు సైతం దేవుడివే' అన్నారు. కొన్ని మాయ తెరలు దట్టంగా, గాఢంగా క్రమ్ముకొని ఉన్నమీదట మీరు దైవం అని తెలుసుకొనలేక పోతున్నారు, ఆ మాయను తొలగించండి సాధన ద్వారా, ప్రేమ ద్వారా, సేవ ద్వారా. మీ యధార్థ దివ్య స్వరూపం ఆవిష్కృత మౌతుంది అని లోకానికి చాటి చెప్పారు.

సేవ ప్రేమతో చేయండి. అందులో కరుణ, దయ, జాలి, వాత్సల్యాలను నింపండి. సేవా ఫలితం పొందుతున్నవారు-వరవసించిపోవాలి. ఆ పారవశ్యంతో పునీతులు కావాలి, పునీతుడైన తాను-లోకానికి చేతనైన సేవచేయడానికి సంసిద్ధుడు అవుతాడు అని స్వామి గొప్ప విశ్లేషణ చేసి చెప్పారు.

ఎంత ఖరీదైన, విలువైన సేవ చేశావన్నది కాదు - ముఖ్యంగా ఎంత ప్రేమతో చేశావన్నదే ప్రధానం అంటారు సత్యసాయి.

సేవా ఫలితం-సేవ పొందుతున్నవారికి వస్తున్నా, సేవా పుణ్యం నువ్వు పొందుతున్నావు. పుణ్య సముపార్జనకు నువ్వు చూపే ప్రేమ, సేవ ఎంతగానో దోహదపడతాయని స్వామి చాటి చెప్పారు. ప్రపంచం మొత్తం మీద-ప్రతిరోజు కొన్ని కోట్ల విలువైన విద్య, వైద్య, వస్త్ర, ఆహార నైపుణ్య, సామాజిక, సాంఘిక సేవలు సమాజానికి - స్వామి చూపిన శ్రీ సత్యసాయి సేవాసంస్థలు అందిస్తున్నవి.

కుగ్రామం మొదలు కుబేర దేశాలలో సైతం విస్తరించిన శ్రీ సత్యసాయి సేవాసంస్థలు భాష, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సేవలు కొన సాగిస్తున్నాయి. ఈ సేవలు మూగ జీవులకు సైతం అందుతున్నాయి. గర్భిణీలకు సీమంతం, వారికి పౌష్టిక ఆహారం, శిశువుకు ఆరోగ్య పరిరక్షణ, విద్య, వస్త్రం, కుటీర సదుపాయాలు, త్రాగునీరు, యువతకు నైపుణ్య శిక్షణ, ఉపనయనములు, వివాహాలు, ఉపాధి-చివరకు శ్మశానవాటిక నిర్వహణ. ఇలా

సేవ ప్రేమతో చేయండి. అందులో కరుణ, దయ, జాలి, వాత్సల్యాలను నింపండి. సేవా ఫలితం పొందుతున్నవారు – పరవసించిపోవాలి. ఆ పారవశ్యంతో పునీతులు కావాలి, పునీతుడైన తాను– లోకానికి చేతనైన సేవచేయడానికి సంసిద్ధుడు అవుతాడు అని స్వామి గొప్ప విశ్లేషణ చేసి చెప్పారు.



ప రూపేణ..

అనేకానేక కోణాలలో గిరిజన, ఆటవిక ప్రాంతాలలో మంచి నీటివసతి, పాఠశాలలు, కమ్యూనిటీ హాలు, విశ్వవిద్యాలయంవరకు అనేకానేక సేవలు ఏవిధమైన ఫలాపేక్ష లేకుండా ప్రపంచమంతా అందుతున్నాయి. శ్రీమంతులలో, విద్యావేత్తలలో, వైద్యులలో, కళాకారులలో, రాజకీయవేత్తలలో, ప్రముఖులలో, శాస్త్రవేత్తలలో, సాంకేతికాధిపతులలో, సామాన్యులలో సైతం గొప్ప పరివర్తన కల్గించారు– తమ దివ్య మహిమాన్విత శక్తులచే దర్శన, స్పర్శన, సంభాషణలచే.

మానవాళిలో దాగియున్న దివ్యత్వాన్ని మేలుకొలిపి మనిషిని మనీషిగా ఎందరెందరినో తీర్చిదిద్దారు. వారు సాయి దూతలుగా, సాయి సేవకులుగా తరిస్తున్నారు.

నీ వద్ద ఏ శక్తి–సామర్థ్యాలు, వనరులు లేకపోయినా నువ్వు సమాజ సేవలో పాల్గొనవచ్చు, అదెలా అంటే నీవద్ద ఉన్న మంచి, గొప్ప మనసుతో సమాజ హితాన్ని హృదయపూర్వకంగా కాంక్షిస్తూ, సమస్త లోకాలు సుఖసంతోషాలతో ఉండేలా అనుగ్రహించమని భగవంతుడిని ప్రార్థించండి. మీ పరమ పవిత్ర సంకల్పాన్ని భగవంతుడు తప్పక నెరవేరుస్తాడు. ఇది ఒక గొప్ప సమాజసేవ అని సాయి ఉదహరించారు.

శ్రీ సత్యసాయి మహాసంస్థానం– ఇది అపూర్వ గొప్ప ప్రేమ సామ్రాజ్యం. విచ్చేసిన వారి హృదయాలను వికసింపచేసే పరమ పవిత్ర ప్రశాంతి పరంధామము– శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం.

ప్రశాంతి నిలయంలో, మందిర ప్రాంగణంలో ప్రవేశించి ఆసీనులైనవారికి ఒక దివ్య అనుభూతితో పాటు, నేను సైతం సమాజసేవలో పాల్గొనే శక్తి, సామర్థ్యాలు, పవిత్రంగా జీవనం సాగేటట్టు అనుగ్రహించమని ప్రార్థించడం అతి సహజం. వారికి తెలియకుండానే, ముందుగా అలా ఆలోచన లేకుండానే అలా స్వామిని ప్రార్థించడం గొప్ప విశేషం. ఇదే స్వామి లీల. ఇలా లక్షల, కోట్ల హృదయాలను తనవైపు త్రిప్పుకొని, వారందరిని సమాజసేవలో, వారివారి ప్రాంతాలలో చేయ ప్రోత్సహించడం స్వామివారి అపార కరుణకు నిదర్శనం.

ఇలా స్వామివారు వ్యక్తిలో తీసుకొస్తున్న పరివర్తన, కుటుంబం, సమాజం, రాష్ట్రం, దేశంపై ఎంతగానో ప్రభావం ఉంటున్నది. ఇది సత్యం–సత్యం–సత్యం.

కొందరిని ఎంపిక చేసుకొని వారి వారి హృదయాలలో ప్రవేశించి, హృదయాలను కదిపి, కుదిపి – వాళ్ల జీవితాలను ప్రక్షాళన చేసి పవిత్ర సేవా హృదయాలుగా తీర్చిదిద్ది, ఉత్తమ మార్గంలో ప్రయాణింపచేస్తున్న దివ్య పరిపూర్ణ ప్రేమావతారం – సత్యసాయి మహాదేవుని అవతారం.

అరిషడ్వర్గాలను సాధకుడు దూరం పెట్టాలి. లేకుంటే మానవుడిని అధోగతి పాలుచేస్తాయని శాస్త్రాలు, మహర్షులు బోధిస్తే ...

సాయి అంటారు–వాటితో మచ్చికగా యుండండి. వాటితో భేటీ పడవద్దు. వాటిని ఢీకొనవద్దు. వాటిపై ఆగ్రహావేశాలు ప్రదర్శించవద్దు. అలా చేస్తే అవి ఇంకా తీవ్రరూపం దాలుస్తాయి.

కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను ప్రేమతో గౌరవంతో పూజించాలి అంటారు. వాటిని ప్రేమతో భగవంతుని వైపు మరల్చడమే, త్రిప్పడమే పూజించడం అంటే ఇలా సాధకుడు చేయాలి. వాటితో ఘర్షణ పడకూడదు. విజయదశమినాడు ఆయుధపూజ ఎలా చేస్తారో–అలా వీటిని భగవంతుని వైపు త్రిప్పేసరికి దుర్గుణాలు, సద్గుణాలుగా మారతాయి అంటారు బాబా.

'కామం' దీనిని భగవంతుడిని దర్శించాలని, భగవంతుడి గురించి తెలుసుకోవాలని తపింప చేయాలి. ఇలా దీనిని కాంక్షగా మార్చాలి.

'క్రోధం' పట్టుదలగా మారి భగవత్ సాక్షాత్కారం పొందాలని, పొందలేకపోవడానికి కారణం ఏమిటని క్రోధంపై క్రోధంవచ్చి ఆత్మావలోకనం చేసుకోవాలి.

'లోభం' అంటే పిసినారితనం. దీనితో భగవంతుడు నాకే చెందాలి, ఏమి చేస్తే నాకు చెందుతాడు అని యోచింపచేయాలి.

'మోహం' ఇది మూఢభక్తిగా మారి భగవంతునికై పరితపించాలి. భగవంతుడు లేకపోతే నేను లేను అనే రీతిగా మారాలి.

'మదం' అంటే గర్వం. ఇది భగవంతునిపై అచంచల విశ్వాసంగా, నాకు భగవంతుడున్నాడు అనే గొప్ప భరోసాతో గర్వంగా ఉండాలి.

'మాత్సరం' అంటే అసూయ. భగవంతుడు నేను పిలిస్తేనే పలకాలి. వేరేవాళ్లు పిలిస్తే పలుకకూడదు. భగవంతుడు నాకే దక్కాలి అని గాఢంగా యోచించి, యోచించి అలా భగవంతుడిని ధ్యానిస్తూ, తపించి తపించి అలసిపోయి తరించాలి.

లోకంలో ఎన్నో రకాల క్రూర జంతువులు, బలవంతమైనవి కూడా సర్కస్‌లో వాళ్ల యజమానికి వశమై, చెప్పినట్టు చేస్తాయి. ఉదాహరణకు ఏనుగు, పులి, సింహం, ఎలుగుబంటు, పాము, కుక్క ఇలా ఎన్నో ఉన్నాయి. ఇలా యజమానికి వశమై – తన సహజ లక్షణాన్ని వదలి సాత్వికంగా వ్యవహరిస్తున్నాయి కదా, మరి ఈ అరిషడ్వర్గాలను శ్రీహరివైపు త్రిప్పితే అవి 'హరిషడ్వర్గాలు'గా మారతాయి. ఆయనకు వశమై ఆనంద ప్రాప్తికి దోహదమౌతాయి అని సత్యసాయి కలియుగంలో అరిషడ్వర్గాలపై గొప్ప భాష్యం చెప్పారు. వినూత్న విశ్లేషణ చేశారు.

జంధ్యాల నాగేశ్వరరావు
ప్రవచనకర్త



అక్షర

1966, జూన్. శ్రీ సత్యసాయిబాబా అనంతపురంలోని ఒక బాలికల పాఠశాలకు వచ్చారు. విద్యార్థినులతో వాళ్ల లక్ష్యాలు ఏమిటో తెలుసుకుంటున్నపుడు చాలామంది "మేము పదవతరగతితో చదువులు ఆపేయాలని అనుకోవడం లేదు. పై చదువులు చదివి, మా కుటుంబాలను ఆదుకోవాలి, దేశానికి సేవ చేయాలి అనుకుంటున్నాం, కానీ మా పట్టణంలో కళాశాల లేదు. బయటి నగరాలకు మమ్మల్ని పంపించి చదివించే ఆర్థిక స్తోమత మా తల్లిదండ్రులకు లేదు" అని చెప్పారు. భగవాన్ మౌనంగా విన్నారు. కానీ, వారి మనసులో పుట్టిన ఆలోచన ఏమిటో అక్కడున్న వారెవ్వరికీ తెలియదు. తరువాత ప్రసంగించిన బాబా, "త్వరలో ఇక్కడ ఒక మహిళా కళాశాల నిర్మాణమవుతుంది" అని ప్రకటించారు. ఆ మహనీయుడి నోటి వెంట మాట రావడం, అది జరగకపోవడమా?

కేవలం రెండేళ్లలోనే అనంతపురం పట్టణంలో 115-23 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో Sree SatyaSai Institute of Higher learningను నిర్మించారు.. ఏ ఉద్దేశ్యాలతో కళాశాల ప్రారంభమయిందో, 57 ఏళ్ల తరువాత ఈ రోజు కూడా అవే విలువలు, అదే నాణ్యత. కళాశాల ప్రాంగణంలోకి అడుగుపెడితే ప్రాచీన భారతదేశం నాటి గురుకులంలోకి వచ్చామా అనే భావన కలుగుతుంది.

సత్యసాయి విద్యాసంస్థల్లో చదివి, పెద్దవారై ఏ ఇతర సంస్థలలో చదువు తున్నా, ఉద్యోగాలు చేస్తున్నా, వారి ప్రవర్తన, వారి వేషం, మాట తీరు చూసి మనం "వీళ్లు బాబాగారు నెలకొల్పిన విద్యాసంస్థల్లో చదువుకున్న విద్యార్థులై ఉంటారు'' అని గుర్తుపట్టవచ్చు. గుణంలేని విద్య దేవుడులేని ఆలయం వంటిది. (The end of education is character is like a temple without God) అని స్వయానా బాబాగారే తరచు అనేవారు.

సాయిబాబాగారు తన 37వ ఏట అంటే 1963వ సంవత్సరంలో కొంతమంది భక్తులతో తాను భూమి మీద ఏ కార్యం చేయడానికి వచ్చానో తన జీవితం ఏ దిశగా ముందుకుసాగబోతుందో సూచన ప్రాయంగా తెలియజేశారు. "ఏ ధర్మం అయితే అడవులకు వెళ్లిపోయిందో, ఆ ధర్మాన్ని తిరిగి పల్లెలు, పట్టణాలు, నగరాలకు రప్పించాలి. ఏ అధర్మమయితే పల్లెలు, పట్టణాలను ఆక్రమించిందో ఆ అధర్మం తిరిగి అడవులకు వెళ్లిపోవాలి. మనం చేసే ప్రతి పని కూడా ధర్మం ఆధారంగానే జరగాలి, ధర్మానికి మేలు చేసేదిగానే ఉండాలి." అన్నారు.

బాబా మాటలను తరచి చూస్తే: ప్రతి మనిషిలోనూ దివ్యత్వం ఉంటుంది. కానీ ప్రతి మనిషికీ అది తెలియదు. దాన్ని అతనికీ, ఆమెకూ తెలియచేస్తే ఆ దివ్యత్వం మేల్కొంటుంది. అపుడు ఆ మనుషుల ద్వారా జరిగే ప్రతి పనీ లోకానికి మేలే చేస్తుంది. స్వామి వివేకానందుడు, గౌతమ బుద్ధుడు, జిడ్డు కృష్ణమూర్తి లాంటి మహాత్ములందరూ ఇదే విషయాన్నే చెప్పారు. లోక కల్యాణానికి మనిషిని తయారుచేసేది ఏది? విద్య.

దురదృష్టవశాత్తూ ఈనాడు విద్య అంటే ఉద్యోగం, విద్య అంటే ఉపాధి అని మాత్రమే అనుకొంటున్నాం. ఉద్యోగం, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమే కానీ అవి విద్య "అంతిమ లక్ష్యం" కావు. అందుకే శ్రీ సాయి తరచు ఇలా అనేవారు : "పుస్తక సంబంధమైన విజ్ఞానం మాత్రమే చాలదు. అదొక్కటే మన జీవన గమ్యం కారాదు. బ్రతకడానికి ఒక ఆసరాను విద్య ఇవ్వవచ్చు. కానీ విద్య అక్కడితో ఆగరాదు. దానిని దాటి చాలా ముందుకు పోవాలి. జీవితంలో మనిషి ఎదుర్కొనే నైతిక, సామాజిక, ఆధ్యాత్మిక ప్రశ్నలు, సవాళ్లకు విద్య పరిష్కారం చూపేదిగా ఉండాలి. నైతిక విలువలు, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించకపోతే విద్య ఒక విధంగా ప్రమాదానికే దారి తీయవచ్చు. ఈ రోజు విద్యావంతుల్లో 'నైతికత' లేకుండా పోయినందువల్లే వాళ్ల వ్యక్తిగత జీవితాల్లో భయం, ఆందోళన, ఒత్తిడి కనిపిస్తున్నాయి."

లౌకికవిద్య, ఆధ్యాత్మిక విద్య రెండూ వేరు వేరు కావని, కాకూడదని సాయి అనేవారు. ఈ రెండింటి సంగమమే నిజమైన విద్య. అంటే మనిషి తాను బ్రతకడానికి ఇతరులమీద ఆధారపడకూడదు, అలాగే ఇతరులను బ్రతికించడానికి తన శక్తియుక్తుల్ని వినియోగించకుండా ఉండకూడదు. ఈ విషయంగా శ్రీ సత్య సాయి చమత్కారంగా ఒక ఉదాహరణ చెప్పేవారు : "మనిషి, భూమిని చూసి నేర్చుకోవాలి. భూమి తన చుట్టూ తిరుగుతూ, సూర్యుని చుట్టూ కూడా తిరుగుతుంటుంది కదా, అలాగే మనిషి కూడా తన కుటుంబం పట్ల తనకున్న బాధ్యతను నెరవేరుస్తూనే



యజ్ఞం

సమాజంపట్ల తనకున్న బాధ్యతను కూడా తప్పకుండా నెరవేర్చాలి".

ఇటువంటి విద్యావిధానాన్నే శ్రీ సత్యసాయి ఎడ్యుకేర్ (Educare) అని అన్నారు. మనిషిలో దాగి ఉన్న సత్యం, సత్ప్రవర్తన, శాంతి, ప్రేమ, అహింస, సేవాభావం అనే ఉదాత్తమైన విలువలను వెలికితీసి, మనిషి మాటలకు, చేతలకు, హృదయానికి అనుసంధానాన్ని ఏర్పరిచేదే నిజమైన విద్య. ఇటువంటి విద్యను మనిషికి బాల్యదశ నుండే నేర్పడం ప్రారంభించాలి అని భావించి 1968లో శ్రీ సత్యసాయి బాబాగారు "బాలవిహార్" అని బాలబాలికలకు కథలు, పాటలు, నాటకాలు, సంగీతం ద్వారా మన సనాతన ధర్మం విలువలను, ఆవశ్యకతను బోధించే విధానాన్ని ప్రారంభించారు. ఈ బాలవిహార్ల నిర్వహణను మహిళా విభాగానికి అప్పగించారు. 1971లో 'బాలవిహార్' విధానాన్ని 'బాలవికాస్'గా మార్చారు శ్రీ సాయి. ఈ 'బాలవికాస్'ను మూడు వర్గాలుగా విభజించి నడుపుతున్నారు.

6-9 సంవత్సరాల వయసు గల
బాలబాలికలు మొదటి వర్గం
9-12 సంవత్సరాల వయసు గల
బాలబాలికలు రెండవ వర్గం
12-15 సంవత్సరాల వయసు గల
బాలబాలికలు మూడవ వర్గం

ఈ బాలవికాస్ కేంద్రాల్లో మన సనాతన ధర్మంలో భాగమైన పురాణాలు, రామాయణ, భారత, భాగవతాల్లోని శ్లోకాలు, వివిధ దేవతా స్తోత్రాలు, నైతిక విలువలు నేర్పించే కథలు, భజనలు, భక్తి గీతాలు, మహాపురుషుల జీవిత చరిత్ర బోధిస్తారు.

2010లో ఒక మారు, 2011లో రెండవ మారు, పుట్టపర్తిని సందర్శించిన ఆర్ఎస్ఎస్ సరసంఘచాలక్ మోహన్ భాగవత్ డిసెంబర్ 27,2019 న మరోసారి పుట్టపర్తికి వచ్చినపుడు ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో ప్రసంగిస్తూ, బాలవికాస్ కార్యక్రమాన్ని చాలా ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో నడుస్తున్న 2000 బాలవికాస్ కేంద్రాల నుండి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్న ఆ కార్యక్రమంలో మోహన్‌భాగవత్ " బాలుడిగా ఉన్నప్పుడు శ్రీకృష్ణుడు ఎలా తల్లిదండ్రుల ఒడిలో కూర్చుని చక్కటి కథలు, పాటలు నేర్చుకున్నాడో, అలాగే ఈ బాలవికాస్‌లోని పిల్లలు కూడా మన ధర్మాన్ని, సంస్కృతిని పాటలు, శ్లోకాలు, కథల ద్వారా నేర్చుకుంటున్నారని ఈ పిల్లలకు కృష్ణుడి, అలాగే సాయి దీవెనలు ఉన్నాయి కాబట్టి వీళ్లందరూ "సాయికృష్ణ" అని సంబోధించారు.

ఈనాడు బాలవికాస్ భారతదేశంలో 28 రాష్ట్రాలకు విస్తరించి 1500 కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిలో 18000 మంది ఉపాధ్యాయులు పిల్లలకు నైతిక విద్యను అందిస్తున్నారు.

ఈ కేంద్రాల్లో 3,50,000 మంది బాలబాలికలు మన సనాతన ధర్మ సంస్కృతులను తెలుసుకుంటూ, ఆదర్శపౌరులుగా ఎదుగుతున్నారు.

బాలవికాస్ కేంద్రాలే కాక శ్రీ సత్యసాయి ప్రారంభించిన లేదా వారి ఈశ్వరైక్యం తరువాత ప్రారంభమైన అనేక విద్యాసంస్థలు దేశ వ్యాప్తంగానే కాదు, ప్రపంచంలో అనేక దేశాలకూ విస్తరించాయి. అందులో కొన్ని ఇలా ఉన్నాయి,..

Satya Sai Schools (SSS) 26 దేశాల్లో విద్యను బోధిస్తున్నాయి.

Institutes of Satya Sai Education (ISSES) 30 దేశాల్లోనూ,.

Satyasai Education in Human Values (SSEHV) 30 దేశాల్లోనూ,.

Sai Spiritual Education (SSE) 100 దేశాల్లోనూ నైతిక, ధార్మిక విద్యను అందిస్తున్నాయి.

భారతదేశంలో కూడా 4 సత్యసాయి అంతర్జాతీయ విద్యాలయాలున్నాయి. 1. SAI international School, 2. SAI Angan, 3. SAI International Residential School, 4. SAI international college of commerce (భువనేశ్వర్, ఒడిషా) ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్టణం, గుంటూరు, కడప, నందిగామ, మదనపల్లె, పలాస పట్టణాల్లో 8 సత్యసాయి పాఠశాలలు పనిచేస్తున్నాయి.

ఇంత పెద్ద ఎత్తున భారతీయ విద్యా విలువలను దేశంలోనే కాక అనేక ప్రపంచ దేశాల్లో విస్తరింపజేసి, బాబా మన భారతీయ సనాతన ధర్మం, ప్రపంచ శాంతికి, మానవ కల్యాణానికి ఎంతగా తోడ్పడుతుందో రుజువు చేయడం మాత్రమే కాదు, లక్షల కోట్లమంది మానవులకు జీవితం లక్ష్యమేమిటి? జీవితంలో మనుషులు ప్రేమ, శాంతి, ఆధ్యాత్మికతను అలవాటు చేసుకుంటే, వాళ్ల జీవితాలు ఎంత ఆనందంగా మారతాయో కూడా నిరూపించారు.

Not gold but only man can make
A people great and strong;
Men who for Truth and Honour's sake
Stand fast and suffer long

'ఒక జాతిని నిర్మించేది బంగారు కాదు, / మనుషులే ఒక జాతిని ఘనంగా, దృఢంగా నిర్మిస్తారు. / ఏ మనుషులైతే సత్యంకోసం, గౌరవం కోసం గట్టిగా నిలబడి, / బాధల్ని కూడా భరిస్తారో వాళ్లే జాతిని నిర్మిస్తారు' అనే ఈ కవితను 1847లో ఆర్.డబ్ల్యు ఎమర్సన్ వ్రాశారు.

సరిగ్గా ఇలాంటి మనుషులనే మన దేశానికి, మన ప్రపంచానికి అందించాలని శ్రీ సత్యసాయిబాబా భావించారు. అందులో వారు విజయం కూడా సాధించారు. వారు భౌతికంగా మన మధ్య లేకున్నా, వారి దివ్య సందేశం, ప్రేరణ మనల్ని నడిపిస్తూ ఉంటాయి.

– డాక్టర్ పి.సతీష్

సమాజానికి సేవ చేయని విద్య
జ్ఞానం కాదు. అది భారం మాత్రమే.
విద్య కేవలం ఉద్యోగానికి కాదు.
అది సేవకు, సమగ్రతకు,
దైవత్వానికి దారి చూపాలి.

- శ్రీ సత్యసాయి



భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి
శత జయంతి వేడుకల శుభాకాంక్షలు
(1926-2025)

Growiti Group, Hyderabad
www.growitigroup.com
9959828855, 7981987024

శ్రీ సత్యసాయి బాబా వారు తమ జీవన ప్రస్థానంలో సత్య ధర్మ శాంతి ప్రేమ అహింస అనే విలువలను బోధిస్తూ మానవాళిని విలువైన జీవన మార్గం వైపు పయనింప చేసారు.. ఆధ్యాత్మిక బోధనలతో అజ్ఞానంధకారాన్ని పారదోలుతూ భక్త కోటిలో చైతన్య కాంతులు నింపారు.. ప్రేమమూర్తిగా సేవకు ప్రతి రూపంగా, ఉచితంగా త్రాగు నీరు, విద్య వైద్య సేవలను అందించి సేవ ప్రదాతగా కీర్తి గడించారు. పుట్టపర్తిలోని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు ఆపదలో భక్తులను ఆదుకునే అపద్బాంధవుడిగా ఆరాధ్య దైవంగా భక్తుల మదిలో స్థిర నివాసం ఏర్పరుచుకొని తమ శ్వాసగా ధ్యాసగా కొలుస్తున్నారు.. మానవ సేవయే మాధవ సేవ అని బోధించిన శ్రీ సత్యసాయి ఒక వైపు అధ్యాతిక బోధనలతో మానవాళిని చైతన్యవంతులను చేస్తూనే కనీస అవసరాలకు నోచుకోని బడుగుజీవులకు సేవలు అందించే మహత్తర కార్యక్రమాలను ట్రస్ట్, సేవా సంస్థల ద్వారా చేయిస్తున్నారు.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి
శత జయంతి వేడుకల శుభాకాంక్షలు
(1926-2025)

శ్రీ సత్యసాయి సేవా సంస్థలు రంగారెడ్డి జిల్లా - తెలంగాణ

జీవిత పరమార్థం చెప్పే బాలవికాస్

'భరతదేశము వేదాల పట్టుగొమ్మ. యజ్ఞ యాగాది క్రతువుల కాటపట్టు. పెక్కు అవతారములు గన్న పెద్దతల్లి. నీతి నియమాల రూపు ఈ త్యాగ భూమి'
– బాబా.

మనదేశం ఆధ్యాత్మికతకు పుట్టినిల్లు. ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయికి మానవుడు ఎదగడమే ఆధ్యాత్మికత. మానవుని ప్రవర్తన ఆదర్శంగా, ఇరుగు పొరుగు వారికి సహకరిస్తూ సేవాభావంతో సాగడమే ఆధ్యాత్మికత. ఇంకా మానవునిలో మాధవుని చూడటమే!

మాతృదేవోభవ. పితృదేవోభవ. ఆచార్యదేవోభవ. అతిథిదేవో భవ. సత్యం వద, ధర్మంచర వంటి అనే సూత్రాలున్నాయి. నేడు వీటిని హాస్యాస్పదమైన మాటలుగా భావిస్తున్నారు. తల్లితండ్రులు ముసలి వారయ్యాక వృద్ధాశ్రమాల పాలవుతున్నారు. చదువులు సంస్కారాన్నివ్వడంలేదు. ధనవ్యామోహం అధికమై, స్వార్థం పెరిగి భారతీయ సంస్కృతి మరుగునపడే సమయంలో భగవాన్ శ్రీసత్యసాయి బాబా పుట్ట పర్తిలో అవతరించి భారతీయ సంస్కృతిని కాపాడేం దుకు పూనుకున్నారు.

అవతరించడం అంటే? వేదోద్ధరణ, పండిత పోషణ, భక్తరక్షణ, సాధు సంరక్షణ. వీటన్నింటినీ సరిదిద్దాలని బాబా బాలవికాస్‌ను ప్రారంభించారు.

education is for life, and not for living (విద్య జీవిత పరమావధి కోసమే కానీ జీవించటానికి మాత్రమే కాదు). దీనిని బోధించేందుకే స్వామి బాలవికాస్ స్థాపించారు. మొదట్లో (1969)లో 'బాలవిహార్' అనే పేరు పెట్టారు బాబా. 1971లో బాలవికాస్‌గా మార్చారు. విద్యాసంస్థలలో మాత్రమే కాక బాలబాలికలంతా బాలవికాస్ బోధనాంశాలను నేర్చుకుని ఆచరించేలా సత్యసాయి సంస్థలలో ఒక విభాగంగా బాలవికాస్‌ను ఏర్పరచారు. మానవతా విలువలు పిల్లలకు ఇళ్లలో బోధించే తీరిక, ఓపికా లేని ఈ యుగంలో బాలవికాస్ ఎంతో ఉపయోగి స్తుంది. సత్యసాయి భగవానులు సత్య, ధర్మ, శాంతి ప్రేమ అహింసలనే ఐదు విలువలను మానవులకు తాను అనుసరిస్తూ, ఉపన్యాసాల ద్వారా బోధించ సాగారు. సేవకు ప్రత్యేక స్థానం ఇచ్చారు.

బాలవికాస్ ప్రధాన ఉద్దేశాలు –దేహ వికాసం, బుద్ధి వికాసం, మానసిక వికాసం, హృదయ వికాసం, ఆత్మ ఆధ్యాత్మిక వికాసం కలిగించడం.

బ్లూజమింగ్ ఆఫ్ ఇండివిడ్యూవల్ పర్సనాలిటి

పిల్లలు మొగ్గలుగా ఉన్నపుడు మంచి శిక్షణ అందిస్తే ఉత్తమ పౌరులుగా తయారై అటు దేశానికీ, ఇటు సమాజానికీ, కుటుంబానికీ ఉపయోగపడతారు. ఆ ఉద్దేశంతోనే బాలవికాస్‌ను కులమతాలకు అతీతంగా పిల్లలందరికీ అందించాలని సంకల్పించారు.

బుద్ధి వికాసానికి తోడ్పడేవి మానవతా విలువలు. దేహ వికాసానికి తోడ్పడేవి క్రీడా పద్ధతులు. ఆత్మ వికాసానికి తోడ్పడేవి భజనలు, స్తోత్రాలు, ప్రార్థనలు, కథలు, అన్ని మతాలలోని మహనీయుల చరిత్రలు మొదలైనవి. బాలవికాస తరగతులను ప్రభుత్వ పాఠశాలలలోనూ, బస్తీలలోను, తమ గృహాలలోనూ బాలవికాస్ గురువులు ఏమీ ఆశించకుండా బోధి స్తారు. గురువులంతా ఈ పనిని స్వామి అప్పగించిన కర్తవ్యంగా భావిస్తారు. అందుకే బాలబాలికల్లో ఎంతో సానుకూల, పవిత్ర మార్పు వస్తున్నది.

బాలవికాస్ అంటే వ్యక్తిత్వ వికాసం. ప్రతీ వ్యక్తిలో అంతర్లీనంగా విశిష్ట వ్యక్తిత్వం ఉంటుంది. ప్రతీ విద్యార్థిలోని ఆ అంతర్లీన శక్తిని వెలికి తీసి దానిని అత్యున్నతమైన స్థాయికి తీసుకొనిపోయేందుకు పాటుపడేది బాలవికాస్. నేటి పిల్లలు రేపటి సమాజా నికి మార్గనిర్దేశకులుగా ఎదగటానికి, స్వీయ పరిశోధన – స్వీయ ఆవిష్కరణ మార్గంలో సాగేందుకు బాల వికాస్ తోడ్పడుతుంది. దీనిని బాలవికాస పూర్వ విద్యార్థులు యదార్థమని రుజువుచేస్తున్నారు.

ఐశ్వర్యరాయ్ బచ్చన్, మిస్ వరల్డ్,నటి. ఆమె బాబా శతజయంతి సందర్భంగా పుట్టపర్తికి వచ్చి తాను బాలవికాస్ పూర్వ విద్యార్థిననీ, గురువులు నేర్పిన మానవతా విలువలు, నిస్వార్థ ప్రేమను, మానవసేవను ఆచరించడం వలన జీవితంలో ఎంతో లాభం పొందానని చెప్పారు."భగవాన్ బాబా ఆశీస్సులు, ప్రేమతో నాకు ఆశీర్వచనాలు అందాయి. నేను బాలవికాస్ విద్యార్థిని కావడం నా అదృష్టం. జీవితంలో చిన్న వయసునుండే బాలవికాస్ బోధనాం శాలను వినడం వలన వాటిని ఆచరించి ఎంతో లాభం పొందాను. నేను మంచి బాలవికాస్ పూర్వ విద్యార్థిగా ఉండాలని ఆశిస్తున్నాను. నా జీవితం ప్రారంభంలో బోధించిన విలువలను నా జీవితాంతం అమలుపరుస్తాను. పంచుకుంటాను." అన్నారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కూడా అదే వేదిక మీద తాను బాలవికాస్‌లో నేర్చిన అంశాల ద్వారా నా జీవితంలో విజయాలు సాధించి సుఖసంతోషాలతో ఉన్నానంటే అంతా స్వామి ఆశీర్వచనమే అన్నారు. మరొక క్రికెట్ క్రీడాప్రముఖుడు గవాస్కర్ బాబా భక్తుడు. యువ పారిశ్రామికవేత్త, బాలవికాస్ మరో పూర్వ విద్యార్థి డాక్టర్ సాజన్ శర్మ ఇలా చెప్పారు. "బాలవికాస్ పూర్వ విద్యార్థిని కావడం నా అదృష్టం.

మానవతా విలువలను నేర్చుకుని, పాటించి, వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో ఈ విలువలను అమలు చేయడం వల్ల నేను ఒక మంచి వ్యక్తిగా, సంస్థ వ్యవస్థాపకుడిగా జీవించేందుకు బాలవికాస్ సాయపడింది. బాలవికాస్ చెప్పే ఐదు మానవతా విలువలే నా ఆభరణాలు".

నేను ఒక బాలవికాస్ టీచర్‌ను. వృత్తిరీత్యా కూడా ప్రభుత్వ పాఠశాల టీచర్‌నే. బాలవికాస్ పూర్వ విద్యార్థుల సంస్కారం ఎలా ఉంటుందో నా జీవితంలోని ఒక స్వానుభవం మీ ముందుంచుతాను. ఒకసారి తిరుపతిలో బాలవికాస్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. పుట్టపర్తి నుంచి బయల్దేరి కదిరిలో తిరుపతి వెళ్లే రైలు ఎక్కడానికి వెళ్లాను. మొదటి ప్లాట్ ఫాంకు రైలు వస్తుందని మొదట ప్రకటించారు. చివరి నుంచి ఐదో లేదా ఆరోది మీ బోగీ కావచ్చు' అని చెప్పారు. నేను నా రెండు లగేజీలతో వెళ్లి వారు చెప్పిన చోట ఉన్నాను. ఇంతలోనే తిరుపతి వెళ్లే రైలు రెండో నెంబరు ప్లాట్ ఫాంకు వస్తుందని ప్రకటన వచ్చింది. రెండు లగేజీలతో సుమారు కిలో మీటరు దూరంలోని బ్రిడ్జ్ ఎక్కి అటువైపుకు వెళ్లే సమయం లేదు. మరేం చేయలేక 'జై సాయిరాం!' అంటూ ప్లాట్ ఫాం దూకేసి, లగేజీలు పట్టుకుని 4 లైన్లు దాటి రెండో ప్లాట్‌ఫాం దగ్గర కెళ్లాను. అది చాల ఎత్తుగా ఉంది. అక్కడున్న వారిని సాయం చేయమని అడిగాను, వింతచూస్తున్నారు తప్ప సాయానికి రాలేదు. అప్పుడు నా వయస్సు 73 (ఇప్పుడు 78). ఐతే స్వామి దయవల్ల వేరే ఏ అనారోగ్యాలూ లేవు. కానీ జనం ఆత్రంగా చూస్తున్నారు. ఎందుకంటే, రెండు రైళ్లు ఒకేమారు వస్తున్నాయి. ఇంతలో సుమారుగా 20 ఏళ్ల వయస్సున్న ముగ్గురు అటూ వెళుతుండగా నేను 'హెల్ప్ - హెల్ప్' అని అడిగాను. వారు వెంటనే లగేజీలూ ఒకరు తీసుకోగా, మిగిలిన ఇద్దరూ నా రెండు చేతులూ దొరకపుచ్చుకుని ప్లాట్‌ఫాం పైకి లాగారు. రెండే నిముషాల సమయం. వెంటనే రెండు రైళ్లు వచ్చి ఆగాయి. ఆ ముగ్గురే నా బోగీ నెంబర్ అడిగి లగేజీలతో సహా ఎక్కించారు. ధన్యవాదాలు చెప్పి 'మీరెవరు? ఎక్కడికి వెళ్తున్నారూ?' అని అడిగాను. వారు "మేడం! మేము బాలవికాస్ పూర్తి చేసుకున్న విద్యార్థులం. కదిరిలో ఒక స్కూల్లో బాలవికాస్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తుంటే సాయం కోసం వచ్చాం." అని చెప్పారు. నేను చాలా ముచ్చట పడ్డాను. ఇదీ బాలవికాస్ ఇచ్చిన సంస్కారం.

నేను ప్రభుత్వ పాఠశాలల్లో 40 ఏళ్లు పనిచేశాను. నా విద్యార్థులకి బాలవికాస్ చెప్పేదాన్ని. వాళ్లలో చాలామంది ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, పోలీస్‌శాఖలోనూ, కొందరు ఉపాధ్యాయులుగా పనిచేస్తుండటం నాకు గర్వకారణం. బాలవికాస్‌లో నేర్చిన విలువలు పాటిస్తూ, ధర్మబద్ధమైన జీవనం గడుపుతున్నారు. ఇటీవల నన్ను కలిసిన కొందరు "మీరు ఆనాడు నేర్పిన మానవతా విలువలు పాటించడం వలన హాయిగా జీవిస్తున్నాం, మా ఉద్యోగాల్లో గుర్తింపు, గౌరవం వచ్చాయి" అని చెప్పారు. సేవలన్నింటిలోకీ ఉత్తమసేవ బాలవికాస్ సేవ.

ఎందరెందరో బాల వికాస్ పూర్వ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ ధర్మంగా జీవిస్తున్నా, బాలవికాస్‌లో తాము నేర్చుకున్న విషయాలను, ఎలా ఆచరిస్తూ లాభం పొందుతున్నారో చెప్తూనే ఉన్నారు. వారి ప్రవర్తన సత్యసాయి సంస్థలకే కాక, భారత దేశానికే మంచి పేరు తెస్తున్నది. స్వామి వారి అవతారతత్వాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ వారంతా ఆదర్శంగా ఉన్నారు. బాలవికాస్ గురువులుగా పనిచేయడం, బాలవికాస్ విద్యార్థులు కావడం రెండూ దైవానుగ్రహానికి పాత్రులను చేస్తాయి.

మానవతా విలువల గురించీ బాబా-
సత్య ధర్మ మహింసయు శాంతిప్రేమ
మానవుని పంచప్రాణాలు మహినిచూడ
పంచప్రాణాలలో ప్రేమ ఎంత హెచ్చు
కాన హృదయాన ప్రేమను గట్టిపరచు.

స్వామి ఇలా ప్రేమ అనే ఆయుధంతో అందరినీ సరిచేసి మానవసేవ చేయించడానికి పూనుకున్నారు. స్వామి సేవకూ అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. వారు పసితనంలోనే సేవచేసి ఆదర్శాన్ని అందించి ప్రభోధించారు. సేవ అహంకారాన్ని నిర్మూలిస్తుంది. స్వామి వారి మాటలు పాటిస్తూ -సత్యసాయి సంస్థలు అనేకానేక విధాలుగా సమాజ సేవ చేస్తూ లోకానికంతా ఆదర్శంగా ఉంటున్నాయి.

మానవుడు తనకూ, సమాజానికీ రెండింటికీ ఉపయోగించే విద్యను నేర్వాలి. తాను సుఖశాంతులను పొందుతూ సమాజానికీ సుఖశాంతులను అందించాలి. మనం కూడా సమాజంలో వ్యక్తులమే అయినందున సమాజం సుఖశాంతులతో ఉంటే మనమూ సుఖశాంతులతో ఉంటాం. సమాజానికీ వ్యక్తికీ అవినాభావ సంబంధం. శరీరమనే సమాజంలో కాలో చెయ్యో లాంటి వాడు వ్యక్తి. కనుక సమాజ క్షేమాన్ని నిరంతరం ఆలోచించే లాగా వ్యక్తి జీవించాలని బాలవికాస్, సత్యసాయి సేవా సంస్థా నేర్పుతున్నది.. ఆధ్యాత్మికత ఒంటబడితే హృదయం పవిత్రంగా ఉంటుంది. పిచ్చి పిచ్చి భావములచే మనస్సు కల్మషం కాదు నిర్మలమైన హృదయంతో, నిస్వార్థమైన కర్మలతో ఈ సమాజంలో పాల్గొని సమాజానికి తగిన సహాయం చేయ గలుగుతారు. సేవలో పాల్గొని దైవ దీవెనలు పొందగలుగుతారు. ఈ ఆధ్యాత్మిక విద్య వలన మానవత్వం మేల్కొంటుంది. ఆత్మశోధప మొదలవుతుంది.

విశ్వశాంతిని చేకూర్చు విధము నేర్చి
సంకుచిత భావముల నెల్ల సమయ జేసి
ఐకమత్యము సహజీవనాదికములు
సమత నేర్పునది గాదె సత్యసాయి విద్య.

ఆధ్యాత్మిక జ్ఞానం లభిస్తే 'ధర్మమూల మిదం జగత్' అని అర్థమవుతుంది. ధర్మమార్గాన పయనించే చాకచక్యం వస్తుంది.

The proper study of mankind is man baba

చివరిగా-బాలవికాస్ గురించి నేను చెప్పినది చాలా స్వల్పం. ఈ విషయాల గురించి మరింత తెలుసుకోగోరేవారు 'hymavathy Aduri': 'సత్యసాయి మహిమామృరి' యూట్యూబ్స్‌లో పూర్తిగా చూడవచ్చు. ప్రస్తుతం పుట్టపర్తిలోనే ఆశ్రమంలో స్వచ్ఛంద సేవ చేస్తూ జీవిస్తున్నాను.

సర్వేజనాఃసుఖినోభవంతు. జైసాయిరాం.
సత్యసాయి పాదార్చిత

ఆదూరి హైమవతీ శ్రీనివాసరావు

INTO YOUR LIFE, WE BRING LIGHT, WARMTH, & STRENGTH.

INTO YOUR LIFE, WE BRING SURYA ROSHNI.

Surya Roshni is the trusted companion bringing light, warmth, and care to every moment.
From purity in every sip to safe spaces, we bring innovation and reliability into your life.
Let's brighten up your world together!

Consumer Lighting | Steel & PVC Pipes | Fans | Appliances | Professional Lighting

I am SURYA | 50 YEARS OF TRUST | DURABLE PRODUCTS | ASSURED QUALITY

SURYA ROSHNI LIMITED | www.surya.co.in | surya | surya_roshni | surya.roshni | surya-roshni

Email: info@surya.in Tel.: +91-11-47108000

ప్రేమే తన సిద్ధాంతమని ప్రబోధించిన సత్యసాయి దానిని జీవితంలో ఆచరించి చూపారు. తన బోధనలతో దేశ, విదేశాలలో సైతం భక్తులను సంపాదించిన బాబా ఇతర సేవలతో పాటు ఆసుపత్రినే చూడని కుగ్రామానికి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను అందించారు.



వైద్యానా

అక్టోబర్ 4, 1956న పుట్టపర్తిలో శ్రీ సత్య సాయి జనరల్ హాస్పిటల్‌ను ప్రారంభించిన తరువాత ఆయన ఇక వెనుతిరిగి చూడలేదు. ఆగస్టు 28,1976 న బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లో సత్యసాయి సూపర్ హాస్పిటల్‌ను స్థాపించారు. నవంబర్ 22, 1991న పుట్టపర్తిలోనే సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను కూడా ప్రారంభించారు. అక్కడ కార్డియాలజీ, ఆఫ్తమాలజీ, ఆర్థో, యూరాలజీ రోగాలకు ఉచితంగా వైద్యం చేస్తారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి రోగులు వచ్చి.. వైద్యం పొందుతుంటారు.

వైద్యునికీ, రోగికీ మధ్య ప్రేమపూర్వక సంబంధాన్ని పెంపొందించడమే వైద్యం ప్రధాన ఉద్దేశమని, వైద్యా లయం.. ప్రేమాలయంగా మారాలని బాబా సూచించేవారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, గ్రామీణ ప్రజలకు సాధారణ చికిత్సల నుంచి ప్రసూతి సేవల వరకు ఉచితంగా అందిస్తున్నారు. అలాగే సంచార వైద్య యూనిట్ల ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రధానంగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబా స్థాపించిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో ఉన్నాయి. ఇవి పూర్తిగా ఉచితంగా (Free of Cost) వైద్య సేవలను అందిస్తున్నాయి.

1. శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ మెడికల్ సైన్సెస్ (SSSIHMS) (ప్రశాంతి నిలయం, పుట్టపర్తి, ఆంధ్రప్రదేశ్)

ఈ ఆసుపత్రి ప్రత్యేకత కార్డియాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ, ఆప్తాల్మాలజీ సేవలు అందుబాటులో ఉంచింది.

2. శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ మెడికల్ సైన్సెస్ (SSSIHMS) (వైట్‌ఫీల్డ్, బెంగుళూరు-బెంగళూరు, కర్ణాటక).

ఇక్కడ కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్స్, గ్యాస్ట్రో ఎంటరాలజీ, మొదలైన సమస్యలకు వైద్య సేవలు అందుతున్నాయి..

3. శ్రీ సత్యసాయి రాజేశ్వరి మెమోరియల్ ఆసుపత్రి (SSSIHMS) (తమిళనాడు). ఇది సూపర్ స్పెషాలిటీ కాదు, కానీ ముఖ్యమైన ఆసుపత్రి.

శ్రీ సత్యసాయి జనరల్ ఆసుపత్రి (ప్రశాంతి నిలయం, పుట్టపర్తి, ఆంధ్రప్రదేశ్.) ఇది సాధారణ చికిత్స కోసం ఉద్దేశించినది.

వీటితో పాటు, వివిధ రాష్ట్రాలలో గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అనేక శ్రీ సత్యసాయి జనరల్ ఆసుపత్రులు, వైద్య శిబిరాలు (SSSIHMS) చిన్నవి ఏర్పాటయ్యాయి.

అంతర్జాతీయంగా

సత్యసాయి సంస్థ (SSIO) ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో (ఉదాహరణకు, అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా) చిన్న క్లినిక్‌లు, దంతవైద్యశాలలు నిర్వహిస్తోంది. మొబైల్ మెడికల్ వ్యాన్లు (Mobile Medical Vans) ద్వారా కూడా వైద్య సేవలను అందిస్తోంది.

సత్యసాయి హాస్పిటల్ ప్రవేశ ప్రక్రియ (అడ్మిషన్)

శ్రీ సత్యసాయి హాస్పిటల్స్‌లో ప్రవేశ ప్రక్రియను సాధారణంగా రెండు దశలుగా విభజించారు: ఔట్ పేషెంట్ కన్సల్టేషన్ (OPD), ఆ తరువాత అవసరమైతే ఇన్ పేషెంట్ అడ్మిషన్. ఈ సంస్థలలోని అన్ని వైద్యసేవలు పూర్తిగా ఉచితం. కన్సల్టేషన్ కోసం అపాయింట్‌మెంట్ తీసుకోవడం అత్యంత శ్రేయస్కరం. మీరు సందర్శించాలను కుంటున్న నిర్దిష్ట ప్రాంతంలోని ఆసుపత్రి సహాయ డెస్క్ లేదా హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయవచ్చు. ఉదాహరణకు, వైట్‌ఫీల్డ్ (బెంగళూరు) ఆసుపత్రి కోసం హెల్ప్‌లైన్ నంబర్ 080-47104600ను సంప్రదించవచ్చు. ప్రశాంతి గ్రామం వంటివి, రోగి వివరాలు (పేరు, వయస్సు, అనారోగ్యం, సంప్రదింపు సమాచారం) మునుపటి వైద్య రికార్డుల ఫోటో కాపీలతో కూడిన కవరింగ్ లెటర్‌ను ఈమెయిల్ లేదా పోస్ట్ ద్వారా పంపాలని సూచిస్తున్నాయి.

SMS ధ్రువీకరణ: ఫోన్ ద్వారా బుకింగ్ చేస్తే, మీకు సాధారణంగా అపాయింట్‌మెంట్ తేదీ, సమయంతో కూడిన సందేశం అందుతుంది. మొదటి సందర్శన & స్క్రీనింగ్ (OPD)కు అవసరమైన మునుపటి వైద్య రికార్డులన్నింటినీ (ఏ సంస్థ నుండి అయినా) చెల్లుబాటు అయ్యే ఫోటో, చిరునామా రుజువును తీసుకురావాలి. ఆధార్ కార్డు (ప్రాధాన్యత) రేషన్ కార్డు ఓటరు ID, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ (విదేశీ పౌరులకు తప్పనిసరి). ఒక అటెండెంట్ తప్పనిసరి. వారికి అటెండెంట్ పాస్ ఇస్తారు. అపాయింట్‌మెంట్ sms లెటర్‌ను రోగి గేట్ వద్ద (ఉదాహరణకు, వైట్‌ఫీల్డ్ వద్ద గేట్ నెం. 2) భద్రతా సిబ్బందికి చూపితే మిమ్మల్ని తగిన విభాగానికి (ఉదాహరణకు, కార్డియాక్ లేదా న్యూరో) లేదా స్క్రీనింగ్, రిజిస్ట్రేషన్ బ్లాక్ (Srb)కి పంపుతారు. Srbలోని వైద్యులు మీ పరిస్థితిని మూల్యాంకనం చేస్తారు. రిజిస్ట్రేషన్ చేసి సంబంధిత కార్డు ఇస్తారు.

ప్రత్యేక వైద్యులతో సంప్రదింపుల కోసం తగిన

ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (OPD)కి పంపుతారు.

ఆసుపత్రిలో అడ్మిషన్ అనేది ఆయా శాఖలలోని ప్రత్యేక వైద్యులు శస్త్రచికిత్స లేదా తదుపరి చికిత్స కోసం అడ్మిట్ అవ్వాలని సూచించిన రోగులకు మాత్రమే.

ఫిట్‌నెస్ స్క్రీనింగ్: అడ్మిషన్ రోజున, మిమ్మల్ని మళ్లీ వైద్యులచే పూర్తిగా స్క్రీనింగ్ చేస్తారు. శస్త్రచికిత్స కోసం నిర్ధారించిన తర్వాత మాత్రమే అడ్మిట్ చేసుకుంటారు.

వెయిటింగ్ లిస్ట్: సంక్లిష్ట ప్రక్రియల కోసం, వెయిటింగ్ లిస్ట్ ఉండవచ్చు, మీ వంతు వచ్చిన వెంటనే మీకు కాల్ వస్తుంది. వైద్య అవసరాన్ని బట్టి షెడ్యూలింగ్‌కు తరచుగా ప్రాధాన్యత ఇస్తారు. అప్పుడు వైద్య రికార్డులను మళ్లీ (SSSIHMS నుండి ఏవైనా రికార్డులతో సహా) తీసుకురావాలి.

ప్రత్యేకతలు: ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రులు (వైట్‌ఫీల్డ్ , ప్రశాంతి గ్రామం) ప్రధానంగా గుండె (Cardiac) నరాల (Neoro) రుగ్మతలలో ప్రత్యేకత సేవలు అందించేవిగా ఉన్నాయి. అయినప్పటికీ ఇతర ప్రత్యేకతలు కొన్ని ప్రాంతాలలో అందుబాటులో ఉండవచ్చు.

తిరిగి సందర్శన/ఫాలో-అప్: మీరు ఫాలో-అప్ రోగి అయితే, మీ డిశ్చార్జ్ సారాంశంలో పేర్కొన్న తేదీన మాత్రమే ఆసుపత్రికి రావాల్సి ఉంటుంది.

ఇన్ని నిబంధనలు ఉన్నప్పటికీ వీటి నుంచి ప్రయోజనాలు పొందిన వారు వేలల్లో ఉండడం గమనార్హం.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు

శ్రీ సత్యసాయి సేవా మెడికల్ మిషన్ అనతి కాలంలోనే దేశవ్యాప్తంగా విస్తరించింది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలకు అవగాహన కల్పించేందుకు బృందాలను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, ఆరోగ్యకర జీవనం అవశ్యకత గురించి అవగాహన కల్పిస్తున్నారు. భారతదేశం అంతటా 'సాయి కృపాస్' అనే పేరుతో ఉచిత వైద్య కేంద్రాలు ఉన్నాయి. మే 24,2024న లద్దాక్‌లో శ్రీ సత్యసాయి ఆసుపత్రిని, వృద్ధాశ్రమాన్ని ట్రస్టు సభ్యులు ప్రారంభించారు.

సత్యసాయి శివైక్యం పొందిన తర్వాత కూడా సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ ఆధ్వర్యంలో ప్రతి నెల వివిధ వైద్య సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఈ సంస్థలను ప్రభుత్వం సరైన విధంగా ఉపయోగించుకోవడం లేదు. ముఖ్యంగా ఇక్కడ మెడికల్ కాలేజీల ఏర్పాటు ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుంది.



రాజేంద్ర ప్రసాద్



'జలమే జీవనాధారం, నీరు లేనిచోట జీవితం లేదు. ఎక్కడ దాహార్తి ఉందో అక్కడ సేవ చేయాలి!'

– సత్యసాయిబాబా



లక్షల గొంతుకల దప్పిక

కరవు, ఫ్లోరైడ్ బారిన పడిన లక్షలాది మంది గ్రామీణ ప్రజల దాహార్తి తీరుస్తున్నదే శ్రీ సత్యసాయి జాతీయ తాగునీటి మిషన్. కరవు పీడిత అనంతపురం జిల్లాకు, ఇతర ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న బాబా సంకల్ప ఫలితమిది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఈ పథకాన్ని ప్రారంభించి, లక్షలాది మంది ప్రజల దాహార్తి తీరుస్తున్నది. "రాయలసీమకు ఏడాది పొడవునా నీటి సరఫరా ఉండేలా చూసుకోవాలి. నేడు ఇది రాళ్లసీమ. రత్నాల సీమగా మార్చాలి" అని ఆయన అన్నారు.

జాతీయ తాగునీటి పథకం ప్రధానాంశాలు
పథకం పరిధిలో గ్రామాలు 750
నీరు అందుకుంటున్న ప్రజలు 900 000
పథకం ఎంతమంది కోసం 1,120,000
పథకం వ్యయం $63 మిలియన్ అమెరికన్ డాలర్లు

అనంతపురం జిల్లా తరచూ కరవు బారిన పడుతూ ఉంటుంది. తాగేందుకు గుక్కెడు సురక్షితమైన నీరు కూడా దొరకని పరిస్థితి. ఈ దుస్థితిని చూసి చలించిన సత్యసాయిబాబా, సాధ్యమైనంత తక్కువ సమయంలో ఎక్కువ మందికి స్వచ్ఛమైన నీటిని అందించాలని ట్రస్ట్‌ను ఆదేశించారు. బాబా ఆదేశంతో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ 1995లో అనంతపురం జిల్లాలోని గ్రామాలకు స్వచ్ఛమైన నీటి సరఫరా ప్రాజెక్టుకు సన్నాహాలు ప్రారంభించింది. ఆధునిక సాంకేతికతతో, పెద్ద ఎత్తున అమలు చేసి, వేలాది గ్రామాలకు నీటిని అందించింది. కానీ కొన్ని ఒడుదొడుకులు ఎదురైనప్పటికీ నేటికీ పథకాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. 1998లో ప్రభుత్వం ఈ పథకం నిర్వహణ బాధ్యతలను ఎల్‌అండ్‌టీ సంస్థకు అప్పగించింది. కార్మికుల జీతాలు, మరమ్మతులకు నెలకు రూ.2 కోట్ల వరకు ఖర్చు ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించడం లేదనే కారణంతో ఈ పథకం నిర్వహణ నుంచి గత ఏడాది జూన్‌లో ఆ సంస్థ తప్పుకుంది. అప్పట్నుంచి సత్యసాయి తాగునీటి పథకం బోర్డు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



దైనందిన అవసరాల కోసం నీళ్ల తెచ్చుకునేందుకు గతంలో ప్రజలు భరించలేని వేడిలో చాలాదూరం నడవాల్సి వచ్చేది. జీవితకాలంలో ఎక్కువ సమయం ఆ పనికే సరిపోయేది. ఈ పరిస్థితిని నివారించి జనాభాకు తాగునీటిని అందించడానికి ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణానికి సత్యసాయి పూనుకున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం ఉంటుంది. చాలా జిల్లాల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉంటుంది. ఇక అనంతపురం జిల్లా రాష్ట్రంలోని అత్యంత కరవు, వెనుకబడిన జిల్లాల్లో ఒకటి. జిల్లాలో ప్రవహించే మూడు ప్రధాన నదులు పెన్నా, హగరి, చిత్రావతి వేసవి నెలల్లో పూర్తిగా ఎండిపోతాయి. వీటికి తోడు చెరువులు కూడా సంవత్సరంలో ఎక్కువ భాగం ఎండి ఉంటాయి. భూగర్భజలాలు పాతాళానికి చేరుకుంటాయి. అందుబాటులో ఉన్న భూగర్భజలాల్లో కూడా ఉప్పునీరు, ఫ్లోరైడ్ ఎక్కువ. అధిక ఫ్లోరైడ్ ఫ్లోరోసిస్‌కు కారణమవుతోంది, ఇది ఎముకలు, దంత వైకల్యాలకు దారితీస్తోంది. ఏమైనా అనంతపురం ప్రజలు దశాబ్దాలుగా తాగడానికి నీరు దొరక్క బాధపడుతున్నారు.

మొదటి దశలో అనంతపురం జిల్లాలో వీలైనంత ఎక్కువ మందికి ఏడాది పొడవునా సురక్షితమైన తాగునీటిని అందుబాటులో ఉన్న ఆనకట్టలు, కాలువలు నదీతీరాల నుండి కుళాయిల ద్వారా అందించాలని నిర్ణయించారు. జలా శయాలు, బూస్టర్

తీర్చిన సత్యసాయి

పంపులు, పైపుల విస్తృత నెట్‌వర్క్ ద్వారా అందించారు. మొదటి దశలో లబ్ధి పొందని ప్రజలకు సేవ చేయడానికి 2013, 2015లో ఎస్‌డీజీల ప్రారంభానికి ట్రస్ట్ రెండో దశను ప్రారంభించింది.

2001లో ట్రస్టు ఈ నమూనాలను పునరావృతం చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని మెదక్, మహబూబ్ నగర్ జిల్లాల్లోని మరో 320 గ్రామాలకు త్రాగునీటిని అందించింది. 2007నుంచి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో లక్షల మందికి మందికి సేవలందిస్తున్నది. ప్రాజెక్టులను ట్రస్ట్ రూపొందించి అమలు చేసింది. భూమి, సాంకేతిక నైపుణ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించింది. ఆనకట్టలు, కాలువలు, నదీ పడకల నుండి అందుబాటులో ఉన్న చోట నదీ జలాలను శుభ్రం చేసి ఆపై నిల్వ జలాశయాలు, బూస్టర్ పంపులు పైపుల విస్తృత నెట్‌వర్క్ ద్వారా నీటిని అందించడం ఈ పథకంలో ప్రధాన వ్యూహం.

ఇప్పటికే ఉన్న నీటిపారుదల ఆనకట్ట నుండి నీటిని తీసుకొని, పైపులైన్ల ద్వారా గ్రామాలకు పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం, పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి నీటిని శుద్ధి చేయడానికి ఇసుక వడపోత వ్యవస్థకు పంపు తున్నారు. అక్కడి నుండి కల్యాణదుర్గం, ఆత్మకూరు, ఉదిరిపికొండలోని దాదాపు 93 గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు.

కొన్ని ప్రాంతాలలో భూగర్భ ప్రవాహాల నుండి నీటిని తోడడానికి ఇన్ఫిల్ట్రేషన్ బావులను నదీగర్భాలలో తవ్వారు. ఈ బావుల నుండి ఏడాది పొడవునా భూగర్భ నీటిని తీసుకొని ఒక సేకరణ బావికి అందిస్తారు. అక్కడ నుండి పంపు వ్యవస్థ ద్వారా అనేక ప్రదేశాలకు పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం చిత్రావతి, హగరి, పెన్నా నదుల ఒడ్డున బావులను తవ్వారు. తీవ్ర వేసవి పరిస్థితుల్లో ఉపరితల నీరు ఎండిపోయే ప్రదేశాలలో ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. వర్షాకాలంలో తుంగభద్ర కాలువ నుండి నీటిని తోడి వేసవి నిల్వ ట్యాంకులకు సరఫరా చేస్తారు. ఎండా కాలంలో వీటి నుండి నీటిని పంప్ చేస్తారు. వేసవి నిల్వ ట్యాంకులు దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. లోతైన బోర్‌వెల్‌లను తవ్వి, నీటిని బయటకు తీయడానికి సబ్‌మెర్సిబుల్ పంపులను ఏర్పాటు చేశారు. భూగర్భజలాలు తగినంతగా ఉన్న,అధిక ఫ్లోరైడ్ కంటెంట్ లేదని తేలిన చోట ఈ విధానాన్ని ఉపయోగిస్తున్నారు.

ఈ ప్రాజెక్టు మొదటి దశను నవంబర్ 18, 1995న అప్పటి ప్రధాని పి.వి. నరసింహా రావు ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటో రియంలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రారంభిం చారు. వివిధ సంస్థల నుండి అంకిత భావంతో కూడిన కార్మికుల బృందం మాత్రమే కాకుండా, ఈ దైవిక ప్రాజెక్టును విజయవంతం చేయడానికి తమ వంతు కృషి చేసిన వేలాది మంది కారణంగా పద్దెనిమిది నెలల రికార్డు సమయంలో ఇది పూర్తయింది.

ప్రాజెక్ట్ - రెండో దశ

అనంతపురం జిల్లాలోని బుక్కపట్నం, కొత్త చెరువు, పుట్టపర్తి మండలాల్లో భూగర్భ జలాలు బాగా తగ్గిపోయాయి. బోరు బావుల సాధారణ లోతు 600 అడుగుల కంటే ఎక్కువ. దీనికి తోడు ఈ మండలాల్లోని దాదాపు అన్ని నివాస ప్రాంతాలలో నీటిలో అదనపు ఫ్లోరైడ్ ప్రభావం ఉంది. ఫ్లోరైడ్ శాతం 2 పిపిఎమ్ నుంచి 4 పిపిఎమ్ వరకు ఉంది. ఈ అదనపు ఫ్లోరైడ్ రుమాటిక్ ఆర్థరైటిస్, దంత క్షయం, పేగు సమస్యలు వంటి తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలకు కారణమవుతోంది.

2013లో ట్రస్ట్ ఆ మూడు మండలాల్లోని 118 ఆవాసాలకు నీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించింది, ఇది 1995 నాటి అనంతపురం నీటి సరఫరా ప్రాజెక్టు పరిధిలోకి రాలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ట్రస్ట్ ప్రతిపాదనను అంగీకరించి, ప్రాజెక్టుకు అవసరమైన భూమి, నీటిని అందించడంతో పాటు విద్యుత్ సంస్థాపనల ఖర్చు భరించడానికి ముందుకు వచ్చింది. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అన్ని పన్నుల నుండి మినహాయించింది. ఈ పథకం, మునుపటి పథకంలా సురక్షితమైన తాగునీటిని అందిస్తోంది. ఈ ప్రాజెక్టుకు పెద్దకోట్ల వద్ద ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్

అనంత నుంచి నేపాల్ వరకు...

సత్యసాయి జల పథకం శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్వహణలోనిది. ఇదొక గొప్ప ప్రజా ప్రయోజనం కలిగిన, ఎంతో విస్తృతి కలిగిన, చరిత్రాత్మకమైన పథకం. అనంతపురం జిల్లాకే ఇది పరిమితం కాలేదు. చెన్నై, కేరళ రాష్ట్రాలతో పాటు నేపాల్‌లోను తరచు దుర్భిక్షం బారిన పడే, తాగునీటి సమస్యతో సతమతమయ్యే ప్రాంతాలకు ఈ పథకం నీరు అందిస్తున్నది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని అనంతపురం, ఉభయ గోదావరి జిల్లాలు, మెదక్, మహబూబ్‌నగర్‌లకు తాగునీరు అందిస్తున్నది. అలాగే చెన్నైలోని కొన్ని ప్రాంతాలను కూడా ఆదుకుంటున్నది. కమ్యూనిటీ నిధులతో నిర్వహిస్తున్న సామాజిక పథకాలలో ఇది మకుటాయమానమైనది. నమూనా వంటిది. సుదీర్ఘ పైప్‌లైన్ నెట్‌వర్క్, స్వచ్ఛంద సేవకుల అంటే బాబా భక్తుల మద్దతుతో ఈ పథకం నిర్విఘ్నంగా సాగుతున్నది. ఇది ప్రపంచంలోనే సేవా దృక్పథంతో నీరు అందిస్తున్న పెద్ద పథకాలలో చోటు సంపాదించుకున్నది. పథకం పరిధిలో 750 గ్రామాలు ఉన్నాయని చెబుతున్నా, వాస్తవంగా 1000 గ్రామాలు లబ్ధి పొందుతున్నాయి. ఫ్లోరైడ్ వంటి ప్రాణాంతక పదార్థాలతో భూగర్భ జలాలు కలుషితమైన ప్రాంతాల ప్రజలను ఆదుకోవడమే దీని లక్ష్యం. ఇందుకోసం వందల కిలోమీటర్ల పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటయింది. నేపాల్‌లో ఒక్క గ్రామం కోసమే 36 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేశారంటే ట్రస్ట్ నిబద్ధతను అంచనా వేయవచ్చు.

అనంతపురంలోని గ్రామాలకు నీరు అందించడానికి 1995–1997 మధ్య తుంగభద్ర కాలువ ద్వారా 1.2 మిలియన్ (పన్నెండు లక్షలు) ప్రజలకు అందించేందుకు ఈ పథకం ఆరంభించారు. అంతకు రెండు సంవత్సరాలకు ముందు దీని రూపకల్పనకు బీజం పడింది. తరువాత ఆంధ్రప్రదేశ్‌లోని కొంత సాగుభూమికి నీరు అందిస్తూ చెన్నై నగరానికి కూడా మంచినీరు అందించే పని చేపట్టారు. కేరళలో దీనినే ప్రేమధార పథకం అని పిలుస్తారు. బస్టాండ్‌లలో, ఆసుపత్రులలో పరిశుభ్రమైన నీరు అందించడానికి ఉద్దేశించినది.

రిజర్వాయర్ నుండి నీటిని తరలిస్తున్నారు. 2.5 లక్షల జనాభాకు నీటిని అందించే సామర్థ్యంతో 411 కిలోమీటర్ల పైప్‌లైన్ వేశారు. పెద్దకోట్ల వద్ద హెడ్‌వర్క్స్ నిర్మాణం చేశారు. మద్దాల చెరువు వద్ద 10 ఎం ఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. అప్పరచెరువు, కృష్ణాపురం రోడ్డు క్రాస్, కేశాపురం, కొత్తచెరువు వద్ద 5 సంపులు, కొత్తచెరువు (హిల్లాక్), పెడపల్లి టన్నెల్ వద్ద 2 గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు ఏర్పాటు చేశారు. ఇవి ఇంటర్మీడియట్ స్టేషన్లుగా పనిచేస్తున్నాయి. వివిధ ప్రదేశాలలో ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు పంప్ హౌస్‌లు నిర్మించారు.

అన్ని ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత వాటిని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించారు. నేటికీ ఈ ప్రాజెక్టులను అది విజయవంతంగా నిర్వహిస్తోంది. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో సహా ఇతర ప్రదేశాలలో ఎస్‌డీజీలకు మద్దతు ఇవ్వడానికి ఈ ప్రాజెక్టులను నమూనాగా చేయవచ్చు. ఇందులో వివిధ వ్యాసాలు కలిగిన దాదాపు 2000 కిలోమీటర్ల పైప్‌లైన్ ఉపయోగించారు.

లక్ష నుండి 25 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 43 సమ్పుల నిర్మించారు. 3 లక్షల లీటర్ల నుండి 10 లక్షల లీటర్ల వరకు సామర్థ్యం కలిగిన 18 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు కొండల పైభాగంలో నిర్మించారు. 270 ఓవర్ హెడ్ రిజర్వాయర్ల నిర్మించారు. ఇలాంటి ఎంతో సాంకేతిక సహకారంతో పథకం నడుస్తున్నది.

ఈ ప్రాజెక్టుకు భారత ప్రభుత్వం నుండి చాలా ప్రశంసలు లభించాయి. ఈ ప్రాజెక్టును ప్రశంసిస్తూ ట్రస్ట్‌కు రాసిన తొమ్మిదవ పంచవర్ష ప్రణాళిక పత్రం వాల్యూమ్–2 (పాయింట్ 3.7.43)లో "పుట్టపర్తికి చెందిన శ్రీ సత్యసాయి ట్రస్ట్, ఏ రాష్ట్ర బడ్జెట్ మద్దతు లేకుండా, సొంతంగా అమలు చేయడంలో ప్రైవేట్ రంగానికి అసమానమైన ఉదాహరణగా నిలిచింది. రూ. 250 కోట్ల వ్యయంతో భారీ నీటి సరఫరా ప్రాజెక్టును చేపట్టింది, దీని ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో 730 కొరత, ఫ్లోరైడ్ లవణీయత ప్రభావిత గ్రామాలు, కొన్ని పట్టణాలకు దాదాపు 18 నెలల కాలపరిమితిలో ప్రయోజనం చేకూర్చింది. ఈ విప్లవాత్మక ప్రయత్నాన్ని వ్యాపార సమూహాలు, ట్రస్టులు,ఫౌండేషన్లు ప్రోత్సహించాలి." అని ఉంది.

గ్రామీణ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా చేసిన మార్గదర్శక సేవకు గుర్తింపుగా, భారత ప్రభుత్వ తపాలా శాఖ నవంబర్ 23, 1999న ఒక తపాలా బిళ్ల, కవర్ విడుదల చేసింది.

– శంకర్ ప్రసాద్

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ప్రేమ, దయ, సేవ, ధార్మికతలకు నిలువెత్తు రూపం. ఆధునిక కాలంలో ఆధ్యాత్మికతను సులభంగా ప్రజల హృదయాలకు చేరువ చేసి, ధర్మాన్ని జీవన విధానంగా స్థాపించిన మహా పూర్ణావతారం.

ప్రేమ స్వరూపుడు

పుట్టపర్తి అనే సాధారణ గ్రామంలో అవతరించిన ఈ దివ్య స్వరూపుడు, బాల్యదశ నుంచే ప్రేమ, కరుణ, అద్భుతాలతో ప్రపంచాన్ని ఆకర్షించారు.

బాబా బోధనలు చాలా సరళమైనవైనా, అర్థవంతమైన లోతు కలిగినవి. ఆయన మానవజాతికి అందించిన ఐదు జీవన సూత్రాలు ఇవే:

సత్యం -ధర్మం - శాంతి - ప్రేమ - అహింస

ఈ ఐదు విలువలు మానవ జీవితానికి మూల స్తంభాలు అని ఆయన నిత్యం బోధించేవారు. మతం, జాతి, ప్రాంతం అనే భేదాలు లేని "విశ్వ సోదర భావం" ఆయన సందేశం.

"అన్ని ఆధ్యాత్మిక గ్రంథాల సారాంశం ఒక్కటే అదే మానవ ప్రేమ" అనే సత్యాన్ని ఆయన జీవితం అంతా నిరూపిం చేరు. మానవ సేవే మాధవ సేవ, సేవామూర్తి సత్య సాయి. బాబా మాటలు మాత్రమే కాదు, ఆయన జీవితమే సేవకు ప్రత్యక్ష ఉదాహరణ. ఆరోగ్యం ప్రపంచ స్థాయి నాణ్యతతో, పూర్తిగా ఉచితంగా వైద్యసేవలను అందించే శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, బాబా దివ్య కరుణకు చిరస్మరణీయ చిహ్నాలు.

మానవీయ విలువలను విద్యతో రంగరించడం అనే గొప్ప సంకల్పంతో శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్స్ఆఫ్ హయ్యర్లెర్నింగ్ స్థాపించి ఉచిత విద్య ద్వారా, విలువల ఆధారిత విద్యను అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో వేలాది గ్రామాలకు శుద్ధ తాగునీటిని అందించిన భారీ నీటి ప్రాజెక్టులు (సాయి గంగ) బాబా మానవతా దృష్టిని స్పష్టంగా చిత్రిస్తాయి.

సార్వత్రిక సోదరభావానికి ప్రతీక పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం. హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, సిక్కు మతాల ప్రార్థనలు ఒకే స్థలంలో ధ్వనించే, ప్రపంచమంతా ఐక్యంగా కలిసే ఆధ్యాత్మిక ధ్యాన క్షేత్రం. బాబా దర్శనం, అభయదానం, ఆయన చూపించిన అనేక లీలలు భక్తుల విశ్వాసాన్ని మరింత లోతుగా బలపరిచాయి.

ఆయన చెప్పిన సారాంశం ఒక్కటే:

"అందరిని ప్రేమించు.. అందరిని సేవించు.. ఎవరిని బాధించకు."

ఏప్రిల్ 24, 2011న ఆయన దివ్యశరీరం వీడినప్పటికీ, ప్రేమ, సేవ, శాంతి అనే వారి సందేశం నేటికీ ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా ఉంది. ప్రపంచంలోని 150కిపైగా దేశాలలో సాయి సంస్థలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాయి. ఈ సంవత్సరం జరుగుతున్న శ్రీ సత్యసాయి శతాబ్ది మహోత్సవాల్లో, నవంబర్ 23న కోట్లాది భక్తులు ప్రపంచవ్యాప్తంగా ఆయన పుట్టిన రోజును అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

శ్రీ సత్యసాయి బాబా ప్రేమకు జీవ రూపం, సేవకు మూల ప్రతిరూపం, శాంతికి శాశ్వత మార్గదర్శి. ఆయన బోధనలు మానవుల హృదయాలలో దాగి ఉన్న దైవత్వాన్ని మేల్కొలిపే దివ్య చిహ్నాలు.

విస్సాప్రగడ సాయి
న్యాయవాది, పుట్టపర్తి

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి శత జయంతి వేడుకల శుభాకాంక్షలు
(1926-2025)

తల్లి భారతి ముద్దుబిడ్డ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబ ప్రపంచానికి ఆధ్యాత్మిక మార్గదర్శకులు,
సేవా-త్యాగం గురించి బోంధించి ఆచరణలో చూపి, నడియాడిన దైవ స్వరూపులు.
అనంతపురం, పాలమూరు మెదక్, ఆంధ్రలో మరికొన్ని జిల్లాలకు
నీటి వసతిని కల్పించిన అపర భగీరథుడు అనంతపురంలోని పుట్టపర్తిని దర్శించి
మన జీవిత మార్గాన్ని మరింత మెరుగులద్దుకోవాలని కోరుతూ ప్రేమతో...

ఏడుదొడ్ల శ్రీనివాస్‌రెడ్డి
ప్రాంత ధర్మజాగరణ కోశాధికారి
భాగ్యనగరం

ఏడుదొడ్ల వివేక్ వర్ధన్ రెడ్డి
ఎల్.ఐ.సి అభివృద్ధి అధికారి
వనస్థలిపురం,భాగ్యనగరం



బాబా నిస్వార్థ ప్రేమ, సేవ అమరం..!

2016లో, ఛత్తీస్‌గఢ్, నవ రాయ్‌పూర్‌లో శ్రీ సత్యసాయి సంజీవని సూపర్-స్పెషాలిటీ హాస్పిటల్ ఫర్ చైల్డ్ హార్ట్ కేర్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ "భగవాన్ శ్రీ సత్యసాయి బాబా చూపిన మహిమాన్వితులుగా ప్రపంచానికి సుపరిచితులు. ఆయన చేసిన చాలా మహిమలు నాకు తెలుసు. కానీ ఆయన చూపించిన గొప్ప మహత్మ్యం ఏదైనా ఉందంటే అది శాశ్వతమైన నిస్వార్థ ప్రేమ, సేవ. ఆ మహత్మ్యం విద్య, ఆరోగ్య సంరక్షణ, తాగునీటి సరఫరా, గ్రామీణ అభ్యున్నతి రంగాలలో బృహత్ సేవా ప్రాజెక్టులుగా వ్యక్తమైంది. ఆచారాలు, మతపరమైన ఆచారాల నుండి ఆధ్యాత్మికతను విముక్తి చేసి, దానికి సామాజిక సంక్షేమం కోణాన్ని ఇచ్చిన ఘనత భగవాన్ బాబాకు చెందుతుంది. ఆయన చేతుల్లో ఆధ్యాత్మికత సామాజిక సేవ మానవ సంక్షేమానికి ఒక సాధనంగా మారింది" అన్నారు.

బాబా జీవితానికి అనంతమైన ప్రేమ ద్వారా మానవాళిని మార్చడమనే ఏకైక లక్ష్యం ఉంది. ఆయన అసమానమైన సేవా కార్యక్రమాల ద్వారా తన లక్ష్యాన్ని ముందుకు నడిపించారు. విశేషమేమిటంటే, ఆయన స్వయంగా మే 25, 1947న తన అన్నయ్యకు రాసిన లేఖలో ఈ లక్ష్యాన్ని ప్రకటించారు. ఆ లేఖలో

"అఖిల మానవులకు ఆనందమును అందించుటే దీక్ష నాకు / ధర్మమార్గము వీడి చరియించువారల చేపట్టి కాపాడుటే వ్రతము నాకు బీదసాదలకు పెనుబాధ తొలగించి లేమిని బాపుటే ప్రేమ నాకు" అని పేర్కొన్నారు.

బాబా ఒక సందర్భంలో దేవుడికి నిర్వచనం సంపూర్ణమై నిస్వార్థ ప్రేమ అని ప్రకటించారు. మానవులకు బాధలు ఆధ్యాత్మిక అజ్ఞానం, భౌతిక లేమి అనే రెండు కారణాల నుండి పుడతాయి. బాబా లేఖలోని మొదటి రెండు పంక్తులు ఆధ్యాత్మిక సాధనను సూచిస్తాయి. మూడవది భౌతిక సాధనను సూచిస్తుంది. తద్వారా ఆయన తన జీవితాన్ని మానవాళి సమగ్ర ఉద్ధరణకు అంకితం చేశారు.

ఆయన విద్య, ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, తాగునీటి సరఫరా, గ్రామీణాభివృద్ధిలో స్థాపించిన అద్భుతమైన సేవా ప్రాజెక్టులు ఆయన కరుణకు నిదర్శనాలు. ఖలీల్ జిబ్రాన్ పేర్కొన్నట్టుగా "ప్రతి ప్రవక్తకు రెండు హృదయాలు ఉంటాయి. వాటిలో ఒకటి మన కష్టాలను తీర్చడానికి రక్తాన్ని చిందిస్తుంది. మరొకటి మన అజ్ఞానాన్ని భరిస్తుంది". బాబా మానవాళి కష్టాలను తనవిగా భావించి వాటిని తీర్చారు.

2011లో బాబా తన భౌతికమైన శరీరాన్ని విడిచిపెట్టినప్పుడు, ఆయన విస్తారమైన లక్ష్యం ఏమవుతుందని చాలామంది ఆశ్చర్యపోయారు. ఆయన లేని లోటుతో అది అంతర్ధానమైపోతుందా? అని ఆందోళన చెందారు. అయినప్పటికీ, ఆయన గురించి బాగా తెలిసినవారు ఆయన లక్ష్యం ఎప్పుడూ ఆయన భౌతిక రూపానికి కట్టుబడి ఉండదని అర్థం చేసుకున్నారు.

ఆయన శతజయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న ఈ తరుణంలో, ఈ సత్యం మరింతగా ప్రకాశిస్తుంది. సామ్రాజ్యాలు పుడుతుంటాయి, పడిపోతుంటాయి. సాంకేతికత మానవ జీవితం రూపురేఖలను మార్చివేస్తుంటుంది. భావజాలాలు వస్తుంటాయి, పోతుంటాయి. ఇంత జరుగుతున్నా కానీ లక్షలాది మంది హృదయాలలో చెక్కుచెదరకుండా ఉన్నది బాబా అనంతమైన ప్రేమ. వర్తమానంలో, మధుసూదన్ సాయి జీవితంలో, పనిలో ఇదే విధమైన ప్రేమ వ్యక్తమవుతుండటాన్ని నేను చూశాను.

బాబా విద్యా సంస్థలలో విద్యార్థిగా ఎదిగిన మధుసూదన్ సాయి బాబా తన లక్ష్యాన్ని కొనసాగించడానికి ఎంచుకున్న ఒక సాధనంగా నిలిచారు. ఆయన బాబా వారసత్వాన్ని అచంచలమైన భక్తితో ముందుకు తీసుకొని వెళుతున్నారు. బాబా విద్య, ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం ఆధ్యాత్మిక అభ్యున్నతిలో స్థాపించిన సంస్థలు కేవలం సంస్థలు మాత్రమే కాదు, అవి బాబా ఇచ్చిన మాటకు, సంకల్పానికి సజీవ సాక్ష్యాలు.

బాబా లక్ష్యం మధుసూదన్ సాయి ద్వారా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. నాకు అత్యంత స్ఫూర్తినిచ్చేది గొప్పదైన ఆయన పని తీరు మాత్రమే కాదు, నిష్కలష్మమైన దాని ప్రేరణ కూడా. ఏమీ ఆశించని ప్రేమ, షరతులు లేని సేవ ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ స్ఫూర్తి బాబా ఇచ్చిన మాట ఎప్పటికీ విఫలం కాదని నిర్ధారిస్తోంది.

మధుసూదన్ సాయి ఒక దశాబ్దంలోనే భారత దేశంలో, శ్రీలంక, ఫిజి, నైజీరియాలలో పన్నెండు ప్రపంచ స్థాయి ఉచిత ఆసుపత్రులను నెలకొల్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత పీడియాట్రిక్ కార్డియాక్ ఆసుపత్రుల గొలుసును ఏర్పాటు చేశారు. విద్యారంగానికి సంబంధించి, ప్రాథమిక పాఠశాల నుండి విశ్వవిద్యాలయం వరకు హాస్టల్, వ్యక్తిగత ఖర్చులు సహా అన్ని రుసుములను తొలగించారు. ఒక విశ్వవిద్యాలయం, ప్రపంచంలోనే మొట్టమొదటి పూర్తిగా ఉచిత ప్రైవేట్ గ్రామీణ వైద్య కళాశాల సహా ముప్పైకి పైగా విద్యాసంస్థలను స్థాపించారు. ప్రతిరోజూ ఉదయాన్నే కోటి మంది పిల్లలకు పోషకాహారం అందించేలా ఆయన చేపట్టిన కార్యక్రమం భారతదేశంలోనే అతిపెద్దదిగా మారింది. ఆయన బాబా సందేశాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు విదేశాలలో పదకొండు ఆధ్యాత్మిక, సేవా కేంద్రాలను కూడా స్థాపించారు. బాబా తాను ఎంచుకున్న శిష్యుడి ద్వారా తన ప్రేమను అందరికీ పంచుతున్నారు. ఆయన బోధనలు కాలాతీతమైనవి.

నేను బాబా ద్వారా పవిత్రమైన ఈ కార్యాచరణ ఆవిర్భావాన్ని, మధుసూదన్ సాయి ద్వారా దాని అద్భుతమైన విస్తరణను ప్రత్యక్షంగా చూశాను. అందువల్ల ఇది కేవలం కొన్ని దశాబ్దాల కథనం కాదని ధ్రువీకరించగలను. ఇది శాశ్వతంగా కొనసాగే ప్రేమపూర్వకమైన ఒక సేవా ప్రస్థానం. బాబా మానవాళికి మార్గనిర్దేశం చేస్తూ, మానవాళిని ప్రేమిస్తూ, ఉద్ధరిస్తూ నిత్యం మనతోనే ఉంటారు.

బి.ఎన్. నరసింహమూర్తి
ఛైర్మన్, ప్రశాంతి బాలమందిర్ ట్రస్ట్.
చీఫ్ మెంటార్, శ్రీ సత్యసాయి లోక సేవ
గోకులం గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్.
తొలి ఛాన్సెలర్, శ్రీ సత్యసాయి యూనివర్శిటీ ఫర్ హ్యూమన్ ఎక్సెలెన్స్.

నాన్న నుంచి నా దాకా..!

సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు అంతటా ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కళ్లు తెరవగానే ఎదుట నిలిచిన బాబా గురించి ఒక సామాన్యుడి అనుభవానికి ఇది అక్షర రూపం. బాబాను నాకు పరిచయం చేసిన నాన్నతో ఈ సంగతిని మొదలుపెడతాను. నాలుగు దశాబ్దాల నాటి ముచ్చట ఇది. నాన్న వ్యక్తిగత, వృత్తి వ్యాపకాల్లో గందరగోళంతో సంసార సాగరాన్ని ఈదుతున్న కాలమది. ఆయనకు పల్లెటూర్లో ఉన్న అమ్మానాన్నలకు దగ్గరగా కాకుండా అనంతపురానికి బదలీ అయ్యింది. నాన్నకు ఎవరో చెప్పారు సత్య సాయిబాబాను దర్శించుకుంటే జీవితం కుదుటపడుతుందని. ఒక రోజు మధ్యాహ్నం నన్నూ, అమ్మనూ తీసుకొని పుట్టపర్తికి (ప్రశాంత నిలయం) బయలుదేరారు. ముగ్గురం సాయంత్రానికి అక్కడికి చేరుకున్నాం. అప్పటికీ ఇప్పుడున్నంత వ్యవస్థ లేదు. బాబా ఉన్న భవనం ఎదుట చిన్నపాటి ఖాళీ స్థలం. దాని చుట్టూ అరుగు అంత ఎత్తులో ప్రహరీ గోడ. వచ్చినవారంతా కింద కూర్చోని బాబా దర్శనం కోసం నిరీక్షిస్తున్నారు. పక్షుల రావాలు తప్ప మరే చడీచప్పుడు లేని ప్రశాంతమైన వాతావరణం. ఈలోగా కొందరు కార్యకర్తలు అక్కడ ఉన్న వారికి చిన్న చిన్న కాగితపు ముక్కలను పంచి పెట్టారు. దర్శనానికి వచ్చినవారు తమ సమస్యలను, కోరికలను ఆ కాగితపు ముక్కల మీద రాసి బాబాకు స్వయంగా అందించడానికి చేసిన ఏర్పాటులో భాగమది. మిగతావారి లాగానే నాన్న కూడా కాగితపు ముక్క మీద ఏదో రాసి దానిని మడతపెట్టి తన జేబులో ఉంచుకున్నారు. కాసేపటికి బాబా వచ్చారు. ఖాళీ స్థలానికి ఎదురుగా ఉన్న భవనం వరండాలో ఒక ఆసనంపై కూర్చున్నారు. భజన కార్యక్రమం మొదలైంది. భజనకు అనుగుణంగా బాబా తన చేతులను కదపసాగారు. వాయిద్యాలకు తగ్గట్టుగా తలను ఆడించసాగారు. అలా భజన కొనసాగు తుండగానే బాబా అందరి మధ్యలోకి రాసాగారు. అలా తన దాకా వచ్చిన బాబాకు నాన్న తాను రాసిపెట్టుకున్న కాగితాన్ని అందించారు. కాసేపటికి కార్యక్రమం పూర్తయ్యింది. బాబా భవనంలోకి వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్ది రోజులకే కాకతాళీయమో, బాబా ప్రభావమో తెలీదు కానీ నాన్నకు అనుకున్న చోటుకు బదిలీ చేస్తూ పైనుంచి ఆదేశాలు వచ్చాయి. అప్పటి నుంచి నాన్న బాబాకు పూర్తికాలపు భక్తుడిగా మారిపోయారు. అదే సమయంలో బాబా ప్రేమతో చూపించిన సేవా మార్గాన్ని అనుసరించారు. సత్యసాయి సేవా సంస్థల కార్యక్రమాల్లో ఒక చురుకైన పాత్ర పోషించడం ఆయనకు అలవాటుగా మారిపోయింది. కట్టుకున్న ఇంటికి ప్రశాంతి నిలయం అని పేరు పెట్టుకున్నారు. పెద్దలను చూసి పిల్లలు అన్నట్టుగా నాకు, నా తోబుట్టువులకు మా నాన్నలో కనిపిస్తున్న సేవాభావం కాస్త వంట పట్టింది. కనీసం ఏడాదికి ఒకసారి పుట్టపర్తికి వెళ్లడం కుదిరితే మా కుటుంబంలో అందరికీ లేకపోతే మా అమ్మానాన్నలకు రివాజుగా మారిపోయింది. ఉద్యోగరీత్యా నేను హైదరాబాద్‌లో ఉంటున్నప్పుడు నాన్న వచ్చినప్పుడల్లా ఆయనతో కలిసి శివంకు వెళ్లడం నా దినచర్యలో ఓ భాగమైపోయింది. నా బ్యాచిలర్ రూమ్మేట్లతో కలిసి ఉదయాన్నే భోరున కురుస్తున వర్షంలో శివం గోడ పక్కన నిలబడి సత్యసాయిబాబాను దర్శనం చేసుకున్న ఘటన నాకింకా గుర్తుంది. ఆ తర్వాత నాన్న పుట్టపర్తి సత్యసాయి ఆస్పత్రిలో కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకోవాలనుకున్నారు. ఆయనకు ఆస్పత్రిలో అటెండర్లుగా హైదరాబాద్ నుంచి నేనూ, చెన్నయ్ నుంచి మా బాబాయి పుట్టపర్తి వెళ్లాం. ప్రతీ రోజూ తెల్లవారు జామునే ప్రశాంతి నిలయంలో బాబా దర్శనం ఉండేది. మూడు గంటలకే లేచి దర్శనానికని వెళ్లి కూర్చునేవారం. అప్పటికే రద్దీ బాగా ఉండేది. మొదట్లోలా భక్తుల దగ్గరకు రాకుండా దూరం నుంచే దర్శనమిచ్చేవారు. ఒక రోజు అలాగే తలవంచుకొని కూర్చున్న నేను కళ్లు తెరిచి చూస్తే ఎదురుగా బాబా పాదాలు కనిపించాయి. అంటే ఆయన నా ముందు భౌతికంగా నిలబడి ఉన్నారు. ఊహించని పరిణామానికి ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నాది. అప్రయత్నంగా నా అర చేతులతో ఆయన పాదాలను అద్దుకున్నాను. తలచుకున్నప్పుడల్లా నా కళ్ల ముందు మెదిలే ఘటనల్లో ఒకటిగా ఇది నిలిచింది. పటిక బెల్లపు తునకల్లాంటి తన మాటల ద్వారా ప్రేమతో సేవ చేసే తత్వాన్ని లక్షలాది మందిలో పాదుగొల్పడమే కాకుండా ప్రపంచంలో కోట్లాది మంది కోసమని సేవా సంస్థలను నెలకొల్పిన ఆ మహనీయుడికి ఓ సామాన్యుడి నివాళి ఇది.

– మహేష్ ధూళిపాళ్ల

శివం నుంచి సేవాయజ్ఞం

శ్రీ సత్యసాయి బాబా శతజయంతి వేడుకల సందర్భంలో, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు – శివం, హైదరాబాద్ వారు, అర్హులైన, అవసరమున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశ్యంతో ఒక విశిష్ట మైన సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ నుంచి 1,000 మందికి జీవనోపాధి కోసం అవసరమైన నైపుణ్య ఆధారిత పనిముట్లు అందజేశారు. ఇందుకోసం శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యులు, శ్రీ సత్యసాయి సేవా సమితుల కార్యవర్గాలు కలసి, అర్హులైన అభ్యర్థుల వివరాలను సేకరించారు. అనంతరం లబ్దిదారుల అర్హత, నిజమైన అవసరం ఆధారంగా అభ్యర్థులను వ్యక్తిగత ఇంటర్వ్యూకు ఆహ్వానించి తుది ఎంపిక చేశారు.

లబ్దిదారుల జీవనోపాధి నిమిత్తం కుట్టు మెషీన్లు, ఎలక్ట్రిక్–ప్లంబింగ్–కార్పెంటింగ్ టూల్ కిట్స్, వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, కంప్యూటర్ ఆధారిత ఉపాధి కోరుకునేవారికి డెస్క్‌టాప్స్, విద్యార్థుల చదువులకు తోడ్పడేందుకు ఉపకారవేత నాలు, మహిళా సాధికారత లక్ష్యంగా గృహ ఆధారిత వ్యాపారం చేసుకునేందుకు వెట్ గ్రైండర్స్, బ్యూటీషియన్ కిట్స్, దివ్యాంగులకు ట్రై–సైకిల్స్‌ని పుట్టపర్తిలోని ప్రశాంతినిలయంలో గల సాయి కుల్వంత్ హాలులో పంపిణీ చేశారు. హైదరాబాదులో శ్రీ సత్యసాయి సేవసంస్థల ప్రధాన కేంద్రంగా ఉన్న విద్యానగర్‌లోని 'శివం'నుంచి ఎంపిక చేసిన లబ్దిదారులను 18 బస్సుల ద్వారా అక్టోబర్ 15వ తేదీన పుట్టపర్తికి తీసుకువెళ్లి 16, 17 తేదీలలో పనిముట్ల లబ్దిదారులకు వాటిని పంపిణీ చేశారు. తమ జీవనోపాధి కోసం శ్రీ సత్యసాయి సేవాసంస్థలు అందించిన పరికరాలు, ఇతర సహాయాన్ని అందుకున్న లబ్దిదారులు తమ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సేవా యజ్ఞం కోసం తెలంగాణలోని శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, సేవా సమితుల రాష్ట్ర అధ్యక్షులు, జిల్లాల అధ్యక్షులు, సమితి కన్వీనర్లు, సేవాదళ్ సభ్యులు విశేష కృషి చేశారు. ★

లక్ష్యం అమోఘం...

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, అట్టహాసంగా అంతర్జాతీయ స్థాయి సమ్మేళనం నిర్వహించింది. హైదరాబాద్ శివారు ఆవల ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్తగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతంలో డిసెంబర్ 8,9 తేదీల్లో జరిగిన ఈ ఉత్సవాలకు తెలంగాణ రైజింగ్ గ్లోబల్-2047 అని పేరు పెట్టినప్పటికీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ వేడుకలు నిర్వహించిందన్నది నిర్వివాదాంశం. రెండవ రోజున'తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్' డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. 2047 నాటికి తెలంగాణను ఆర్థికంగా అత్యంత బలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న వ్యూహాలతో ఈ డాక్యుమెంట్‌ను తయారు చేశారు.

రాష్ట్ర భవిష్యత్తు, సమగ్ర అభివృద్ధికి దిక్సూచిగా ఈ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం అభివర్ణిస్తోంది. 83 పేజీల ఈ డాక్యుమెంట్‌ను.. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేశారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు పెంచడం ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యం. యువత, మహిళలు, రైతులకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ డాక్యుమెంట్‌ను రూపొందించామని, ఇది తాత్కాలిక పాలనా విధానాలకే పరిమితం కాకుండా.. స్థిరమైన విధానం వైపు తెలంగాణ ప్రయాణాన్ని సూచిస్తుందని ప్రభుత్వ పెద్దలు చెప్పుకొచ్చారు.

తెలంగాణ అంటే వ్యాపారం?

అసలు ఈ డాక్యుమెంట్‌తో పాటు.. గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా అన్ని ప్రధాన పత్రికల్లో తొలి పూర్తి పేజీల్లో ఇచ్చిన ప్రకటనలోనూ 'Telangana Means Business' అని ప్రధానంగా పేర్కొన్నారు. పత్రికల ప్రకటనల్లో, ఈ క్యాప్షన్ తప్ప వేరే ఏదీ కనిపించలేదు. 'తెలంగాణ అంటేనే వ్యాపారం' వ్యాపారమని దీని అర్థం అని, రాష్ట్రాన్నే పూర్తిగా వ్యాపారంగా మార్చేశారని వ్యాఖ్యలు ఉన్నాయి. 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్...' అన్న గురజాడ వారి మాటలను ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం తిరగరాస్తూ, 'రియల్ ఎస్టేట్ బూమ్‌ను పెంచుతోంది. తెలంగాణ అంటే.. అసలు మనుషులు, మేధస్సు, నైపుణ్యం కాదని, వ్యాపారమని అధికారికంగా ప్రకటించినట్లయింది.

ఈ విజన్ డాక్యుమెంట్‌లో రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం 10 కీలక వ్యూహాలను పొందుపరిచారు. భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ నది పునరుజ్జీవనం, డ్రైపోర్టు, డ్రైపోర్ట నుంచి ఏపీలోని కృష్ణపట్నం పోర్టు వరకు 12 వరుసల ఎక్స్‌ప్రెస్ వే, హైదరాబాద్ నుంచి బెంగళూరు, చెన్నై(వయా అమరావతి) బుల్లెట్ ట్రైన్ కారిడార్, ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్‌లు, ఔటర్, రీజినల్ రింగు రోడ్డులను అనుసంధానిస్తూ రేడియల్ రోడ్లు, రీజినల్ రింగ్ రైల్వే, వ్యవసాయ భూములకు గ్రీన్ పవర్, ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్స్, గ్రీన్ ఎనర్జీ హబ్స్, భారీగా విద్యుత్తు వాహనాల వినియోగం వంటి ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు విజన్ డాక్యుమెంట్ పేర్కొంది. ఈ వ్యూహాలలో ఇప్పటికే ప్రకటించిన క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు ఆర్థిక జోన్ల విభజన కూడా అంతర్భాగంగా ఉంది. వీటితో పాటు.. 2047 నాటికి రాష్ట్రంలో వచ్చే మార్పులపై ప్రభుత్వం చెబుతున్న మరికొన్ని అంశాలను విజన్ డాక్యుమెంట్‌లో చేర్చారు. రాష్ట్రంలో ఇప్పుడున్న జాతీయ రహదారుల నెట్‌వర్క్‌ను 4వేల 983 కిలోమీటర్ల నుంచి 7వేల 500 కిలోమీటర్లకు పెంచుతారు. అలాగే, రాష్ట్ర రహదారుల పరిధిని 1687 కిలోమీటర్ల నుంచి నుంచి 8 వేల 600 కిలోమీటర్లకు పెంచుతారు. మెట్రో రైల్ లేదా ఎల్ఆర్టీఎస్ లేదా బీఆర్టీఎస్ నెట్‌వర్క్‌ను 632 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేస్తారు. రాష్ట్రంలో మిల్లెట్ల సాగును 3 లక్షల ఎకరాల నుంచి 10 లక్షల ఎకరాలకు పెంచాలని విజన్ డాక్యుమెంట్‌లో లక్ష్యంగా నిర్దేశించారు. అలాగే, అవుటర్ రింగు రోడ్డు-రీజినల్ రింగు రోడ్డు మధ్య 13 భారత్ ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. పది గ్రీన్‌ఫీల్డ్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేస్తారు. రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్ మాదిరిగానే.. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ అభివృద్ధికి తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా పర్యవేక్షణ చేపడతారు. డిజిటల్ తెలంగాణ మిషన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తారు. అలాగే 2035 నాటికి పది యూనికార్న్ సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ గ్రిడ్‌ను అమలు చేస్తారు. ఈ విజన్ డాక్యుమెంట్‌లో ఇలాంటి పలు అంశాలను చేర్చారు.

రెండింతల జీడీపీ లక్ష్యం

రంగాలవారీగా సుస్థిరాభివృద్ధి సాధిస్తూ, లక్ష్యాలు చేరుకుంటామని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర జీడీపీ 200 బిలియన్ డాలర్లని విజన్ డాక్యుమెంట్లో ప్రభుత్వం పేర్కొంది. దేశ జనాభాలో 2.5 శాతం జనాభా ఉన్న తెలంగాణ రాష్ట్రం, దేశ జీడీపీలో 5 శాతం వాటాను పంచుకుంటోంది. ఇప్పుడు దీనిని రెండింతలు చేయాలనేది లక్ష్యమని ప్రకటించింది. ఈ లక్ష్యాలు చేరుకునేందుకు కీలకమైన ప్రాజెక్టులు చేపట్టనున్నట్లుగా ప్రభుత్వం తెలియజేసింది. అంతేకాదు.. విజన్ డాక్యుమెంట్ తయారీకి ముందు ప్రజల నుంచి ప్రభుత్వం సూచనలు, అభిప్రాయాలను ఆహ్వానించింది. ఇందులో అందరికీ అందుబాటులో ఆసుపత్రులు, తక్కువ ఖర్చులో వైద్య పరీక్షలు, తాగునీరు, పారిశుధ్యం, రోగాల నియంత్రణ, ఉద్యోగాల కల్పన, వినూత్న కోర్సులు తీసుకురావడం, చిరు వ్యాపారాలకు మద్దతు ఇవ్వడం, తక్కువ దూరంలోనే పాఠశాలలు, ఆసుపత్రులు ఉండాలని సలహాలు వచ్చినట్లుగా విజన్

సాధన మార్గం!?

డాక్యుమెంట్‌లో ప్రభుత్వం ప్రకటించింది.

నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరుతుందా?

ఈ డాక్యుమెంట్‌ను కేవలం ఒక గదిలో కూర్చుని రూపొందించలేదని.. విస్తృత సంప్రదింపులు, అనేక అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే దీని రూపకల్పన జరిగిందని ప్రభుత్వం స్పష్టం చేసింది.దీని రూపకల్పన కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు 4 లక్షల మంది ఆన్‌లైన్‌లో సూచనలు ఇచ్చారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

ప్రధానంగా 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడం, 2047 నాటికి దీనిని 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో దీనిని సిద్ధం చేసినట్లుగా చెబుతోంది. మరి.. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరుతుందా? 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ సాధ్యమవుతుందా? అనే అంశంపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. అయితే, 'కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్), పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్), రూరల్ అండ్ అగ్రి రీజియన్ ఎకానమీ (రేర్).. కార్యక్రమాల ద్వారా నిర్దేశిత లక్ష్యాన్ని సాధిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ డాక్యుమెంట్ విడుదల సందర్భంగా చెప్పారు. విజన్ అయితే స్పష్టంగా చెప్పారు గానీ, దానికి అవసరమైన నిధుల సమీకరణ ఎలా? అనే దానిపై స్పష్టత లేదన్నది ఆర్థిక నిపుణుల అభిప్రాయం. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సరిగ్గా లేదని, ఆర్థికంగా రాష్ట్రం చాలా కష్టాల్లో కూరుకుపోయిందని, ముఖ్యమంత్రి పదేపదే చెబుతున్నారు. ఇలాంటి సందర్భంలో ఈ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించడం, బృహత్ లక్ష్యాన్ని పెట్టుకోవడంపై మిశ్రమ స్పందన వస్తోంది. ఈ స్థాయిలో ఎకానమీ అనేది ఆచరణలో సాధ్యమయ్యేలా నిధులను ఎలా సమీకరిస్తారని, పెట్టుబడులను రాబట్టడంతో పాటు అమలు కోసం ఎలాంటి ప్రణాళిక అనుసరిస్తారన్న విషయంపై విజన్ డాక్యుమెంట్‌లో స్పష్టత లేదని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

రూ.5.75 లక్షల కోట్ల ఒప్పందాలు

రెండు రోజుల గ్లోబల్ సమ్మిట్ వేదికగా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో మొదటి రోజు రూ. 3,97,500 కోట్లు, రెండో రోజు రూ. 1,77,500 కోట్ల విలువైన ఒప్పందాలు జరిగాయని వివరించింది. ఈ భారీ పెట్టుబడులు ఐటీ, డేటా సెంటర్లు, పర్యాటకం, విద్యుత్, క్రీడలు, అటవీ వంటి కీలక రంగాల్లో వచ్చాయని, ఫలితంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా సమకూరుతాయని అంటోంది. అయితే, కంపెనీల సామర్థ్యం, వాటి పనితీరు, పెట్టుబడులకు అవకాశాలపై కూడా ప్రభుత్వం సమీక్షించాల్సిన అవసరం ఉంది. కంపెనీలతో ఓ వేదికగా ఒప్పందాలు చేసుకోవడమే కాదు.. వాటిని ఆయాసంస్థలు ఆచరణలో పెట్టేలా చూడాల్సిన అవసరం కూడా ఉంది. సరైన వ్యూహం, ప్రణాళిక లేకుండా విజన్ డాక్యుమెంట్ అమలు చేయాలనుకుంటే, అది విజువలైజేషన్‌కే పరిమితం అవుతుందని, రియల్ ఎస్టేట్ మార్కెట్ పెంచే ఎత్తుగడగా మారిపోతుందని ఆర్థిక నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం పేదరికం తగ్గించడం, వివక్ష నిర్మూలించడంతోపాటు రాష్ట్ర భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్‌లా ఈ విజన్ డాక్యుమెంట్ పనిచేస్తుందని చెబుతోంది.

స్వయంగా ఆహ్వానించినా...!

మొత్తానికి ఈ గ్లోబల్ సమ్మిట్‌కు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు హాజరయ్యారని ప్రభుత్వం వెల్లడించింది. వారికి వసతి కోసం హైదరాబాద్ లోని ఖరీదైన హోటళ్లలో గదులు బుక్ చేసింది. అయితే, ముందుగా ప్రభుత్వం అంచనా వేసిన పారిశ్రామిక వేత్తలు పూర్తిస్థాయిలో రాలేదని అంటున్నారు. పైగా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా, దేశంలోని అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాజకీయవేత్తలను ప్రభుత్వం ఆహ్వానించింది. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సహా మంత్రులు ఢిల్లీ సహా వివిధ రాష్ట్రాలకు వెళ్లి స్వయంగా ఆహ్వానించారు. కానీ, వాళ్లెవరూ రాలేదు.

అలాగే, అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీల సీఈవోలు, గ్లోబల్ ఇన్వెస్టర్లు, వరల్డ్ లెవల్ ఇండస్ట్రీ లీడర్లు రాలేదంటున్నారు. గ్లోబల్ ఫైనాన్షియల్ సంస్థలు, ఫండ్ మేనేజర్లు, వెల్త్ ఫండ్స్ వంటివి కూడా గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనలేదని అంటున్నారు. ఇక, ఈ సమ్మిట్ ఖర్చు అంచనాలను మించి, రెట్టింపు అయినట్టు చెబుతున్నారు. సమ్మిట్‌కు తొలుత రూ. 150 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు రూపొందిస్తే... ఈ కార్యక్రమం పూర్తయ్యే సరికి రెట్టింపు అయ్యిందని తెలుస్తోంది. వీటిలో ప్రచార ఆర్భాటాలకే సింహ భాగం ఖర్చయినట్లు చెబుతున్నారు.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068



ఆంధ్రప్రదేశ్‌లో భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ 'అటల్ – మోదీ సుపరిపాలన యాత్ర' పేరుతో రాష్ట్ర వ్యాప్త బస్సుయాత్ర చేపట్టింది. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ నియోజకవర్గ కేంద్రాల్లో వాజ్‌పేయి విగ్రహాలు నెలకొల్పతోంది. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ఈ కార్యక్రమాలకు హాజరై వాజ్‌పేయి సుపరిపాలనను, దానిని మోదీ కొనసాగించడంపై ప్రసంగిస్తున్నారు.

అటల్ స్ఫూర్తితో ప్రగ

డిసెంబరు 11న ప్రారంభమైన బస్సు యాత్రలో ఇప్పటి వరకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కరసింగ్ ధామి, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, సవిత, ఎండీ ఫరూక్, బీసీ జనార్దనరెడ్డి, ఎమ్మెస్ రాజు, పల్లె సిందూరరెడ్డి, ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, కేఈ శ్యాంబాబు, జయ నాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, మాధవి రెడ్డి, వరదరాజుల రెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, డాక్టర్ పార్థసారధి, చింతా సురేష్, బీటెక్ రవి, నాయకులు వరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదనరెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పసుపులేటి హరిప్రసాద్, నరసింహయాదవ్, రుద్రకోటి సదాశివం, తదితరులు పాల్గొన్నారు.

అటల్ విధానాలకు ప్రశంసలు

'అటల్–మోదీ సుపరిపాలన యాత్ర'లో పాల్గొన్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తమ ప్రసంగాల ద్వారా వాజ్‌పేయి పాలనా దక్షతను, మోదీ దానిని కొనసాగిస్తున్న తీరును అద్భుతంగా ఆవిష్కరించారు. ధర్మవరం, తిరుపతి, మదనపల్లె ప్రాంతాల్లో జరిగిన ఈ సభల్లో వారు వాజ్‌పేయి వ్యక్తిత్వం, అభివృద్ధి కార్యక్రమాలు, వాటిని కొనసాగిస్తున్న ప్రధాని మోదీ పాలనను ప్రస్తుతించారు.

వాజ్‌పేయ్ హిమాలయాలంతటి ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన నాయకుడిగా మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ అభివర్ణించారు. 'దేశ రాజకీయ చరిత్రలో 1990లలో రాజకీయ అస్థిరత ఉండేది. దానిని సుస్థిరతగా మార్చిన ఘనత వాజ్‌పేయిదే. ఒకే సిద్ధాంతం కలిగిన పార్టీని నడపడమే కష్టమైన కాలంలో భిన్నధ్రువాల వంటి 27 వేర్వేరు ప్రాంతీయ, జాతీయ పార్టీలను ఒకే తాటిపైకి తెచ్చి, 'నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్' (ఎన్‌డియే) గొడుగు కింద ఐదేళ్లపాటు సుస్థిర ప్రభుత్వాన్ని నడిపించడం వాజ్‌పేయికే చెల్లింది. అప్పటి వరకు దేశాన్ని ఏక చక్రాధిపత్యంగా పాలించిన కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా, 'కాంగ్రెస్ రహిత భారత్' అనే నినాదానికి వాజ్‌పేయి, ఎల్.కే. ఆద్వాణీలు ఊపిరి పోశారు. ప్రాంతీయ ఆకాంక్షలను గౌరవిస్తూనే, జాతీయ సమగ్రతను కాపాడటం ఆయన 'సంకీర్ణ ధర్మానికి' నిదర్శనం. చంద్రబాబు నాయుడు వంటి నాయకులతో ఆయనకున్న మైత్రి, రాజకీయాలకు అతీతమైన స్నేహ శీలతను సూచిస్తుంది. ఇక వాజ్‌పేయి పాలన కేవలం రాజకీయ నిర్వహణకే పరిమితం కాలేదు. భద్రతకు, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతనిచ్చారు. 1998లో పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించడం ద్వారా భారత్ అగ్రరాజ్యాలకు తలవంచదని నిరూపించారు.

అమెరికా వంటి దేశాలు ఆర్థిక ఆంక్షలు విధించినా, ప్రజల మద్దతుతో దేశ ఆర్థిక వ్యవస్థను పతనం కాకుండా కాపాడారు. "జై జవాన్, జై కిసాన్" నినాదానికి "జై విజ్ఞాన్"ను జోడించి, శాస్త్ర సాంకేతిక రంగాలకు పెద్దపీట వేశారు. "దేశాభివృద్ధికి రహదారులు రక్తనాళాలు" అని నమ్మిన వాజ్‌పేయి, 'స్వర్ణ చతుర్భుజి' ద్వారా నాలుగు మెట్రో నగరాలను అనుసంధానించారు' అని మోహన్ యాదవ్ వివరించారు. కేవలం జాతీయ రహదారులే కాకుండా, 'ప్రధాన్ మంత్రి గ్రామీణ సడక్ యోజన' ద్వారా మారుమూల వల్లెలను నగరాలతో అనుసంధానించారని, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్నే మార్చేసిందని అన్నారు.

వాజ్‌పేయి వేసిన 'సుపరిపాలన' అనే బాటలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రయాణం, దేశాన్ని ప్రపంచ శక్తిగా ఎలా మారుస్తున్నారని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి అన్నారు. వాజ్‌పేయి హయాంలో ప్రారంభమైన ఐటీ విప్లవాన్ని మోదీ 'డిజిటల్ ఇండియా'గా మార్చారని, స్టార్టప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి పథకాల ద్వారా నేడు భారత్ ప్రపంచంలోనే 'మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్'గా ఎదిగిందని అన్నారు. 'యువత ఉద్యోగార్థులుగా కాకుండా, ఉద్యోగ ప్రదాతలుగా మారేలా స్కిల్ ఇండియా ప్రోత్సహిస్తోంది. మోదీ పాలనలో అభివృద్ధికి సమాంతరంగా ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణ జరుగుతోంది. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్, ఉజ్జయిని మహాకాళ్ లోక్, కేదార్‌నాథ్ పునర్నిర్మాణం వంటివి దేశ సాంస్కృతిక వైభవానికి ప్రతీకలు. ఇది పర్యాటక రంగాన్ని కూడా బలోపేతం చేస్తోంది. వాజ్‌పేయి కోరుకున్న నిజమైన లౌకికవాదం,

తి దిశగా..

కూటమిలో కూడా కొనసాగుతోందని, ఇది రాష్ట్రానికి శుభపరిణామమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చంద్రబాబు అనుభవం, కేంద్రంలోని మోదీ సహకారం కలిసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తాయని, సంపన్న భారత్ అనే వాజ్‌పేయి కలలు సాకారమవుతాయినా ఆ ఇద్దరు ముఖ్య మంత్రుల ప్రసంగాలు స్పష్టం చేస్తున్నాయి. ఏపీలో ఐటీ, ఏఐ రంగాలు, పోలవరం ప్రాజెక్టు, కొత్త పోర్టులు, సెమీకండక్టర్ పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. తిరుపతిలో ఐఐటీ, ఐజర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ఏర్పాటులో కేంద్రం పాత్రను గుర్తుచేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, సబిత, ఎండి ఫరూక్, బిసీ జనార్దనరెడ్డి, ఎమ్మెస్ రాజు, పల్లె సింధూరరెడ్డి తదితరులు వాజ్‌పేయి సేవలను ప్రశంసిస్తూ, ఆయన వ్యక్తిత్వం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.

సమానత్వాన్ని అమలు చేయడంలో ఉత్తరాఖండ్ ముందంజలో ఉంది. దేశంలోనే తొలిసారిగా అక్కడ 'ఉమ్మడి పౌరస్మృతి'ని అమలు చేయడం ద్వారా, చట్టం ముందు అందరూ సమానమే అనే భావనను మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వాలు ఆచరణలో చూపిస్తున్నాయి. వాజ్‌పేయి దేశానికి అంతర్గత, బహిర్గత భద్రతను, మౌలిక సదుపాయాల పునాదిని ఇస్తే, మోదీ ఆ పునాదిపై ఆత్మనిర్భర్ భారత్ అనే భవనాన్ని నిర్మిస్తున్నారు' అని ఆయన చెప్పారు.

ఏపీకి కేంద్రం చేయూత

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధిని, కూటమి పాలనను మోహన్ యాదవ్, పుష్కరసింగ్ ధామి ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో వాజ్‌పేయి, చంద్రబాబు మధ్యగల స్నేహబంధం, ఇప్పుడు ఎన్డీఏ ఒక సాధారణ ఉపాధ్యాయుడి కుమారుడిగా జన్మించి, స్వశక్తితో దేశ ప్రధాని స్థాయికి ఎదగడం సామాన్య విషయం కాదని, స్వాతంత్ర్య సమరయోధుడిగా, కాశ్మీర్ సమస్యపై పోరాడి జైలుకు వెళ్లిన ఉద్యమ కారుడిగా దేశం కోసం అంకితమయ్యారని అన్నారు. నీతి నిజాయతీలు మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపారని, అందుకే ఆయన 'అజాత శత్రువు'గా నిలిచారని విశ్లేషించారు.

'భారత రాజకీయ చరిత్రలో సంకీర్ణ ప్రభుత్వాలంటే అస్థిరతకు మారుపేరుగా ఉండేవి. కానీ, వాజ్‌పేయి దానిని పూర్తిగా మార్చేశారు. 1996లో 13 రోజులు, ఆ తర్వాత 13 నెలలు, అనంతరం ఏకంగా 27 భిన్న పార్టీలను కలుపుకుని ఐదేళ్లపాటు పూర్తిస్థాయి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని నడిపిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఇది ఆయన వ్యక్తిత్వ గొప్పతనానికి, అందరినీ కలుపుకుపోయే 'సమైక్యతా స్ఫూర్తి కి నిదర్శనం' అని వక్తలు ఉదహరించారు. 'స్వర్ణ చతుర్భుజి' ద్వారా దేశంలోని నలుమూలలనూ రహదారులతో అనుసంధానించడం, 'గ్రామీణ సడక్ యోజన' ద్వారా మారుమూల పల్లెలకు రోడ్లు వేయించడం దేశ ముఖచిత్రాన్ని మార్చేశాయని వివరించారు. నేడు ప్రతి సామాన్యుడి చేతిలో సెల్ ఫోన్ ఉందంటే దానికి బీజం వేసింది వాజ్‌పేయే అని చెబుతూ పోఖ్రాన్ అణు పరీక్షల ద్వారా ప్రపంచానికి భారత శక్తిని చాటిచెప్పారని కొనియాడారు. మహిళల కష్టాలను తీర్చడానికి గ్యాస్ కనెక్షన్లు, అన్నదాతల ఆత్మహత్యలను నివారించడానికి 'కిసాన్ క్రెడిట్ కార్డులు' వంటివి ఆయన మానవీయ పాలనకు సాక్ష్యాలుగా అభివర్ణించారు.

కూటమి ఐక్యత

'సుపరిపాలన యాత్ర' లో బీజేపీతో పాటు కూటమి భాగస్వామ్య పక్షాలు తెలుగుదేశం, జనసేన పార్టీల మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. భిన్న సిద్ధాంతాలు కలిగిన పార్టీలను సమన్వయంతో నడిపిన వాజ్‌పేయి సంకీర్ణ ధర్మాన్ని ఈ నాయకులు ఆచరిస్తున్నారు. కూటమి విచ్ఛిన్నం కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శతవిధాలా చేస్తున్న ప్రయత్నాలు, మూడు పార్టీల నాయకులు ప్రదర్శిస్తున్న సంయమనం, రాష్ట్ర ప్రయోజనాల పట్ల నిబద్ధత కారణంగా సఫలం కాలేదు. మూడు పార్టీల నేతలు ఎంతో పరిణతితో వ్యవహరిస్తూ ప్రభుత్వం సుస్థిరంగా నడవడానికి, అభివృద్ధి కొనసాగడానికి కృషి చేస్తున్నారు. ముఖ్యంగా, కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకోవడంలో ఈ ఐక్యత కీలక పాత్ర పోషిస్తోంది. అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి, పారిశ్రామిక కారిడార్లు, ఐటీ రంగానికి ఊతం, రహదారులు, రైల్వేలు, విమానయానం, మత్స్య సంపద, పశు సంపద, వ్యవసాయానికి మద్దతు వంటి అన్ని కీలక రంగాలకు కేంద్ర సహకారం పొందే క్రమంలో కూటమి నేతలు ఒకే తాటిపై నడుస్తున్నారు. ఈ సమైక్య కృషి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేయడం కనిపిస్తోంది. కూటమి నాయకత్వంలోని ఈ ఐక్యత, రాష్ట్ర ప్రగతికి గొప్ప శుభపరిణామం.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

గురిందల స్థలంలో జరుగుతున్న సమయశెట్టిల సమావేశంలో ప్రసంగిస్తున్నాడు తిక్కనార్యుడు.

"ఈ ఆధునిక కాలానికి స్పష్టమైన అంశాలు రెండు. మన జాతి ఆంధ్ర జాతి. మన భాష తెలుగు భాష. కాబట్టి మన రాజ్యం కూడా తెలుగు రాజ్యం.. ఆంధ్ర సామ్రాజ్యం కావాల్సి ఉంది. అదే నా ఉద్యమం. అందుకు సమాయత్తమౌవలసినది మొదలుగా గ్రామ సమయాల వారు. ఇక్కడికి వచ్చిన వారంతా మీ మీ గ్రామాలలో మీ సమయ పెద్దలతో సమావేశమవ్వండి. వాళ్లకు వివరించండి. అష్టాదశ సమయాల పెద్దలతో చర్చించండి. అతి త్వరలోనే మనం తెలుగుభాషా రాజ్యం.. ఆంధ్ర సామ్రాజ్యం స్థాపించాలి"

ఇది తిక్కనార్యుని ఉద్వేగ ప్రసంగం. తెలుగు మాట్లాడే ప్రతి పల్లెకు ఆయన సందేశం ఉద్యమంలా వెళుతోంది. పైన కళింగ నుండి దిగువ మధుర వరకు.. పడమర సముద్రం, ఇటు తూర్పు సముద్రం వరకూ అన్ని రాజ్యాలలో, అన్ని మండలాలలో, అన్ని స్థలల్లో సమావేశాలు నిర్వహించి తెలుగు మాట్లాడే ప్రజలను ఆయన ఉత్తేజితులను చేస్తున్నారు.

ఈ సమావేశం కూడా వాడిగా వేడిగా ఆశ్చర్యంగా అబ్బురంగా సాగింది.



చాలామంది మహాజనులు, సమయశెట్టిలు ఈ కోణం నుండి ఎప్పుడూ ఆలోచించలేదని ఆశ్చర్య పోయారు. నిజమే కదా అన్నారు. రేపటినుండి మా గ్రామాన్ని పూర్తిగా తెలుగుదనంతో నింపేస్తాం అన్నారు.

ఇక సమావేశం ముగుస్తుంది అనగా ఓ మూలనుండి ఓ పెద్ద కేక వినబడింది.

"అయ బాబో.."

అది భీరువు గొంతులా కాస్తంత భయంతో దుఃఖ మిళితమైనట్లుంది.

ప్రసంగిస్తున్న తిక్కన మాత్రమే కాదు.. సభాసదులంతా అతని వైపే చూశారు. మంచిభట్టోపా ధ్యాయుడు చివ్వున లేచి అతని దగ్గరగా వెళ్లబోయాడు. కాని అతడు కనుసైగ చేయడంతో మధ్యలో ఆగిపోయాడు.

తిక్కనామాత్యుడైతే ఉపన్యాసం ఆపి అడిగాడు, "ఏమైంది సోదరా..! ఎందుకు ఆ అరుపు.. కారణం ఏవిటి??"

"తవరు గుక్కపట్టి తెలుగు తెలుగు అంటున్నారు. మరి తెలుగబ్బాయిలు మరో బాస అమ్మాయిల్ని మనువాడవచ్చా.. ఉప్పుడికే పెళ్లయిపోతే ఎట్టా.. మరేట్టా..??" అన్నాడు అమాయకంగా.

సభికులు అతని మాటలకు పగలబడి నవ్వారు. యువకుడు వీరునిలా, స్ఫురద్రూపిలా,కండలు తిరిగిన జబ్బలతో ఇంతెత్తున బలిష్టంగా చాలా ఆకర్షణీయంగా ఉన్నాడు కాని అతని మాటలలో నిజమైన భయమో.. నాటకీయ భయమో.. ప్రవహిస్తోంది. అది నాటకీయ భయమని గుర్తించిన తిక్కనకు కూడా నవ్వొచ్చింది.

"అబ్బీ.. ఇంతకీ నీకు పెళ్లయ్యిందా.. పెళ్లి అవ్వాల్సివుందా?"

"అయ్యిందిగా.. అందుకేగా నా ఏడుపు??"

"ఎవరు అమ్మాయి.. ఏ బాస?" ఎవరో జనాంతికంగా అన్నారు.

"మరాఠా అమ్మాయండి. పెద్ద పెద్ద మారాజులే కూడబలుక్కుని పెళ్లి కుదిర్చి లగ్గం చేశారండి బాబో."

అందరూ మళ్లీ నవ్వారు కాని అతనినే పరిశీలనగా చూస్తున్న తిక్కన కాస్త గొంతు సవరించుకుని అన్నాడు.

ఈ సమావేశం ప్రధాన నిర్వాహకుడైన మంచి భట్టోపాధ్యాయుడు అతనికి దగ్గరగా.. అతని పట్ల వినయంతో చేతులు కట్టుకుని నిలబడటం ఆయన దృష్టిని దాటిపోలేదు.

"మనం తెలుగువాళ్లం. తెలుగు మాట్లాడే మన రాజ్యాలలో ఇకపై తెలుగే ఉండాలి. అలాగే తెలుగు మాట్లాడే రాజ్యాలన్నీ ఏకం కావాలి. అలా అని ఇతర భాషా ప్రజలు మనకు శత్రువులు కాదు. ఆయా ఇతర భాషా రాజ్యాలలో కూడా మన తెలుగు వాళ్లున్నారు కదా. అందువల్ల ఇతర భాషా రాజ్యాల వాళ్లతో మనకు కయ్యం లేదు కాని వియ్యం ఉండొచ్చు.."

ఆయన చమత్కృతికి అందరూ చప్పట్లు చరచి తమ ఆమోదం వెలిబుచ్చారు.

ఆ అడిగిన యువకుడు హమ్మయ్య అన్నట్లు ఆనందంగా నవ్వి మీసాలు దువ్వుకుంటూ తిక్కనకు నమస్కరించి కూర్చున్నాడు. అతని ముందు వినయంగా వంగి వెనక్కు అడుగులు వేస్తూ మంచోభట్టు వెనుదిరిగడం

తిక్కన గారి దృష్టిని ఆకర్షించింది.

అతగాడెవరో సాధారణవేషంలో ఉన్న రాజ్యాధికారి అని ఆయన భావించాడు. ఎంతో నమ్మకం పెట్టుకుని.. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న తన ఆశయాన్ని కలను నిజం చేయగల మహావీరుడు, రాజకీయ దురంధరుడు అయిన కాకతీయ సార్వభౌముడు గణపతిదేవ చక్రవర్తి ఆయనే అని అప్పటికి తిక్కనార్యునకు తెలియదు.

చాగిరాజ్య రాజధాని బృహత్కంచిపురంలో తిమ్మరుసు కొట్టారం వద్ద పరిచయమైన పండితుడే ఈ మంచి భట్టోపాధ్యాయుడు. ఆ రోజు ఇద్దరూ జనాంతికంగా మాట్లాడుకున్నారే కానీ ఎవరెవరో ఇద్దరికి తెలియదు. కాని ఆ భట్టోపాధ్యాయుడు వదలిపెట్టే రకం కాదు. తను మాట్లాడింది సాధారణ వేషంలో ఉన్న గణపతిదేవుడని తెలుసుకున్నాడు. అనుమకొండ రాజనగరికి వెళ్లి నానా ప్రయత్నాలు చేసి గణపతిని కలుసుకున్నాడు.

ఆయనను చూసి గణపతి కూడా సంతోషించాడు. తెలుగు భాషావ్యాప్తి కోసం విక్రమపురిరాజ్య మహామాత్యుడైన తిక్కన సోమయాజి నిర్వహిస్తున్న 'స్థల' స్థాయి మహాజనుల, కవి పండితుల, వీరయోధుల సమావేశం రాగల భానువారమే 'గురిందల స్థల' వద్ద నిర్వహించబోతున్నామని, దానిని తను సమన్వయ పరుస్తున్నట్లు చెప్పాడు.

ఆ సమావేశం పట్ల ఆసక్తి చూపిన గణపతి దేవుడు.. తానూ కూడా పాల్గొంటానని అయితే తను మహారాజునని తెలిస్తే బావుండదని, మారువేషంలో సాధారణ పౌరునిలా సమావేశంలో పాల్గొంటానని చెప్పి అలాగే వచ్చి ఓ మూలాన కూర్చున్నాడు.

సమగ్ర తెలుగు సామ్రాజ్యస్థాపనే తన ధ్యేయంగా కలిగిన మరొకరు.. అందునా సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేయగల ఓ మహాకవి, మహా మాత్యుడు ఉండటం

గణపతిదేవుడు

'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

గణపతిదేవునికి ఎంతో ఆనందం కలిగించింది. అంతేకాదు తిక్కన అప్పటికే కార్య రంగంలోకి దూకి అన్ని రాజ్యాలలోని సమయశెట్టిలతో సమాలోచన సమావేశాలు జరుపు తున్నాడని తెలిసి కాస్తంత పులకరింపు కలిగింది.

ఇంతటి ఆధునిక కాలంలో కూడా మహారాజులకు ఎంతటి గౌరవ ప్రపత్తులున్నాయో.. పండితులకు, మహాకవు లకు కూడా అంతటి గౌరవప్రపత్తులు సాధారణ సమాజంలో ఉన్నాయని తెలియనివాడు కాదు గణపతిదేవుడు.

తిక్కనామాత్యుని ఆలోచన! గణపతిదేవుని ఆచరణ!!

ఈ భావన అతన్ని ఎంతో ఉత్తేజితుడ్ని చేసింది.

తిరిగి అనుమకొండకు వెళ్లగానే తన దైనందిన రాజ్యపాలనా కార్యక్రమం వ్రణాళికను సిద్ధం చేయవలసినదిగా మహా ప్రధాని వెల్లంకి గంగాధరునికి వర్తమానం పంపాడు.

* * *

రెండవ మెట్టు: చింతనా శిబిరం

"ఓం శ్రీశ్రీ నమః శివాయ.. నమః రుద్రాయ
సకల గుణాలంకార.. పరనారీదూర
అనుమకొండ పురేశ్వరా సోమలదేవీ నిజేశ్వరా
దోర్బలభీమా రణరంగ రామా
వితరణకర్ణా శౌర్య సౌవర్ణా
పతిహితాంజనేయా శౌచగాంగేయా
సత్యరత్నాకరా దుష్ట జనభీకరా
స్వామిద్రోహరగండ శ్రీశ్రీశ్రీ కాకతి వంశాబ్ధి కులచంద్రమా
శ్రీశ్రీశ్రీ గణపతిదేవ మహారాజులుంగారు
వేం చేయుచున్నారోహో.. వేం చేయుచున్నారోహో
వేం చేయుచున్నారోహో.. వేం చేయుచున్నా రోహో...

భట్రాజుల స్తోత్రపాఠాలకు తోడు పంచమహా వాద్యాల ఉద్వేగధ్వనులు.. రుజలు, బూరలు, బాకాల హోరు ఆ ప్రాంగణమంతా ప్రతిధ్వనిస్తుండగా, అందరూ విభ్రాంతిగా రెప్పవెయ్యకుండా చూస్తుండగా గణపతిదేవుడు హుందాగా నడచివచ్చి తన సింహాసనం వద్ద నిలబడ్డాడు. వెంటవచ్చిన లెంకలు వెనక్కు వెళ్లారు. ఆ హోరు తగ్గాక ఆయన చేతులు జోడించి సభకు నమస్కరించాడు. అప్పుడు ఆయన వంక చూడటం అందరికి ఎంతో ఉత్తేజంగా కన్నుల పండువగా ఉంది.

తిరుచూర్ణపు అంచున్న వెండిరంగు పట్టుపంచె కట్టి.. పైన బంగారు, ఎరుపు కలనేత కంచుకం ధరించి, వజ్రవైఢూర్యాలు పొదిగిన హారం, పొడుగైన ముత్యాలదండ ఎదపై కదలాడుతుండగా, నడుముకు ఉత్తరీయం చుట్టి దానిలో వజ్రాలపిడిగల చురకత్తి దోపాడు. ముఖాన విభూతిరేఖలపై నిలువు ఎర్రెర్రనిబొట్టు. తలపై బంగారు రంగు తలపాగా.. నిండైన కోరమీసం. నవ యవ్వనంతో తుళ్లిపడుతున్న ఉత్కృష్టరూపం. విశాలమైన నవ్వు. ఆరడుగుల అజానుబాహువు. అన్నివైపులా తల తిప్పుతూ అందరినీ చూస్తున్నాడు. కానీ ముఖంలో తొలిసారి సింహాసనం అధిష్టించినప్పటి చిన్న తొట్రుపాటు, అనుకంపన.. కిటకిటలాడుతున్న పెరోలగం.. అందరూ రెప్పవేయకుండా తననే చూస్తు న్నారన్న స్పృహ వల్ల వచ్చిన బెదురు..

ఆ ఉత్కృష్ట సింహాసనం అన్ని పల్యంకాల కంటే ఎత్తున ఉంది.

క్రిందివరుసలో మొదటి స్థానంలో మహాప్రధాని కుడివైపు, సర్వసైన్యాధ్యక్షుడు ఎడమవైపు ఉండగా వారి తర్వాతి వరుసలో కుడివైపు ప్రధానులు, అమాత్యులు, మంత్రులు.. తదితర పాలనా నియోగ ముఖ్యులు కూర్చోగా ఎడమ వైపు వివిధ స్థాయి సైనిక యోధులు కూర్చుని కనిపించారు.

ఓహో ఇదన్నమాట సభలో అందరు కూర్చునే విధానం! అనుకున్నాడు తొలిసారి సింహాసనం ఎక్కిన గణపతి దేవుడు.

తొలి సమావేశంలోనే తొలి అంశమే రుద్ర సేనానికి కృతజ్ఞతతో కూడిన గౌరవస్థానం ఇవ్వడం. ఆయనకు గంగాధర మహాప్రధాని సలహాతో "కాకతీయ రాజ్య సమ్మర్ధ", "కాకతీయ రాజ్యభార ధౌరేయ" అనే బిరుదులను ప్రకటించాడు.

సైనిక అంశాలలో యుద్ధ తంత్రాలలో మహామేధావి అయిన రుద్ర సేనాని వయస్సు పైబడుతున్నా ఇప్పటికీ.. మరింత కాలం.. శత్రు దుర్భేద్య కాకతీయ మహా సైనిక పారావారాన్ని నడిపించగల మహాయోధుడు. కాబట్టే రేచర్ల రుద్రసేనానిని ఆయన జీవితాంతం వరకు ఆయనే 'కాకతీయ సకల సైన్యాధికారి'గా ప్రకటిస్తూ ఆయన ముందు సాగిలబడి సాష్టాంగ నమస్కారాలు సమర్పించాడు గణపతి దేవుడు.

సమస్త కాకతీయ రాజ్యలోకం హర్షధ్వానాలు అందజేసి రుద్రసేనానికి కృతజ్ఞతా కైమోడ్పులు చేసింది.

అనంతరం మహాప్రధాని గంగాధరమంత్రి లేచి మహారాజును ఉద్దేశించి ఆహ్వాన ప్రసంగం చేశాడు. రాజ్యపాలన సజావుగా సాగడానికి అన్ని నియోగాల ద్వారా పూర్తి సహకారం అందించగలమని హామీ ఇచ్చారు. తర్వాత సకల సైన్యాధికారి రేచర్ల రుద్రయ, సైనిక వీరత్వ ధోరణితో ప్రసంగించి రాజ్యభద్రత కోసం సర్వకాల సర్వావస్థలలో మహారాజు ఆజ్ఞలకు అనుగుణంగా పూర్తి సన్నద్ధంగా ఉంటామని ప్రతిజ్ఞ లాంటి ఉపన్యాసం చేశాడు.

ఆ తొలి రోజు మొత్తంగా పెద్దలిద్దరూ వెంట ఉండి నిత్యం జరిగే నాలుగు సమావేశాలు, వాటి తీరుతెన్నులు గణపతికి వివరించారు. అన్నిటిని క్షుణ్ణంగా పూర్తి ఆసక్తితో విన్నాడు.. తెలుసుకున్నాడు.

"మరోసంగతి మహారాజా.. రాచరిక సంప్రదా యాలలో తమరు మమ్మల్ని సభా సముఖంగా ఎప్పుడూ పెదనాన్నగారు లాంటి వ్యక్తిగత అనుబంధాలలో పిలువరాదు. కేవలం పదవి నామంతో పిలవడం సంప్రదాయం.." అన్నాడు గంగాధర మంత్రి. రెండు లిప్తల నిశ్శబ్దం అనంతరం తల ఊపి ఊరుకున్నాడు గణపతిదేవుడు.

దినమూ జరిగే నాలుగు సమావేశాలను ప్రత్యక్షంగా పరికించి సాయంత్రం చివరిది అయిన కళాసాహితీ సమావేశం కూడా పూర్తయిన తర్వాత "ప్రభుత్వ పరిపాలన విధివిధానాలు ఇప్పుడిప్పుడే

మత్తి భానుమూర్తి

తెలుస్తున్నాయి. అలాగే ప్రస్తుత రాజ్యాల స్థితిగతులు.. ఎవరు మిత్రుడు, ఎవరు శత్రువు.. ప్రజల సమస్యలు ఏవిటి? వాటిని ఎలా నిర్వహించాలి?'' అని అడిగాడు. ''ఇవన్నీ నేను నిర్ణయించుకోవాలి. పాలన ప్రారంభించే ముందు పాలనా వ్యవస్థపై నాకొక పూర్తి స్థాయి అవగాహన కావాలని భావిస్తున్నాను. అందుకు తగిన మేధావులతో, పండితులతో ఓ సమా వేశం.. ఒక టేమిటి.. కొన్ని రోజులపాటు మేధోమథన చింతనా శిబిరం నిర్వహించాలని నేను వాంచిస్తున్నాను పెద్దనా.. ప్రధాని.. మహాప్రధానీ!!'' అని వివరించాడు.

ఇద్దరూ ముఖాముఖాలు చూసుకున్నారు. గణపతిదేవుని ఆలోచనల ధార ప్రత్యేకమైనదని.. ఆయన ఏది చెప్పినా.. చేసినా పూర్తిగా ఆకళింపు చేసుకుని నిర్వహిస్తాడని వాళ్లకు తెలిసిన సంగతే.

గణపతిదేవుడు సింహాసనం అధిష్ఠించడం. మేధోమథన శిబిరం గురించి పట్టుబట్టడం వెనువెంటనే జరగలేదు.

పట్టమహిషి సోమలదేవిని దేవగిరిలో దింపి వచ్చాక మిత్రుడు అంకాలశెట్టి నివాసానికి వెళ్ళాడు.

గణపతిని చూసి అంకాల ఆశ్చర్యపోయాడు. ''అరె.. మిత్రమా నువ్వు.. తమరు స్వయంగా రావడం మా ఇల్లు పావనమయ్యింది.'' అన్నాడు ఆనందంగా.

''ముందు తమరు.. తీసెయ్.. ఎప్పటిలాగే నువ్వు.. గణా.. అను చాలు.''

''నువ్వు అంగీకరిస్తావు మిత్రమా! కాని రాచ విధానాలు అంగీకరించవు. సరే. మన ఏకాంతంలో నువ్వు నువ్వే.

బయట నువ్వు తమరు..''

ఇద్దరూ ఆప్యాయంగా చేతులు కలుపుకుని

అప్పుడే అంకాలశెట్టి ప్రధాన గణికుడు వచ్చి చెప్పాడు, ''క్షమించండి శెట్టి. మహారాజు మీతో మాట్లాడడానికి.. ఈ విషయంపై మాట్లాడడానికి సుముఖంగా లేరట. ఇప్పుడే వార్త పంపారు.'' మిత్రులిద్దరూ ముఖాలు చూసుకున్నారు. అంకాల దీర్ఘంగా నిశ్వసించి, ''ప్చ్.. డిండిమను ఇక ఎవ్వడూ రక్షించలేడు..'' అన్నాడు. గణపతి చురుకయ్యాడు, ''అతడు.. డిండిమ మంచివాడని నీ అభిప్రాయమా అంకాలా?!'' ''నిస్సందేహంగా. ప్రజల కోసం తన జీవితాన్ని పణంగా పెట్టినవాడు డిండిమ. ఎంతమంది రాజులు నిజంగా ప్రజల కొరకు పాటుపడుతున్నారు?! ఎప్పుడో ఒకప్పుడు ఏ మహారాజో తనను నిజంగానే ఉరి తీస్తాడని అతడు అతడెప్పుడూ భావిస్తుంటాడు.

''అది ఎప్పుడైనా.. రాత్రి పగలు అనేవి లేవు మహారాజా. మన రాజ ప్రాసాదంలోనే. మీ అభీష్టం మేరకు..''

''అయితే రేపే శిబిరం ఏర్పాటు చేయండి.''

''ఇప్పటికిప్పుడు అంటే కష్టం మహారాజా. ఆయా రంగాలలో మహా పండితులను, శాస్త్రవేత్తలను, నిపుణులను గుర్తించి ఆహ్వానించాలి. వారు మన్నించాలి. ఇక్కడకు చేరుకోవాలి. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని వెనువెంటనే తేదీ తమరికి తెలియజేస్తాను..'' అన్నాడు మహాప్రధాని గంగాధరుడు.

నిజమేనన్నట్లు తల పంకించాడు గణపతిదేవుడు.

''మతపెద్దలు.. శైవ వైష్ణవ బౌద్ధ జైన మత మఠ పెద్దలను కూడా..'' గంగాధరుడు అన్నాడు,

ముఖం చిట్లించి ఆపమన్నట్లు చెయ్యెత్తాడు. 'ఇప్పుడు చర్చించేది మత సమస్యలు కాదు కదా. ప్రజల సమస్యలు. రాజ్య సమస్యలలో మత పెద్దలు ఏమి చేస్తారు.. వారిని పక్కన పెట్టండి.''

ఆయన వెనుదిరిగాడు. అప్పుడన్నాడు గణపతిదేవుడు, ''ఆ.. అయ్యా మహాప్రధానిగారు. ఒక్కరి పేరు చెబుతాను. వారిని మా ప్రత్యేక అతిథిగా ఆహ్వానించండి..'' అంటూ ఆ ఒక్కరి పేరు చెప్పాడు.

ఆ ఒక్కరు విక్రమసింహపురి మహామాత్యుడు తిక్కనార్యుడు!

* * *

నవ్వుకున్నారు.

సాధారణ పౌరుని దుస్తులలో వచ్చాడు గణపతిదేవుడు. అప్పుడే ఎక్కడికో వెళ్లే హడావిడిలో ఉన్నాడు అంకాల.

''ఏవిటి అంకాలా.. ఎక్కడికో వెళ్లబోతున్నావా??''

''ఆ.. చిన్నవని. డిండిమ అనే మిత్రుడొక డున్నాడు. అతనికి ఉరిశిక్ష వేసింది చాగిరాజ్య న్యాయ మహామండలి. మహారాజు గారితో ఆ విషయమై మాట్లాడాలని వెళ్లబోతున్నాను. సరే. రేపటికి వాయిదా వేసుకుంటాను. నువ్వు నా ఇంటికి వచ్చావు. అదే మహద్భాగ్యం. ఆ సత్యా.. మన ప్రయాణం రేపటికి వాయిదా వెయ్యండి.'' అంటూ సహాయకునికి చెప్పాడు.

అంకాలశెట్టి తండ్రి అల్లంశెట్టి. అల్లం వ్యాపారంలో ప్రతిష్ఠుడు. నతవాడి మహారాజు ఒక్కమల్లరుద్ర బావ గారికి మణిమాణిక్యాలు కుదువ పెట్టుకుని సొమ్ము ఇచ్చింది ఈ అల్లంశెట్టే. అందుకు కారణం అంకాలశెట్టి, గణపతి చిన్ననాటి మిత్రులు కావడం.

అంకాలశెట్టి ఎగుమతి దిగుమతి వణిజుడు. అతని కోష్టాగారమే ఓ పట్టణమంత పెద్దగా ఉంటుంది. ఆ ప్రాంగణం ఓ చిన్న రాజ్యపాలకుని రాజప్రాసాదం కంటే పెద్దదే. దాదాపు ఐదారొందల ఎడ్లబళ్లు ఎల్లప్పుడూ అనేకానేక వస్తువులను లోపలికి తెస్తూ.. బయటకు తీసుకుపోతూ ఉంటాయి. వేలమంది పనివాళ్లు, చిన్నచిన్న వస్తు ఉత్పతిదారులు, సరఫరాదారులు, వాళ్లు వేరు వేరు వస్తు నిపుణులు, గణికులు, కడిత లేఖకులు, సహాయకులు.. వేలాదిమంది ఉన్నారు.

ఏవేవో చర్చలు.. ధరల నిర్ణయం, లాభ శాతపు ఉజ్జాయింపులు.. ఓ మహారాజు యుద్ధానికి బయలుదేరుతున్నప్పటికి కంటే ఎక్కువ హడావిడి, జాగ్రత్తలు.. అరుపులు.. కేకలు.. ఎడ్ల మెడల్లో గంటలు, బళ్లవాళ్ల అదిలిం పులు..

ఇక అంకాలశెట్టి ప్రయాణమంటే నిజంగానే ఓ మహారాజు ప్రయాణం లాంటిదే. ఆయనకు సహాయకులే పాతిక మంది ఉంటారు. అందరూ గుర్రబ్బళ్లపై సిద్ధమయ్యారు కాని గణపతిని చూసి అంకాలశెట్టి ఆగిపోయాడు.

ఈలోగా తేరుకున్న గణపతి, ''ఎవరు.. ఆ మనిషి పేరు ఏవిటి అన్నావ్ అంకాలా.. డిండిమ??''

''అవును మిత్రమా. అతని పేరు డిండిమ నాయడు..'' అన్నాడు వివరంగా.

''అతడు.. నీబోటి వణిజుల కోష్టాగారాలను బద్దలుకొట్టి..''

''అవునవును. అతడే. వాడు ప్రజాహితైషి. ప్రజలను దోచుకుని దాచుకున్న వాళ్ల కోష్టాగారాలను ప్రజల మద్దత్తుతో కొల్లగొడతాడు. అది సహజంగా వణిజులకు, మహారాజులకు నచ్చదు కదా. అందువల్ల తిమ్మరుసు ఫిర్యాదుపై తనికి ఉరిశిక్ష విధించాడు మహారాజు. కాని అతడు చేస్తున్నది ప్రజల కోసమేనని నేను చెప్పదలచుకున్నాను. నా అభ్యర్థనపై ఆయన నాకు ఈ రోజు కలవడానికి సమయం ఇచ్చాడు. వెళ్లబోతుండగా నువ్వు వచ్చావు.''

అప్పుడే అంకాలశెట్టి ప్రధాన గణికుడు వచ్చి చెప్పాడు, ''క్షమించండి శెట్టి. మహారాజు మీతో మాట్లాడడానికి.. ఈ విషయంపై మాట్లాడడానికి సుముఖంగా లేరట. ఇప్పుడే వార్త పంపారు.''

మిత్రులిద్దరూ ముఖాలు చూసుకున్నారు.

అంకాల దీర్ఘంగా నిశ్వసించి, ''ప్చ్.. డిండిమను ఇక ఎవ్వడూ రక్షించలేడు..'' అన్నాడు.

గణపతి చురుకయ్యాడు, ''అతడు.. డిండిమ మంచివాడని నీ అభిప్రాయమా అంకాలా?!''

''నిస్సందేహంగా. ప్రజల కోసం తన జీవితాన్ని పణంగా పెట్టినవాడు డిండిమ. ఎంతమంది రాజులు నిజంగా ప్రజల కొరకు పాటుపడుతున్నారు?! ఎప్పుడో ఒకప్పుడు ఏ మహారాజో తనను నిజంగానే ఉరి తీస్తాడని అతడు అతడెప్పుడూ భావిస్తుంటాడు. గతంలో నాతో అన్నాడు కూడా..''

రెండులిప్తల కాలం.. కేవలం రెండులిప్తల కాలం ఆలోచించాడు గణపతి దేవుడు.

''మనం అతన్ని రక్షిద్దాం అంకాల. కదులు. వస్త్రాలు మార్చుకో. నాలాగా సాధారణ బట్టలు

కట్టుకో. సహాయకుల్ని పదిలేయ్. మనిద్దరమే వెళదాం. నేనున్నానుగా.. కదులు..”

ఆశ్చర్యంగానూ ఉత్తేజంగానూ చూశాడు అంకాల. గణపతి అసాధారణ శక్తియుక్తులు అతనికి తెలుసు. కాని

కాని.. అంటూ ఊగిసలాడుతున్నాడు.

“ఏవిటి ఆలోచిస్తున్నావ్.. సమయం లేదు మిత్రమా!యముడి మహిషం అతన్ని చేరే లోపలే మనం అతన్ని తీసుకుని ఇక్కడికే నీ నివాసానికే తిరిగి వద్దాం.. పద..” తొందరపెట్టాడు గణపతిదేవుడు.

అతడు ఉద్వేగంతో ఉన్నాడని గుర్తించిన అంకాల మరికొద్ది సేపటిలోనే సాధారణ దుస్తుల్లో తన అశ్వాన్ని ఎక్కి గణపతిని అనుసరించాడు. ఇద్దరు చాగి రాజధాని బృహత్కుంచి పురం వైపు సాగిపోయారు.

రాత్రివేళకు బృహత్కుంచి చేరారు.

చేరడమైతే చేరారు కాని డిండిమను రక్షించడం అంటే చీకట్లో నల్లపిల్లిని పట్టుకోవడమే. ఇద్దరూ వీధిలో నిలబడిపోయారు.

రాజకోటకు వెళితే.. ‘మీరెవరు? ఎందుకు వచ్చారు?’ అని అడుగుతారు. ఏమి చెప్పాలి.. డిండిమ పేరు సామాన్యులకు బాగా తెలుసు. అడిగితే వాళ్ళు గుండెలు బాదుకుంటూ పెద్దపెట్టున ఏడుస్తారు. అల్లరి అవుతుంది.

అక్కడ ఆగిపోయాడు గణపతి. అల్లరి అయితే.. అవుతుంది. అవనీ!! రాజభటులు వస్తారు. పట్టుకెళతారు. అలా కోటలోకి ప్రవేశించవచ్చు.

అంకాలతో అదే చెప్పాడు.

అతడు పూర్తిగా వణిజుడు. ఇలాంటివి ఏ మాత్రం తెలియదు. కాకపోతే అందరిలా ఉదయాన్నే వ్యాయామాలతో బలిష్టమైన శరీరుడు. గణపతి చెప్పింది మంచో చెడో చెప్పలేక దిక్కులు చూస్తున్నాడు. కాకపోతే పక్కనున్న వాడి ఆలోచనలను పసిగట్టి తనకు లాభమో, నష్టమో లిప్తలకాలంలో నిర్ణయించుకోగల వ్యాపారి.

దాదాపు ఊరు నిద్రకు ఉపక్రమిస్తున్నవేళ.

ఇద్దరు బలిష్టులైన యువకులు గణపతి, అంకాలశెట్టి.. బాట మధ్యలో గుర్రాలపై ఆగి ఎటు వెళ్లాలో తెలియక దిక్కులు చూడటం రాత్రి కాపలాభటుల దృష్టిలో పడింది. మరి కాసేపటికి ఇద్దరు పహారా సైనికులు కత్తులు పట్టుకుని.. ఆటిని ఎత్తి చూపిస్తూ ఝుళిపిస్తూ రాసాగారు. వీళ్లు భయపడిపోవాలని వాళ్ల ఆలోచనగా గణపతి, అంకాలశెట్టి గుర్తించారు.

తన గుర్రాన్ని ఎక్కడెక్కడో చేతితో తడుతూ, “నువ్వేమీ అల్లరి చెయ్యకు..” అని దానికి చెబుతూనే.. ఆ ఇద్దరూ దగ్గరకు రాగానే ఊహాతీతంగా లాఘవంగా ఎగిరి ఒకడ్ని దొరకబుచ్చుకుని వాడి కత్తికి దొరకకుండా వాడి వెనగ్గా నడుము పట్టుకుని చేతులు విరిచి బిగించాడు. మరొకడు పెద్ద పెద్దగా

గణపతి పట్టులో ఉన్న మరొకడు కనీసం కదలలేకపోతున్నాడు. అలావాడిని బంధించాడు. కత్తి విసిరి విసిరి విసుగొచ్చి.. కత్తివాడు రొప్పుతున్నాడు. అప్పుడు మరొకసారి ఎగిరి వాడి కత్తిని గట్టిగా పట్టుకున్నాడు గణపతి. ఆయన చేయి తెగుతుందేమో అని అంకాల పిచ్చికేక వేసి కళ్లు మూసుకున్నాడు. చిత్రం.. ఆ కత్తి గణపతిని ఏమీ చెయ్యలేకపోయింది. ఆయన దానిని లాక్కుని ఒక్క చేతిలో దానిని లేత వరి మొక్కను వంచినట్లు వంచాడు.

అరుస్తూ కత్తి విసిరాడు. గణపతి లాఘవంగా తప్పుకున్నాడు. ఒకటి.. రెండు.. మూడు.. ఊహు.. తిప్పి తిప్పి అలసిపోయాడు గాని గణపతిని ఏమీ చెయ్యలేకపోతున్నాడు. వాడి కత్తి విసుర్లు గణపతికి తగలడంలేదు. గణపతి పట్టులో ఉన్న మరొకడు కనీనం కదలలేకపోతున్నాడు. అలావాడిని బంధించాడు. కత్తి విసిరి విసిరి విసుగొచ్చి.. కత్తివాడు రొప్పుతున్నాడు. అప్పుడు మరొకసారి ఎగిరి వాడి కత్తిని గట్టిగా పట్టుకున్నాడు గణపతి. ఆయన చేయి తెగుతుందేమో అని అంకాల పిచ్చికేక వేసి కళ్లు మూసుకున్నాడు. చిత్రం..ఆ కత్తి గణపతిని ఏమీ చెయ్యలేకపోయింది. ఆయన దానిని లాక్కుని ఒక్క చేతిలో దానిని లేత వరి మొక్కను వంచినట్లు వంచాడు.

అంకాలకి అంత చీకట్లోనూ వెన్ను వెంట చమట పట్టింది.

గణపతి ఒక్కచేతితో శత్రువు కత్తి గుంజుకుని అదే చేతితో దానిని పుల్లముక్కలా వంచడం.. జీవితంలో ఎప్పుడూ ఎక్కడా చూడలేదు. వినలేదు కూడా.

ఆ కత్తివీరుడిని కూడా లాఘవంగా పట్టి ఇద్దరిని తన కబంధ కౌగిలిలో బంధించేశాడు. రాత్రి పహారా సైనికులయిన ఆ కత్తివీరులిద్దరూ గణపతి ఉక్కు కారాగారం లాంటి కౌగిలిలో గిలగిల కొట్టుకుంటున్నారు. బయటపడే మార్గం ఏమాత్రం లేదు.

ఈ కలకలం.. గుర్రాల కదలిక దూరానికి కూడా తెలుస్తున్నాయి. దూరాన కాగడాల వెలుగులో మరో ఇద్దరు కాపలా సైనికులు ఇటే రాసాగారు.

గణపతి, అంకాల కంటే ఈ కత్తివీరులిద్దరూ వణికిపోసాగారు.

“అయ్యా.. బాబో.. తమరెవరు? కత్తిని పూచిక పుల్లలాగ నలిపేశారంటే తవురు మావూలోళ్లు కాదు..” అంటూ ఇద్దరూ ఆ వచ్చేవాళ్లను చూస్తూ గుంజుకోసాగారు.

“ఆళ్లు వొస్తే మా కొలువు ఊడతది. అటు అదిగో ఆ పక్క సందులోనే మా ఇల్లు. ఆడకి.. అటుపోదాం.’’ అంటూ ఇద్దరూ భయంతో వణికిపోతూ ఆ వైపు గుంజుకోసాగారు.

గణపతి వాళ్లిద్దరిని వదలకుండానే వాళ్లు చెప్పిన సందులోకి ఈడ్చుకుంటూ పోసాగాడు.

రెండు గుర్రాలను పట్టుకుని వాళ్ల వెంట అంకాల నడవసాగాడు.

పక్కసందులో ఓ గుడిసెలోకి వెళ్లారంతా. లోపల ఓ మహిళ, ఇద్దరు పిల్లలు.. కుక్కిమంచంలో ముసలివాడు ఉన్నారు. అందరూ బిక్కచచ్చిపోయి దిమ్మెరపోయి చూడటం గుడ్డిదీపం వెలుగులో తెలుస్తోంది. తలుపులాంటి మేదరి తడికె మూశాక ఇద్దరిని తన భల్లూకపు పట్టునుండి విడిచాడు గణపతి. వాళ్లిద్దరూ గణపతి

కాళ్ళపై పడిపోయారు.

“తమరెవరో.. ఈ రాజ్యం వొళ్ళు కాదు సావి. సెప్పుర్రి. ఎందుకొచ్చారో??”

ఇద్దరు ఆజానుబాహులు రావడంతో ఆ చిన్న గుడిసె నిండిపోయింది.

“డిండిమ.. డిండిమ తెలుసా?!” అన్నాడు గణపతి.

అంతే. పిల్లల మొదలు అందరిలో గొప్ప చైతన్యం!! తెలుసన్నది వారి శరీర భాష చెబుతోంది.

‘‘డిండిమ మా దేవుడు సావి. నేను నా కుటుంబం ఇంత తింటన్నావంటే అది ఆ దేవుడి సలవే సావి..”

‘‘డిండిమకు ఉరిశిక్ష విధించారని రేపో ఎల్లుండో..” ...చెబుతున్న అంకాలను ఆపుతూ ఓ కత్తివీరుడు అన్నాడు.

“ఎల్లుండి సావి. ఆ దేవుడే దుర్మార్గుడు సావీ. లాపోతే అట్టాంటి గొప్పోడికి ఉరి సిచ్చా??”

అంకాల కొంత ఆశ్చర్యపోగా గణపతి ఎక్కువ ఆశ్చర్యపోయాడు. డిండిమ పేదల ఆర్తత్రాణ పరాయణుడు అని అంకాలకు తెలుసు. కాబట్టే అతన్ని రక్షించా లని బయలుదేరాడు.

“నువ్వు రాజ్య ఉద్యోగివి కదా. నీకు జీతం గీతం ఉంటుంది కదా? నువ్వు తిండికి లేనివాడివి కాదే!?.. అతడు నీకు సహాయం చెయ్యడం?” గణపతి గొంతుకలో చిన్న ఉత్సుకత.

“పేరుకే జీతం. నెలసరి జీతం. ఒక మాసం ఇస్తే మూడు మాసాలు ఇవ్వరు. ఏమి చేస్తాం. పస్తులే. డిండిమ మా నాయనకు శిష్యుడు. అతనికి యుద్ధం నేర్పింది మా నాయనే. అందుకని మాకేమీ తక్కువ కాకుండా అంత ఇంత వడ్లు, బట్టలు ఇచ్చిపోతాడు.”

(సశేషం)



వేయేళ్లనాటి లెక్కల

భారతీయ వైజ్ఞానిక ప్రతిభను అంచనా వేసే క్రమంలో గణితశాస్త్ర ప్రస్తావన వస్తే పాటలీపుత్రాన్ని, ఉజ్జయినిని లేదా వారణాసినో పేర్కొంటారు. దీనికి భిన్నంగా దక్షిణదేశంలోనూ గణిత సంస్కృతి, విశుద్ధ గణిత సంస్కృతి వెల్లివిరిసిందనడానికి మహావీరాచార్యుని జీవితం ఉదాహరణ. ప్రసిద్ధికెక్కిన గణితవేత్తల సరసన ఒక విశుద్ధ గణిత విద్యాంసునిగా ఖ్యాతిగాంచారు మహావీరాచార్యులు. ఆయన క్రీ॥శ॥ 9వ శతాబ్దంలో రాష్ట్రకూట రాజు అమోఘవర్ష నృపతుంగుని ఆస్థానంలో గణితాచార్యుడు. సంస్కృతంలో 'గణిత సంగ్రహ సారము' అనే గ్రంథం రాశాడు. ఇది భారతీయ గణితశాస్త్ర ప్రస్థానంలో మైలురాయి. ఈ గ్రంథాన్ని క్రీ॥శ॥ 11వ శతాబ్దంలో పావులూరి మల్లన 'సారసంగ్రహ గణితము' పేరుతో తెలుగులోకి, పద్యరూపంలో స్వేచ్ఛానువాదం చేశాడు. దీనిని వేటూరి ప్రభాకరశాస్త్రి పరిశోధించి, పరిష్కరించగా టీటీడీ ముద్రించింది. వీరాచార్యుడు జైనమతస్తుడు.

క్రీ॥శ॥ 7వ శతాబ్దిలో ఉండిన మహా గణితవేత్త బ్రహ్మగుప్తునకు, 12వ శతాబ్దంలో భాసించిన గణితాచార్యుడు భాస్కరునకు మధ్య ఒక దీర్ఘమైన అంధయుగం ఏర్పడింది. ఈ కాలంలో ఒక మోస్తరు గణిత పండితులు మంజుల, శ్రీపతి, గోపాల, హేమచంద్ర ప్రభృతులు మినహా చెప్పుకోదగ్గ పెద్దలు కన్పించరు.

సాహిత్యం ఒక భాషలో ఉండి, ఆ భాష తెలిసిన వారినే ప్రభావితం చేస్తుంది. కానీ సత్యాన్వేషణ, సిద్ధాంతీకరణ, రుజువులతో ఉండే శాస్త్రవిజ్ఞానం మానవాళి అవసరాలను తీరుస్తుంది. భారతీయ నాగరికతలో శాస్త్రాలు ఆరు అయినా గణితం వాటికి మౌలిక విజ్ఞానాన్ని అందస్తుంది. మన పూర్వులు గణితాన్ని ఎలా ఉపయోగించారు? ఏయే సంకేతాలు వాడారు? కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు, మిగతా లెక్కలు, పలు శాస్త్రాలలోని సమస్యలను గణితం ఎలా తీర్చినది వంటి అంశాలు తెలుసుకోవడం ఆసక్తి కలిగిస్తుంది.

దశాంశ పద్ధతిని హిందూ పండితులే మొదట వాడారనే వాదన బలంగా వినిపిస్తున్నది. వేద మంత్రం 'శతమానం భవతి శతాయుః పురుషః' మొదలుకుని ఎన్నో వేదమంత్రాలు, ఇతిహాసాలలోని వివిధ అంశాలను దశాంశ పద్ధతిలో లెక్కించడం మనం చూశాం. ఈ క్రింది రెండు పద్యాలు మల్లన ప్రతిభను చాటుతాయి.

"మొదలొకట నిల్చి దానిం
గదియగ తుది దాక రెట్టిగా కూడినచో
విదితముగ పల్కు మాకున్
చదరంగపుటిండ్లకైన సంకలిత మొగిన్"

పయోనిధి పద్మజాస్య కుం
జర తుహినాంశు సంఖ్యకు నిజంబగు తచ్చతురంగగేహ వి / స్తరమగు రెట్టి రెట్టి కగు సంకలితంబు జగత్ప్రసిద్ధికిన్'

శర – (మన్మథుని బాణాలు)–5, శశి = (చంద్రుడు)–1, షట్క–6, చంద్ర–1, శర – 5, సాయక – (శరములు)–5, రంధ్ర–9, వియనతో – (ఆకాశం) – 0, నగ–(పర్వతం)–7, అగ్ని–3, భూధర– (పర్వతాలు)–7, గగన–0, అబ్ధి – (సముద్రాలు)–4, వేద–4, గిరి–7, తర్క–(శాస్త్రాలు)–6, పయోనిధి – (సముద్రాలు)–4, పద్మజాస్య–(బ్రహ్మ తలలు)–4, కుంజర–(ఏనుగు)–8, తిహినాంశుడు– (చంద్రుడు)–1 తుచ్చ తురంగ గేహ విస్తరమగు రెట్టి రెట్టికగు సంకలితంబు జగత్ప్ర సిద్ధికిన్ – ఆ చదరంగపు గడులన్నీ ఒక్కొక్కటిగా రెట్టింపు చేస్తూ విస్తరిస్తూ పోగా వచ్చే జగత్ప్రసిద్ధమైన సంఖ్య = 18,446,744,073,709,551,615. ఇది వారి ప్రతిభకు ఒక చిన్న ఉదాహరణ.

ప్రాచీన భారతదేశ పండితులు అనేక శాస్త్రాల్లో, ముఖ్యంగా గణితశాస్త్రంపై అసాధారణమైన పట్టు సాధించారు. జ్యోతిష్యం, ఖగోళశాస్త్రాలను ఔపోసన పట్టేవారు. ఆర్యభట్టు, బ్రహ్మగుప్తుడు, వరహమిహిరుడు మున్నగువారు గణిత, జ్యోతిష్య, ఖగోళశాస్త్రాల్లో ఎనలేని ఖ్యాతిని గడించారు. వీరంతా ఔత్తరాహులు కాగా, ప్రఖ్యాత గణిత పండితులు ఉత్తర భారతంతో పాటు దక్షిణభారతంలోనూ విలసిల్లారు. మహావీరాచార్యుడు కర్ణాటక ప్రాంతవాసి. ఈయనకు జ్యోతిష్య, ఖగోళశాస్త్రాల పరిచయం లేదు. కాని గణితశాస్త్ర విద్వాంసుడు.

ఇక మల్లన 'సారసంగ్రహ గణితము' అనువాదంలో పరతంత్రంగా స్వతంత్రాన్ని పాటించాడు అన్నారు ఆరుద్ర.

కించిదుద్ధృత్య తత్సారం వక్ష్యే హం మతి శక్తితః
అల్పగ్రంథ మనల్పార్థం గణితం సార సంగ్రహమ్

'అనంతంగా విస్తరించి ఉన్న గణిత సముద్రంలో మునకలు వేసి ఏవో కొన్ని రత్నాలు సేకరించగలిగాను. నాకున్న జ్ఞానపరిధిలో అనల్పమైన గణిత సారాన్ని ఈ అల్పగ్రంథంలో సమకూర్చాను' అన్నారు వీరాచార్యులు. వీరాచార్యుని గణితసార సంగ్రహాన్ని 1912లో ఎం.రంగాచార్యులు సంస్కృతం నుండి ఆంగ్లంలోకి అనువదించారు. ఆ రోజుల్లోనే మొదటి గడిలో ఒకటి, రెండవ దానిలో రెండు మూడవ దానిలో నాలుగు– ఈ లెక్కన రెట్టించుకుంటూ పోతే మొత్తం 64 గళ్లకు ఎంత మొత్తం వస్తుందో చెప్పు అని ఈ పద్యంతో ప్రశ్నించాడు మల్లన (264–1). దీనికి సమాధానం ఆయనే చెప్పాడు. అది చాలా పెద్ద సంఖ్య. మల్లన సంఖ్య చెప్పకుండా సంకేతాలు వాడాడు. ఆకాశమంటే శూన్యం, కాబట్టి సున్నకు సంకేతం. చంద్రుడొక్కడే, కాబట్టి ఒకటికి సంకేతం. నేత్రాలు, చేతులు రెండుకు, త్రేతాగ్నులుగా పిలిచే అగ్నిరూపాలు మూడుకు సంకేతాలు. వేదాలు నాలుగుకు, ఇంద్రియాలు, మన్మథ బాణాలు అయిదుకు సంకేతం. శాస్త్రాలు ఆరుకు, ప్రముఖ పర్వతాలు ఏడుకు సంకేతాలు. అష్టదిక్కులు ఎనిమిదిని, నవగ్రహాలు తొమ్మిదిని సంకేతిస్తాయి. పై పద్యంలోని లెక్కకు జవాబు 18,446,744,073,709,551,615. ఇంత పెద్ద సంఖ్యను సంకేతాలలో చెప్పుతూ ఛందస్సు పద్యంలో చెప్పాలి. ఆ కాలంలో వెనుక నుండి చెబుతూ ఉండేవారు. అంటే ఒకట్లు చివరికి వస్తుంది. సమాధానం చూడండి.

'శర శశిషట్కు చంద్ర శర సాయక రంధ్ర వియన్నగాగ్ని భూ / ధర గగనాబ్ధి వేదగిరి తర్క

విశాఖపట్నంలోని ఎస్.పి.యల్. నరసింహస్వామి పావులూరి మల్లన సారసంగ్రహ గణితం రాత ప్రతులను సేకరించారు. మల్లన గణితాన్ని తెలుగులోనికి తీసుకురావాలనే కాంక్షతో వారు ఆ కృషి చేసినా, ఆర్థిక వనరులు లేనందున పూర్తి చేయలేకపోయారు. ఆయన సోదరులు పరవస్తు వి.రామానుజస్వామి తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఓరియంటల్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టరుగా పదవీ బాధ్యతలు చేపట్టాక ఆ గణిత గ్రంథాన్ని ఆ పరిశోధనాలయంలో పరిశోధకుడు వేటూరి ప్రభాకరశాస్త్రికి అప్పగించారు. అప్పటికే ఈ అంశంపై ఎరుక గలిగిన శాస్త్రి గారు పరిష్కార బాధ్యతను సంతోషంగా స్వీకరించారు.

ఇంతకీ, లభించిన రాతప్రతులలో అన్ని అధ్యాయాలు ఉన్నాయా? దొరికినది ఎంత భాగం? సారసంగ్రహ గణితం పది అధ్యాయాలు. అవి– 1.పరికర్మ గణితం 2. భిన్న గణితం 3. ప్రకీర్ణ గణితం 4. త్రైరాశిక గణితం 5. మిశ్ర గణితం 6.సూత్ర గణితం 7. క్షేత్ర గణితం 8.సువర్ణ గణితం 9.ఖాత గణితం 10. ఛాయా గణితం. అందుకే

పావులూరి గ్రంథాన్ని దశ గణితమని కూడా పేర్కొంటారు. కానీ ప్రభాకరశాస్త్రి పరిష్కరించిన తరువాత ప్రథమభాగం పేరుతో వెలువడిన గ్రంథంలో పరికర్మ, భిన్నగణితాలు– రెండుభాగాలే ఉన్నాయి. మిగతా భాగాలు అలభ్యమా? లేక రాతప్రతులుగానే మిగిలాయా తెలియడం లేదు. కానీ రామానుజస్వామి (డైరెక్టర్) ముందుమాటలో, "An account of the manuscript material on which the present edition is based will be given in the introduction to the second and completing part of the work" అన్నారు. అయితే రెండవభాగం వెలువడలేదు.

పరికర్మ గణితంలో 253 గద్యపద్యాలు, సువర్ణగణితంలో 69 గద్యపద్యాలు మొత్తం 342 గద్యపద్యాలున్నాయి. పావులూరి మల్లన్న ఆదికవి నన్నయకు ఒక విధంగా సమకాలికుడు. రాజరాజ నరేంద్రుని (కీ॥శ॥1020–1063) ఆస్థానంలో వెలసిన నన్నయ నందంపూడి అగ్రహారాన్నీ, మల్లన పిఠాపురం సమీపంలోని నవఖండవాడ అగ్రహారాన్నీ పొందారు. ఈయన కమ్మనాడు (గుంటూరు సమీపం) పావులూరు గ్రామాధికారిగా పనిచేశాడు (5వ పద్యం). పంచమ వేదానువాద ప్రశస్తి రాజమహేంద్ర వరానికి దక్కితే, తొలి శాస్త్ర అనువాద ప్రసిద్ధి ప్రకాశం జిల్లా, పావులూరికి దక్కింది (సస్యానందం– తొలకరి పీఠిక) అంటారు. మల్లన శైవుడు, వీరాచార్యుడు జైనుడు. అందుకే మూలంలో జైన మందిరాలు తర్జుమాలో శివాలయాలంటూ అనువదించాడు మల్లన. అట్లాగే జైన తీర్థంకరులను శివ కుటుంబ సభ్యులుగా మార్చివేశాడు. మూలకర్త కృత్యాదిలో మహావీరునికి నమస్కరిస్తాడు. కాని మల్లన "తం శివకరం వన్దేశివం శ్రేయసే" అంటాడు. అలాగే ".... గణితము తెనుగున/గావింపగ గణితిని సుకవి మల్లుడగౌ / రీవల్లభాచరణ సరో/ జావాసిత చిత్త మధుకరాత్ముడ", తాను సుకవి మల్లుడను పేరుగల వాడినని, గణిత గ్రంథాన్ని తెలుగులోకి అనువ



దిస్తున్నానని, గౌరీ వల్లభుని చరణములను నమ్మిన భక్తుడనని" చెప్పుకొన్నాడు.

సున్న గురించిన చర్చ మల్లన గణిత పాండిత్యానికి గీటురాయి. 'సున్నయు సున్నయు బెంచిన సున్నయ, తత్పూతి (స్క్వేరు) ఘనంబు (క్యూబ్) సున్నయ వచ్చున్ సున్నయు లెక్క (నాన్ జీరో నెంబరు) యు బెంచిన సున్నయ తానమరి యుండు సుస్థిర రీతిన్' అని చెప్పి, సున్నతో భాగించే సందర్భాన్నే స్పృశించలేదు.

సున్న, భారత గణితవేత్తలు ప్రపంచానికి ఇచ్చిన వరం. భారత గణిత చరిత్రలోనే కాదు, ప్రపంచ గణిత చరిత్ర లోనూ సున్నను ప్రతిపాదించడం, దానిని ఒక సంఖ్యగా పరిగణించడం, రూపకల్పన, నంఖ్యా వ్యవస్థలో స్థానాలు విలువలు నిర్వచించడంలో సంఖ్యా గణనంలో మహావీరాచార్యుడు నేర్పు ప్రదర్శించాడు. ఒకటి, పది, వంద, వేయి... అని సంఖ్యకు విలువలు కడుతూ ఇరువది నాలుగు స్థానాలను, వాటి విలువలను ప్రతిపాదించి 10 వరకు వెళ్లాడు. 1023కి మహాక్షోభమని పేరు పెట్టినాడు. మల్లన ఇంకా పైకి వెళ్లి ముప్పయి ఆరు స్థానాల వద్ద ఆగినాడు. ఇతని సంఖ్యా గణనలో 1035 ను సాగరమన్నాడు. మహాక్షోభం తరువాత మల్లన పేర్కొన్న సంఖ్యలు 1024 = నిధి, 1025 = భూరి, 1029 = మహాభూరి, 1030 = మహా మేరు, 1032 =బహుశం, 1033 బాహుశం, 1034=సముద్రం, 1035 = సాగరం. భారత ప్రాచీన గణితంలో మరో విశేషం సంఖ్యలకు పర్యాయ పదాలు ఉపయోగించడం.

సున్నకు పర్యాయపదాలు శూన్యం, అనంతం, ఆకాశం, అంతరిక్షం, ఖమ్, గగనం, జలధర పథం. ఒకటికి పర్యాయపదాలు : చంద్ర, క్షపాకర, కళాధర. ఇందు కాషాయం నాలుగును సూచిస్తుంది. 'భాసుర సంజ్ఞా ప్రపంచాది వేదిక' (9వ) గణితం, ఒక సముద్రం, వివిధ ప్రక్రియలనే జలాలతో నిండినది. దాని లోతు భిన్నాల ప్రకరణం. ప్రకీర్ణ సమస్యలనే మొసళ్లు, త్రైరాసికాలనే తరంగాలు, మిశ్రగణిత సమస్యలనే రత్నాలు, వీటితో శోభిస్తూ, ఖాతా వ్యవహారమనే పాతాళ తలం కలిగి, పెక్కు తరణోపాయాలతో పొంగుతూ, ఎందరో గణిత విద్వజ్జనుల ఘోషలతో ఉన్న ఈ సముద్రంలోని వివిధ మణులను సంగ్రహించడం అజునికి కూడా సాధ్యపడదు అని అన్నారు మల్లన.

"సంజ్ఞ లెఱుగకున్న సంఖ్యాన మెఱుగంగ" (11వ ప). సంజ్ఞలు, కొలతలు లేకుండా, గణిత శాస్త్ర

విశేషాలు తెలుసుకోవడం కుదరదు. కాబట్టి తప్పనిసరిగా ఆయా మానాలు తెలుసుకోవాలి. కనుక భూమిని, కాలాన్ని, ధాన్యాన్ని, బంగారం మొదలైన వాటిని కొలవడం లేదా తూకం వేసే పద్ధతులను క్రమంగా తెలుసుకుందాం. భూమి ప్రమాణ సూత్రమును "కేసరపాటి గడ" అనే కొలత కర్రను భూమిని కొలవడానికి ఉపయోగించారు (సస్యానందం పేజీ-5). ఈ సూత్రాన్ని మల్లన 12, 13, 14 పద్యాలలో వివరించాడు (కుంటలు లెక్క). కాల ప్రమాణ సూత్రాన్ని 17, 18, 19 పద్యాలలోనూ, ధాన్య ప్రమాణ సూత్రాన్ని 20 పద్యాలలోనూ, కాంచన ప్రమాణ సూత్రాన్ని 21, 22 లోనూ, తులా ప్రమాణ సూత్రాన్ని (ధాన్యం, ఉప్పు, చింతపండు లోహాలను) 30, 31 పద్యాలలోనూ, సైన్యం, జనాభా వంటి లెక్కలు 34 వచనంలోనూ వివరించాడు.

గుణకారానికి ఉదాహరణ పద్యం చూడండి. ఒక్కొక్క శివాలయమున / కెక్కించిన పద్మ సంఖ్య యిరువది యేడీ / లెక్క వసునిధిన వేందుల / కెక్కించిన పద్మ సంఖ్య యేర్పడజెపుమా (43వ పద్యం).

శివాలయానికి (27) పద్మములు వసు (8), నిధి (9) నవ (9) ఇందు (1) అంటే 1998 × 27 = 53946 అవుతుంది, ఇది శివాలయాలకు కావలసిన పద్మముల సంఖ్య.

మరో పద్యం (51) చూడండి. గుణ గతి శశిగిరి శరవా / రణనేత్ర పయోధి శీతరశ్మలు గిరులన్/ గుణితంబుచేసి చెప్పుము / మణి విరచిత శూలి కంఠమాలిక వచ్చున్. గుణ-3, గతి-4, శశి-1, గిరి-7, శర-5, వారణ-8, నేత్ర-2, పయోధి-4, శరరశ్మి-1.

లబ్ధం = 142857143 - ఒడ్డు గిరులన్ -7 = గుణకం

లబ్ధము × గుణకము 142857143 × 7 = 1000000001 ఈ సంఖ్య మణి విరచిత శివ కంఠమాలిక తయారీకి వాడిన మణులు.

మల్లన గారి ప్రతిభను చాటే 71వ పద్యం -

శశి కరాబ్ధి శైల చంద్ర హయాగ్నీందు
గగన దివనిధాన కర్మరామ
నవ గుణాంద్రి రంధ్ర దివభూమి మితరాశి
గ్రహ గుణంబు సేయు గణక తిలక.

శశి-1, కర-2, అబ్ధి-4, శైల-7, చంద్ర-1, హయ-7, అగ్ని-3, ఇందు-1, గగన-0, దివ-0, నిధాన-9, కర్మ-6, రామ-3, నవ-9, గుణ-3, అద్రి-7, రంధ్ర-9, దివ-0, భూమి-1, కాబట్టి సంఖ్య 1097393690013717421 × 9 = 9876543210123456789.

(19 ప) భాగహారము :

రామచంద్రులు రామబాహులు
రామరాములు రంగుగా
రామవార్ధులు రామసాయక



రామ తర్కములున్ దగన్
రామభూధర రామసామజ
రామ పద్మజ రాసులున్
ధామ వైఖరి ముప్పదేడిలు
దండింబాలిడి చెప్పుమా.

రామచంద్రులు - 111 (ఒక భాజ్య సంఖ్య); రామ బాహువులు - 222, (రెండవ భాజ్య సంఖ్య), రామదామలు - 333 (మూడో భాజ్య సంఖ్య); రామవార్ధులు 444; (నాల్గవ భాజ్య సంఖ్య), రామసాయక - 555 (అయిదవ బాజ్యసంఖ్య), రామ తర్కములు - 666, (ఆరవ బాజ్య సంఖ్య) రామ భూధర 777 (ఏడవ భాజ్య సంఖ్య), రామ సామాజ 888, (ఎనిమిదవ భాజ్య సంఖ్య), రామపద్మజ 999 (తొమ్మిదవ బాస్య సంఖ్య). ఈ తొమ్మిది సంఖ్యలను 37తో భాగించాలి.

111÷37=3; 222÷37=6; 333÷9; 444÷37; 555÷37 = 15, 666÷37=18; 777÷37=21, 888÷37 = 24, 999÷37=27.

మల్లనది శాస్త్ర గంధమే అయినప్పటికి తన సమకాలీన సామాజిక సంస్కృతిని, ప్రతిబింబింప జేసినాడు. ఆనాటి పూజా విధానాలు, ఆస్తి పంపకాలు, వ్యాపార గణితం, కుటుంబ జీవనం, క్రీడా విశేషాలు గణిత సమస్యలు చోటు చేసుకున్నాయి. ఈనాడు దేనినైతే జియోమెట్రిక్ ప్రోగ్రాం అని వ్యవహరిస్తున్నామో దానికి సంబంధించిన సుప్రసిద్ధమైన చదరంగపు సమస్యను పేర్కొన్నాడు.

పరికర్మ గణితంలో 92వ పద్యం చూడండి. ***"సరణి శశి వేద దశ గతి / సరసిజ భావ రంధ్రదంతి శైలశరక్ష్మా / జలధికర భాణ ధరణులు / సరిశశికరి సంఖ్యాచెంచి చయ్యన చెపుమా"***

ఇక్కడ గుణకం, శశికరి అన్నాడు. శశి అంటే=1, కరి అంటే=8, అంకా నామ్ వామతో గతి: కదా! సంఖ్య పరిభాషలో 35వ శ్లోకంలో, అష్టమం, గజకర్ణ దిగ్గజం దన్తిహస్తికమ్, ద్విశదం, మత్త మాతంగ పన్నగా వసు వారణాః (ఈ పద్యంలో ర-ల ప్రాసమైత్రి గుర్తించగలరు. అట్లాగే గుణ్యం మల్టీప్లిక్, శశి వేద దశ గిరి... ధరణి).

152415789971041 ఇప్పుడు చేయవలసిన గుణకారం

152415789971041 × 81 = 12345678987654321

ఇది ఒక సమగ్రమైన ద్విముఖ సంఖ్య

మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో Professor of Sanskrit and comparative philodgyగా శ్రీ ఎం.రంగాచార్యులు ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో Mr.G.H. Stuart మద్రాసు ప్రెసిడెన్సీ Director of Public Instructor గా ఉన్నారు. రంగాచార్యులు గారు కళాశాల ఆచార్యులుగా ఉంటూ గవర్నమెంటు ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ క్యూరేటరుగా, అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. ఆ సందర్భంలో రంగాచార్యులు గారు "గణిత సారసంగ్రహ" రాతప్రతిని స్టువర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్రాతప్రతులు హైందవ గణితశాస్త్రం తాలూకు, కొత్త విషయాలను ప్రపంచానికి తెలియజేస్తాయని వాటి ప్రాముఖ్యతను పసిగట్టి మహావీరాచార్యుని గణిత గ్రంథాన్ని పరిష్కరించి ప్రచురించే బాధ్యత తీసుకున్నారు.

నాటికి ప్రాచ్య, పాశ్చాత్య గణిత శాస్త్రాలలో బాగా కృషి చేసి ఖ్యాతి గడించిన ఆచార్యుడు డా॥డేవిడ్ ఇంజీన్ స్మిత్, అమెరికా, న్యూయార్క్ మహా విశ్వవిద్యాలయంలో గణితాచార్యుడు. ఆయన మద్రాసు వచ్చినప్పుడు రంగాచార్యులు కలుసు కున్నారు. అప్పుడు వీరాచార్యుల 'గణిత సార సంగ్రహం' చర్చకు వచ్చింది. డా॥ స్మిత్ దాని ప్రాముఖ్యతను గుర్తించి ఒక మోస్తరు పరిశోధనా పత్రాన్ని తయారుచేసి రోమ్ నగరంలో ఏప్రిల్ 1908లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో చదివి ప్రపంచ గణితవేత్తల దృష్టికి వీరాచార్యుని రచనను తీసుకువెళ్లారు. మన గణిత ఉపాధ్యాయులు, ఆచార్యులు ఈ చిన్న వ్యాసం ఆలంబనగా కృషి చేసి ఆ మహనీయుని పేరును చిరస్మరణీయం చేస్తారని ఆశ.

మూలం:

1. సార సంగ్రహ గణితము : పావులూరి మల్లన (మల్లిఖార్జున) ప్రణీతము పరికర్మ భిన్న గణితము వాఖ్యాత ఆచార్య పి.వి.అరుణాచలం (పబ్లికేషన్ టి.టి.డి. 2023), 2. సారసంగ్రహ గణితము బై చెరుకు రామమోహన్‌రావు, 3. పావులూరి మల్లన సంకేతాల పద్యం బై లెనిన్ వేముల (దల్లాస్) సంచిక సెప్టెంబరు 2025, 4. సస్యానందం (పేజీ-5,9).

డా. కొశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

కొత్త సారథి

బీజేపీ కొత్త కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబిన్

భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యనిర్వాహక కొత్త అధ్యక్షుడిగా బిహార్ యువనేత నితిన్ నబిన్ సిన్హా డిసెంబర్ 15న పదవీ బాధ్యతలు స్వీకరించారు. నాలుగున్నర పదుల వయసు గల నితిన్ సిన్హా ఈ పదవిలో అనూహ్యంగా నియమితులయ్యారు. బిహార్ నుంచి పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన మొదటి వ్యక్తిగా, చిన్న వయసులోనే ఈ బాధ్యతలు చేపట్టిన వారిలో ఒకరిగా ఆయన నమోదయ్యారు. ఆయన తండ్రి నబీన్‌కిశోర్ ప్రసాద్ సిన్హా ఆ రాష్ట్ర బీజేపీలో కీలకంగా వ్యవహరించారు. ఆయన మరణం (2005) తరువాత ఇరవై ఆరేళ్ల వయస్సులో నితిన్ సిన్హా రాజకీయ ప్రవేశం చేశారు.

జాతీయ స్థాయిలో కార్యనిర్వాహక అధ్యక్ష పదవి నియామకం ఇది రెండవసారి. పార్టీ జాతీయ అధ్యక్ష పదవికాలం ముగిసి కొనసాగింపులో ఉన్న జేపీ నడ్డా తొలిసారి ఇలా నియమితులయ్యారు. కాగా సిన్హా పార్టీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం లాంఛనమేనని పార్టీ వర్గాలు తెలిపాయి. బిహార్‌లోని బాంకీపుర శాసనసభ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎన్నికైన సిన్హా, నితీశ్ కుమార్ మంత్రివర్గంలో పనిచేశారు. 2023లో చత్తీస్‌గఢ్‌లో పార్టీ అధికారంలోకి రావడానికి ఇన్ చార్జిగా కీలక పాత్ర పోషించారు. ప్రస్తుత నియామకం పట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు. సంస్థాగతంగా మంచి అనుభవం కలిగి, కష్టించే కార్యకర్తగా గుర్తింపు ఉన్న సిన్హా పార్టీని బలోపేతం చేస్తారని సామాజిక మాధ్యం ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. 'క్షేత్ర స్థాయి కార్యకర్తలను ఉన్నత స్థాయికి ఎదగనిచ్చే ఏకైక రాజకీయ పక్షం బీజేపీ. ఇది యువతను ప్రోత్సహించడంతో బృహత్ లక్ష్యసాధనకు దిశా నిర్దేశం చేస్తుంది' అపి నబీన్ సిన్హా కృతజ్ఞతలు తెలిపారు. మరొక 15 ఏళ్లకు ఉపయోగపడే విధంగా పార్టీని నిర్మిస్తున్న సమయంలో నితిన్ నియామకం జరిగింది. ★

డిసెంబర్ 25 అటల్‌జీ జయంతి

రాజనీతిజ్ఞుడు అటల్‌జీ

స్వతంత్ర భారత తొలితరం నేతలు, ఏలికల నుంచి ప్రస్తుత తరం వరకు పార్టీలకు అతీతంగా ఆరాధ్యుడు అటల్ బిహారీ వాజపేయి (డిసెంబర్ 25,1924–ఆగస్ట్ 16,2018) . తమ సుదీర్ఘ రాజకీయ, ప్రజాజీవన ప్రస్థానంలో ఎదురైన ఒడుదొడుకులను స్థయిర్యంగా ఎదుర్కొన్నారు తప్ప వ్యక్తులను కానీ, కాలాన్ని కానీ నిందించలేదు. ఆయా సందర్భాలలో ఆయన విజ్ఞత, రాజనీతిజ్ఞత, దేశభక్తి, విలువల పట్ల చూపిన నిబద్ధత తరతరాలకు ఆదర్శం. ప్రభుత్వాన్ని నిలుపుకొనేందుకు ఒకే ఒక్క ఓటు కొరత పడినా, దాని కోసం వెంపర్లాడక అధికారాన్నే తృణప్రాయంగా వదలి వేయడం ఆయన మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడు, కవి, వక్త.

చట్టసభలను ఓలలాడించిన అటల్‌జీ ఉపన్యాసాలు చిరస్మరణీయాలు. అలా అని అది కేవలం వాక్పటిమ కాదు. సమస్యలపై ఆయనకు గల అవగాహనకు నిదర్శనం. పార్లమెంట్‌లో అటల్‌జీ ప్రసంగం ఉందంటే నాటి ప్రధాన జవాహర్‌లాల్ నెహ్రూ తప్పనిసరిగా హాజరయ్యేవారంటనే వాటి పదును, విశ్లేషణాత్మక వివరణ ఎలాంటివో అర్థమవుతుంది. అప్పట్లో దేశంలో తిరుగులేని నేతగా ఉన్న నెహ్రూ– వాజపేయ్ నిజాయతీ, నిబద్ధతలను, జాతికి ఆయన అవసరాన్ని గుర్తించారు. ఆయనను 'భావి ప్రధాని'గా కూడా అభిప్రాయపడ్డారని చెబుతారు. వాజపేయి పార్లమెంటేరియన్ నుంచి ప్రధాని వరకు సాగిన ప్రస్థానాన్ని ప్రస్తావించుకుంటే, లోక్ సభకు ఎనిమిదిసార్లు, రాజ్యసభకు రెండుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ప్రధానిగా పాలనాపగ్గాలు చేపట్టిన కొంతకాలానికే (1998 మే) పోఖరాన్ అణుపరీక్షలు విజయవంతంగా ముగిశాయి. రష్యా, ఫ్రాన్స్ తదితర దేశాలు వాటిని సమర్థించగా, అమెరికా, కెనడా, జపాన్ వంటివి సహాయ నిరాకరణకు దిగాయి. 'మా దేశ రక్షణ కోసం ఈ పని చేశాం. ఏ దేశంపైన ఆక్రమణకు దిగాలన్న ఆలోచన మాకు లేదు' అనే సమాధానంతో అవి దారిలోకి రాక తప్పలేదు.

రాజకీయ,వ్యక్తిగత వైరాల మధ్య సున్నిత రేఖను గమనించి,పాటించిన ఉదారులు వాజపేయి. ప్రథమ ప్రధాని నెహ్రూ కన్నుమూతప్పుడు 'ఒక పాట మూగవోయింది/ఒక జ్వాల అనంతంలోకి నిష్క్రమించింది...' అని నివాళులు అర్పించిన ఆయన, కార్గిల్ యుద్ధంలో మరణించి శత్రుదేశ సైనికులకు తగు మర్యాదలతో అంతిమ సంస్కారాలు నిర్వహించాలని ప్రధాని హోదాలో సూచించారు. 'మరణాంతాన వైరాణ' (మరణంతో శత్రుత్వం ముగుస్తుంది) అన్న శ్రీరామ చంద్రుడి సూక్తిని తలపించారు. ★

తిరుప్పరంకు

రాజ్యాంగ స

అన్ని ఆధారాలతో తీర్పు ఇచ్చిన ఒక న్యాయమూర్తిని రాజకీయ ప్రయోజనాల కోసం, బుజ్జగింపు ధోరణిలో భాగంగా అభిశంసించే దుస్సాహసానికి ఒడిగట్టింది తమిళనాడు డీఎంకే ప్రభుత్వం. ఇందుకు లోక్‌సభను, కాంగ్రెస్, కమ్యూనిస్టులు వంటి తైనాతీలను వాడుకోవాలని చూస్తున్నది. తమిళనాడులో మదురైకి సమీపంలోని తిరుప్పరంకుండ్రం కొండ మీద కార్తికదీపం వివాదంలో డీఎంకే వైఖరి జాతిని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. ఎన్ని ఆధారాలతో పోరాడదలుచుకున్నా హిందువుల నోరు నొక్కాలన్న ఒక నియంత పోకడను అక్షరాలా అమలు చేస్తున్నది డీఎంకే. ఈ హిందూ వ్యతిరేక పార్టీ కొత్త రగడకు కేంద్ర బిందువు మద్రాస్ హైకోర్ట్-మదురై బెంచ్ కార్తికదీపం వెలిగించేందుకు అనుమతించడమే. ఈ తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. కల్లు తాగిన కోతి చందంగా లోక్‌సభలో అల్లరికి సిద్ధమవుతున్నది. ఆ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నది.

తమిళనాట సుబ్రహ్మణ్యస్వామికి దేవాలయాలు, భక్తులు ఎక్కువే. 'ఆరుపడై వీడుగల్' అనే ఆరు-తిరుప్పరన్‌కుండ్రం, తిరుచెందూర్, తిరుత్తణి, పళని, పళముదిర్‌చోళై, స్వామిమలై-సుబ్రహ్మణ్య క్షేత్రాలకు దేశం నలుమూలల నుండి భక్తులు వస్తారు. వీటిలో ఇటీవల వార్తల్లో నిలిచినది, మదురై సమీపంలోని తిరుప్పరంకుండ్రం.

ఇది అత్యంత ప్రాచీన ఆలయం. స్కాంద పురాణం, కుమార సంభవం వంటి పురాతన గ్రంథాలలో ఈ గుడి ప్రస్తావన ఉంది. పాండ్య రాజుల కాలంలో ఈ దేవాలయాన్ని భారీగా నిర్మించారు. ఆపై నాయకరాజుల కాలంలో మరమ్మతులు చేశారు. నాయన్మార్‌లలో ప్రముఖుడైన 'తిరుజ్ఞాన సంబంధర్' ఈ ఆలయంలో చోళ, చేర, పాండ్య ప్రభువులను ఏకకాలంలో ఆశీర్వదించినట్లు చెప్తారు. ఇక్కడి శివాలయంలో నక్కీరర్, సుందరర్, తిరుజ్ఞాన సంబంధర్ పరమశివుని స్తుతించినట్లు చరిత్ర చెబుతుంది. ఇక్కడ శివుడిని 'పరంగినాథర్', అమ్మవారిని 'ఆవుడయి నాయకి' పేర్లతో ఆరాధిస్తారు. విష్ణువుని 'పావల కనిమై పెరుమాళ్' అంటారు. ఈ దేవాలయ పరిసరాల్లో ఐదు జలకుండాలు ఉన్నాయి. అవి- శరవణ పొయిగై, లక్ష్మితీర్థం, సన్యాసి కెనరు, కాశి సునై, సత్య కూపం. తిరుప్పరన్‌కుండ్రంలో సుబ్రహ్మణ్య స్వామితో బాటు శివ, విష్ణు, గణేశ, దుర్గ ఆలయాలు ఉన్నాయి. సుబ్రహ్మణ్య స్వామికి అనాదిగా షట్కాల పూజలు జరుగుతున్నాయి. తమిళ మాసం 'ఐప్పసి', దాదాపు అక్టోబర్, నవంబర్ నెలల మధ్యలో జరిగే కందషష్ఠి పండుగ వైభవంగా జరుగుతాయి.

ఎ. రాధాకృష్ణన్
బ్యాంకు విశ్రాంత అధికారి

సుబ్రహ్మణ్యస్వామి ప్రధాన దేవాలయం వెనుక ఒక గుట్ట పైన వినాయకుడి దేవాలయం-ఉచ్చి పిళ్లయార్ కోవిల్' ఉంది. అన్ని ఉత్సవాలకు, ఈ గుడి ప్రాంగణంలోని దీపస్తంభం పైన కార్తికదీపం వెలిగించడం సంప్రదాయం. ఈ గుడికి కొద్ది దూరంలో, అన్ని గుట్టలలో ఎత్తైన ఇంకొక గుట్టపై సికందర్ దర్గా ఉంది. ఈ దర్గా ఆవరణ బయట నుండి దాదాపు 50 మీటర్ల దూరంలో ఆ దీపస్తంభం ఉంది. కొన్ని దశాబ్దాల క్రితం వరకు దీనిపైన కూడా కార్తీకదీపం వెలిగించేవారు. రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో ఇది నిలిపి వేసినట్లు స్థానికులు చెబుతారు.

దర్గా వెనుక కథ ఏమిటి? మదురై 1335 నుండి 1377 వరకు సుల్తానుల పాలనలో ఉండేది. 1377లో విజయనగర సైన్యం కుమార కంపన్న నాయకత్వంలో అప్పటి సుల్తాన్ సికందర్ షాను ఓడించి మదురైను కైవసం చేసుకొంది. బుక్కరాయలి రెండవ కుమారుడు కంపన్న. సికందర్ షా, అనుచరులు యుద్ధంలో మరణించారు. కొందరు అతడి జ్ఞాపకార్థం తిరుప్పరంకుండ్రంలో ఈ స్మారకచిహ్నాన్ని నిర్మించారంటారు. ఇది 14-15వ శతాబ్దంలో జరిగి ఉండవచ్చు. 18వ శతాబ్దంలో దీనిని విస్తరించి సికందర్ దర్గా అని వ్యవహరించడం మొదలెట్టారు. ఆ యుద్ధం వివరాలు గంగాదేవి రచించిన 'మధురా విజయం'/ 'వీర కంపరాయ చరితం'లో చూడవచ్చు. నిజానికి, ఇక్కడ సికందర్ షా సమాధిని నిర్మించినట్లు ఆధారాలు లేవు. ఇదే సికందర్ షాకు మదురైలోని గోరి పాళయంలో ఒక దర్గా ఉంది. మరి తిరుప్పరంకుండ్రంలో ఉన్నది సికందర్ షా దర్గా ఎలా అవుతుంది?

తిరుప్పరంకుండ్రం గుట్టలను కందర్ మలై అంటారు. అంటే సుబ్రహ్మణ్య స్వామి కొండ. అయితే ఆ మధ్య కొంతమంది దీనికి 'సికందర్ మలై' పేరును వాడుకలోకి తెచ్చే ప్రయత్నం చేసారు. దీని వెనుక కొన్ని తీవ్రవాద ఇస్లామిక్ సంస్థలు, డీఎంకే అనుబంధ సంస్థల పాత్ర ఉన్నట్లు వార్త. అయితే స్థానిక హిందువులు, భక్తుల ప్రతిఘటనతో వెనక్కు తగ్గారు. కొన్ని అసాంఘిక శక్తులు ఈ దర్గా పరిసర ప్రాంతాలలో జంతుబలి ఇవ్వడం, విందులు చేసుకోవడం వంటి కార్యక్రమాలతో హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. దీనికి సంబంధించి అక్టోబర్ 14, 2025న మద్రాస్ హైకోర్టు తన తీర్పును వెలువరిస్తూ 'తిరుప్పరంకుండ్రం కొండను కందర్ మలై అనే పిలవాలని, వేరొక పేరుతో ప్రజలను తప్పు దారి పట్టించడం తగదు' అని ఆదేశించింది. కొండపై జంతువధ ఆపాలని కూడా ఆదేశించింది.

కొండపై హక్కు గురించి 1923లో జరిగిన వివాదం, 1931 ప్రివీ కౌన్సిల్ తీర్పు గుర్తు చేసుకోవాలి. 1923లో మదురై సుబార్డినేట్ జడ్జి దర్గా ఉన్న స్థలం, దానికి చేరుకొనే మార్గం తప్ప మిగితా తిరుప్పరంకుండ్రం దేవాలయానికి చెందిన ఆస్తిగా ప్రకటించారు. 1923 నాటి ఈ తీర్పును 1931లో ప్రివీ కౌన్సిల్ బలపరిచింది. ముస్లింల పాలనలో కట్టినది కాబట్టి దర్గా హక్కులు పరిమితమని ప్రివీ కౌన్సిల్ అభిప్రాయపడింది.

ప్రస్తుత వివాదం ఏమిటి? హిందూ తమిళర్ కచ్చి పార్టీ కార్యకర్త రామ రవికుమార్, మరికొందరు భక్తులు తమిళనాడు ప్రభుత్వానికి అక్టోబర్‌లో ఒక విన్నపం సమర్పించారు. ఆ గుట్టపై ఉన్న దీపస్తంభం మీద కార్తీకదీపం వెలిగించడానికి అనుమతి కోరారు. నవంబర్‌లో ప్రభుత్వం ఇందుకు నిరాకరించింది.

ంద్రం రగడతో ంక్షోభమేనా?

అక్కడ దీపం వెలిగిస్తే ముస్లిముల మనోభావాలు దెబ్బ తింటాయని (దర్గా ఉన్నది కాబట్టి) ప్రభుత్వ అధికారుల వాదన. నిజానికి 1995లో దర్గా నుండి 15 మీటర్ల దూరంలో దీపం వెలిగిస్తే అభ్యంతరం ఉండదని దాని నిర్వాహకులు ఒప్పందం మేరకు రాత పూర్వకంగా అంగీకరించారు. దీపం వెలిగించే దిమ్మ, దర్గాకు 50 మీటర్ల దూరంలో ఉంది. బయట ఉన్న ఆ వేదికపై దీపం వెలిగిస్తే ముస్లిముల కొచ్చే ఇబ్బంది ఏమిటో ప్రభుత్వం చెప్పట్లేదు. ముస్లిములకు అభ్యంతరము లేక పోయినా, డీఎంకే నేతల ప్రోద్బలంతో వారు కూడా ఈ వివాదంలో తలదూర్చారు.

ఈ పరిస్థితులలో పండుగ సందర్భంగా డిసెంబర్ 3న, దీపస్తంభం మీద దీపం వెలిగించ డానికి అనుమతి కోరుతూ రామ రవికుమార్, పరమశివమ్, కార్తికేయన్, అరస పాండి తదితరులు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన మద్రాస్ హైకోర్టు, మదురై బెంచ్‌కు చెందిన జస్టిస్ జీఆర్ స్వామినాథన్ డిసెంబర్ 1న చరిత్రాత్మక తీర్పును వెలువరించారు. దీపస్తంభం దర్గా స్థలంలో లేదని, ఆ ప్రదేశం దేవాలయానికి సంబంధించినది కావున, భక్తులు నిరభ్యంతరంగా దీపం వెలిగించవచ్చని తీర్పునిచ్చారు. ముందు రోజే ఆయన ఈ దేవాలయాన్ని, పరిసర ప్రాంతాలను సందర్శించి స్వయంగా సమాచారం సేకరించారు. నాటి ప్రివీ కౌన్సిల్ తీర్పును ఉటంకిస్తూ, దేవాలయపు స్థలంలో దీపం వెలిగించడానికి ఎవరికీ అభ్యంతరం ఉండకూడదని అభిప్రాయపడ్డారు. దర్గా నిర్వహణ కమిటీ కూడా దీపం వెలిగించడానికి అభ్యంతరం తెలియజేయలేదు. దీనిని అడ్డుకోవడం అంటే, హిందూ భక్తుల రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. ఇక పై జరిగే ఉత్సవాలకు ఇక్కడ కార్తీకదీపం వెలిగించడానికి భక్తులకు అనుమతి ఉంటుంది అని చెప్పారు. డిసెంబర్ 3, సాయంత్రం 6 గంటలకు కార్తికదీపం వెలిగించాలని ఆయన ఆదేశించారు. ఆ ఏర్పాట్లు చేయమని దేవస్థానం అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ భద్రత కల్పించాలని సూచించారు. తీర్పు ముగింపులో జస్టిస్ స్వామినాథన్ తమిళనాడు ప్రభుత్వాన్ని తప్పుపట్టారు.

ఇన్ని చెప్పినా డీఎంకే ప్రభుత్వం అత్యంత హేయంగా వ్యవహరించింది. 3వ తేదీన ఎటువంటి ఏర్పాట్లను చేయకుండా, దేవాలయ పరిసర ప్రాంతాలలో 144,163 సెక్షన్‌లు విధించి భక్తుల రాకపోకలను కట్టడి చేసింది. కోర్టు ఉత్తర్వులను లెక్క చేయకుండా, ఉచ్చి పిళ్లయార్ కోవెల వద్ద (పాత పద్ధతిలో) మాత్రమే దీపాలను వెలిగించింది. ఈ పరిస్థితుల్లో రామ్ రవికుమార్, 3 వ తేదీ మధ్యాన్నం తిరిగి హైకోర్టును ఆశ్రయించారు. తమిళనాడు ప్రభుత్వం కోర్టు ధిక్కార నేరానికి పాల్పడిందని ఆరోపించారు. అదేరోజు జస్టిస్ స్వామినాథన్ పునర్విచారణ చేసి, అధికారులను వివరణ అడిగారు. శాంతి భద్రత సమస్యలు ఉత్పన్నం అవుతాయని వారు వాదించారు.

కోర్టు ధిక్కార నేరానికి వారిని మందలించిన జస్టిస్ స్వామినాథన్, రామ్ రవి కుమార్‌కు దీపం వెలిగించడానికి అనుమతి ఇస్తూ, వారికి సహకరించాల్సిందిగా పోలీసులను, దేవాలయ అధికారులను ఆదేశించారు. రక్షణ కల్పించడానికి పోలీసులు తమ అశక్తత తెలియజేయడంతో, జస్టిస్ స్వామినాథన్ సీఐఎస్ఎఫ్‌ను తోడుగా పంపారు. అయినా దీపస్తంభం వద్దకు వెళ్తున్న రామ రవికుమార్ తదితరులను పోలీసులు అడ్డగించారు. చాల సేపు వాగ్వివాదం జరిగిన పిమ్మట, వీరు వెనక్కు తిరిగి రావలసి వచ్చింది. దీనిపై తీవ్రంగా స్పందించిన జస్టిస్ స్వామినాథన్ మదురై జిల్లా యంత్రాంగం విధించిన 144 సెక్షన్‌ను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసారు.

జస్టిస్ స్వామినాథన్ స్వాష్ చేసిన 144ను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం మద్రాస్ హైకోర్ట్ బెంచ్‌ను ఆశ్రయించింది. జస్టిస్ జయ చంద్రన్, జస్టిస్ రామకృష్ణన్ బెంచ్, తమిళనాడు ప్రభుత్వపు అభ్యంతరాలు కొట్టి వేస్తూ జస్టిస్ స్వామినాథన్ ఆదేశం చట్టబద్ధమైనదేనని ధృవీకరించింది.

మదురై కలెక్టర్ ప్రవీణ్ కుమార్, పోలీస్ కమిషనర్ లోకనాథన్ కోర్టు ధిక్కారానికి పాల్పడినందుకు జస్టిస్ స్వామినాథన్ వారిని వివరణ కోరారు. వెంటనే కోర్టు ఆదేశాలను అమలు చేయాలని చెప్పారు. డిసెంబర్ 4న సర్వాలాయ దీపం కాబట్టి, ఈ రోజు కూడా భక్తులు దీపాలు వెలిగిస్తారు. దేవాలయ అధికారులు 4 వ తేదీన తగిన ఏర్పాట్లు చేసి భక్తులు దీపాలు వెలిగించడానికి సహకరించాలని ఆదేశించారు. అంతేకాదు, 5 వ తేదీ ఉదయం కోర్టులో హాజరై దీనిని అమలు చేసినట్లు ధృవీకరించాలని నిర్దేశించారు. దీనిని జీర్ణించుకోలేని తమిళనాడు ప్రభుత్వం 5న సుప్రీం కోర్టును ఆశ్రయించింది. అయితే వెంటనే లిస్ట్ చేయాలన్న అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలను కొట్టి వేయాలని, తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటేషన్ దాఖలు చేసింది. ఈ వ్యవహారంలో దర్గా కమిటీ, ముస్లిముల నుండి ఎటువంటి ప్రతిఘటన ఎదురు కాలేదు. రాష్ట్ర ప్రభుత్వ మొండితనం ఈ సమస్యకు మూలం. అయితే డీఎంకే నాయకులను ఎదిరించే శక్తి ముస్లిం వర్గాలకు లేదు.

జస్టిస్ స్వామినాథన్

స్టాలిన్ ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత నానాటికి పెరుగుతోంది. 2026 తిరిగి అధికారానికి రాలేమని రూఢి అయింది. స్టాలిన్ కుటుంబంలోనే మూడు శిబిరాలు తయారై ఆయనను చీకాకు పెడుతున్నాయి. హోమ్ శాఖను తన వద్దే ఉంచుకున్న స్టాలిన్, పోలీస్ యంత్రాంగాన్ని అదుపు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారు. తాము ఇన్నేళ్లుగా కాపాడుకున్న దొంగ ఓట్ల ఖజానా చేజారడం ఖాయం. ఇంకోవైపు తమ 'మైనారిటీ ఓట్ల'కు గండి కొట్టడానికి నటుడు జోసెఫ్ విజయ్ పార్టీ సిద్ధపడుతోంది. కాంగ్రెస్ పార్టీ లోపాయకారిగా విజయ్‌తో మంతనాలు జరుపు తున్నట్లు వినికిడి. ఈ పరిస్థితులలో మైనారిటీ ఓట్లు చెదిరిపోకుండా ఉండేందుకు డీఎంకే తన హిందూ వ్యతిరేకతకు కొత్త రూపం ఇచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ చర్య వల్ల, హిందువుల ఓట్లను కోల్పోయే అవకాశం కూడా లేకపోలేదు. ఇప్పుడు తమ ప్రయోజనాల కోసం అత్యున్నత చట్టసభ లోక్‌సభకు ఈ వివాదాన్ని డీఎంకే తీసుకుపోదలచింది. ఈ తీర్పు ఇచ్చిన జస్టిస్ స్వామినాథన్‌ను అభిశంసించాలని స్పీకర్‌కు నోటీసు ఇచ్చింది. ఇది మరొక రాజ్యాంగ వివాదానికి దారితీస్తుంది. ★

‘సంచలనాత్మక చిత్రం ధురంధర్’ పరిచయం

‘భారతదేశానికి మొదటి శత్రువులు భారతదేశంలోనే ఉన్నారు. తరువాతే పాకిస్తాన్ శత్రుత్వం...’

‘ఇలాంటివాటికి సమాధానం చెప్పడానికి అవకాశం ఇచ్చే ఒక ప్రభుత్వం ఏదో ఒకరోజు వస్తుంది. అప్పుడు చూద్దాం’..

‘ఇది నవభారతం. మాకు ద్రోహం చేస్తే మీ ఇంటిలో చొరబడి అయినా సరే సంగతి చూస్తాం..’

నిజమే, భారత్‌కు ప్రథమ శత్రువులు భారత్‌లోనే ఉన్నారు. ఈ విషయంలో పాకిస్తాన్‌ది రెండో స్థానమే. చారిత్రక వాస్తవాల సారాంశం, వర్తమాన పరిణామాల మూలం, భారత్ ఎదుర్కొంటున్న ఇన్ని సమస్యలకు కీలకం ఏమిటో చెప్పే చేదునిజమిది. ఈ సమస్యలను సృష్టిస్తున్న వారు ఎవరో తెలుసు. దీనిని ఎదుర్కోవడం ఎలాగో తెలుసు. కానీ ఆ పనిచేయగలిగినవారి చేతులు కట్టేసిన కాలం ఒకటి రాజ్యమేలింది. ఆ బాధను అణుచుకున్న గుండెలు పలికిన మాట ఇది– ఏదో ఒకరోజు ఇలాంటి వాళ్లకి సమాధానం చెప్పే అవకాశం కల్పించే ప్రభుత్వం ఒకటి వస్తుంది. వారు కోరుకున్నట్టు నిజంగానే వచ్చింది. ఆ ప్రభుత్వ అధినేత చేసిన హెచ్చరికే– ఇది నవభారతం...ఈ మూడు సంభాషణల నేపథ్యాలు ధురంధర్ (హిందీ) చిత్రాన్ని నడిపిస్తాయి.

కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ, బెంగాల్ ఫైల్స్, ఆర్టికల్ 370, యురి వంటి సినిమాల మాదిరిగానే వామపక్షవాదుల వక్రభాష్యాలను, వికృత వ్యాఖ్యలను దాటుకుని ప్రస్తుతం దేశమంతా చర్చకు కారణమైన సినిమా ధురంధర్. ఆదిత్య ధర్ దర్శకత్వంలో వెలువడిన ఈ చిత్రం ఇతివృత్తం, చిత్రీకరణ, నటుల ప్రతిభ అద్భుతమే. డిసెంబర్ 5న విడుదలైన ఈ చిత్రం జాతీయ భావాలను నిరంతరం హేళన చేసే, దేశభక్తిని మూఢత్వంగా చిత్రించే నకిలీ మేధావులలో, ఉదారవాదులలో వణుకు పుట్టించింది.

భారత్–పాకిస్తాన్‌ల మధ్య పరోక్ష యుద్ధంలోని ఒక కీలక ఖండాన్ని అత్యంత వాస్తవికంగా చిత్రించినదే ధురంధర్. ఎనిమిది అధ్యాయాలు (చాప్టర్‌లు)గా దర్శకుడు ఇతివృత్తాన్ని విభజించారు. వాటి పేర్లు– ది ప్రైస్ ఆఫ్ పీస్, స్ట్రేంజర్ ఇన్ ది ల్యాండ్ ఆఫ్ షాడోస్, ది బాస్టర్డ్ కింగ్ ఆఫ్ లయారి, బులెట్స్ అండ్ రోజెస్, ది జిన్, ది డెవిల్స్ గార్డియన్, ది బటర్‌ఫ్లై ఎఫెక్ట్, ఇట్ టు బ్రూటస్.

తొలి చాప్టర్ ఆరంభం లేదా సినిమా మొదలు– హైజాక్ అయిన భారత విమానం ఐసీ 814 అఫ్ఘానిస్తాన్ కొండలలో ఉంటుంది. ఇది డిసెంబర్ 30,1999న జరిగిన వాస్తవ ఘటన. బయట నిలబడి ఉన్న ఇంటెలిజెన్స్ బ్యూరో అధిపతి అజయ్ సన్యాల్ (అజిత్ ధోవల్ పాత్ర) దగ్గరకు దేవవ్రత కపూర్ (నాటి విదేశ వ్యవహారాల మంత్రి జస్వంత్‌సింగ్) వచ్చి మంత్రిమండలి నిర్ణయం చెబుతాడు. ముగ్గురు కీలక ముస్లిం మతోన్మాద ఉగ్రవాదులను వాళ్లకి అప్పగించడానికి, (బతికి ఉన్న) విమాన ప్రయాణికులను విడుదల చేయడానికి కోటి అమెరికా డాలర్లకు ఒప్పందం చేసుకోవడం ఈ భాగంలో ప్రధానం. పాకిస్తాన్‌కు మన గూఢాచారులను పంపించడానికి అంతకు ముందు నిరాకరించిన ఆర్ అండ్ ఏ డబ్ల్యు అధిపతి ఇక తప్పక ఆ ప్రతిపాదనకు అంగీకరిస్తాడు. రెండో అధ్యాయంలో హమ్జా అలీ మజారీ అనే పేరుతో భారత గూఢచారిని అఫ్ఘాన్ ద్వారా పాకిస్తాన్ చేరుస్తారు. అక్కడి కరాచీలోని లయారీలో ఆయన పని చేయాలి. ప్రతి అధ్యాయం ఒక మలుపుతో, మొదలై మరొక మలుపుతో ముగుస్తూ ఉంటుంది.

రహమాన్ డెకాయిట్ లేదా రహమాన్ బలోచ్ అనే గ్యాంగ్‌స్టర్‌తో చాలా తెలివిగా హమ్జా కలుస్తాడు. రహమాన్ ప్రత్యర్థి గ్యాంగ్‌స్టర్ బాబూ డెకాయిట్ అతడి పెద్ద కొడుకును చంపినప్పుడు అతడి వెంటే ఉన్న చిన్నకొడుకును రక్షించి రహమాన్‌కు దగ్గరవుతాడు. ఈ రహమాన్ లయారీలో ఒక నేర సామ్రాజ్యం నిర్మించుకున్నాడు. అక్రమ ఆయుధాలు, దొంగనోట్లు, ఉగ్రవాదులకు ఆశ్రయం వంటివన్నీ లయారీలోనే ఉంటాయి. వీళ్ల ప్రాపకం కోసం రాజకీయ పార్టీలు, ఇతర ముఠాలు ప్రాకులాడుతూ ఉంటాయి. లయారీలోకి ఎవరూ ప్రవేశించే సాహసం చేయరు. మొత్తానికి వీళ్లందరి మధ్య గొడవలు పెరిగేటట్టు చేసి, వారంతా ఒకరినొకరు చంపుకొనేటట్టు చేస్తాడు హమ్జా.

కాందహార్ ఉదంతం, తరువాత పార్లమెంట్ మీద దాడి, ఆపై 26/11 ముంబై హత్యాకాండ వంటి భారత సార్వభౌమతాన్ని సవాలు చేసిన సంఘటనలను దర్శకుడు చిత్రించాడు. ఐదు వందల నోట్లకు సంబంధించిన బ్లాకులు భారత కేంద్రమంత్రి ఒకరే పాకిస్తాన్‌లో గ్యాంగ్‌లకు అందిచారన్న మాట విస్తుగొలుపుతుంది. ముంబై తాజ్ హోటల్‌లో రక్తపాతం సృష్టిస్తున్న కసబ్‌కు లయారీలో ఆనందంగా టీవీల ముందు కూర్చుని సూచనలు ఇచ్చే సన్నివేశం నిజంగానే కలచివేస్తుంది. అది మన మీడియా సాయంతోనే జరిగిందని చెప్పవచ్చు. ఎక్కడ నుంచి కమాండోలు వస్తున్నారు? ఎక్కడ నుంచి పోలీసులు కాపు కాశారు వంటి విషయాలన్నీ ఆనాడు మన మీడియా కూలంకషంగా ఇచ్చింది. వీటిని లయారీ నుంచి ముంబైలోని కసబ్‌కు సమాచారం ఇచ్చారు. తరువాత వాళ్లు అనుకునే మాటలు కూడా అవమానకరంగా అనిపిస్తాయి. ముంబై దెబ్బకి భారత్ దాడి చేస్తుందని అనుకున్నాం, ఇలా చేతకాని తనం ప్రదర్శించిందేమిటి? అని నవ్వుకుంటారు. ముంబై దాడి కోసం హమ్జా ఎదుటే చర్చలు జరుగుతూ ఉంటాయి. అయితే



దర్శకుడు ధర్



నోరు విప్పలేని పరిస్థితి. ఆ రహస్యం స్వదేశానికి చేరవేయలేని పరిస్థితి. ఆఖరికి దాడులు కూడా జరిగిపోతాయి. ఆ ముఠాలన్నీ అల్లాహోఅక్బర్ అంటూ విజయ నినాదాలు చేస్తాయి. వాళ్లందరితో కలసి ఈ గూఢచారి కూడా అత్యంత బాధాకరంగా గొంతు కలపడం వంటి సన్నివేశాలలో రణ్‌వీర్ అద్భుతంగా నటించారు.

ధురంధర్‌లో హింస భాగం ఎక్కువగా ఉందని ఇదివరకు హింసను అతిగా, అనవసరంగా చూపించిన సినిమాలలో నటించిన వారు ఆరోపిస్తున్నారు. హింస తక్కువగా ఉండడం మంచిదే అయినా, పరమ కిరాతకంగా ఉండే గ్యాంగ్‌స్టర్‌ల గురించి, వారి ఖండాంతర కుట్రల గురించి చెప్పేటప్పుడు హింసాత్మక ఘట్టాలను పరిహరించడం వాస్తవికతకు అద్దంపట్టదు. తన అడ్డాలోకి వస్తున్న ప్రత్యర్థి గ్యాంగ్‌స్టర్ మనుషులను రహమాన్ డెకాయిట్ ఎంత దారుణంగా చంపిస్తాడో చెప్పే సన్నివేశం, పాకిస్తాన్‌కు దొరికిపోయిన భారత గూఢచారులను ఐఎస్ఐ మనుషులు ఎంత కిరాతకంగా హింసిస్తారో చూపే సన్నివేశం వెన్నులో వణుకు పుట్టిస్తుంది. అదే సమయంలో గూఢచారులకు దేశం పట్ల ఉండే నిబద్ధత, దేశ రక్షణ పట్ల ఉండే పట్టుదలను చూపిస్తాయి. అయితే దేశంలో చాలామంది పాకిస్తాన్ భక్తులు, ఆ దేశం పెంచి పోషిస్తున్న ఉగ్రవాదుల మీద ఈగ వాలకుండా చూడడం తమ ప్రథమ కర్తవ్యం అన్నట్టు వ్యవహరించే హక్కుల కార్యకర్తలకు ఆ త్యాగాలు, నిబద్ధత పట్టలేదు. ఉగ్రవాదులు అయినప్పటికీ వారికీ కొన్ని హక్కులు ఉంటాయి కాబట్టి, పాకిస్తానీ గ్యాంగ్‌స్టర్‌లని ఇంత దారుణంగా చిత్రించడం ఏమిటి అంటూ వాపోయిన వారు కూడా ఉన్నారు. కానీ ప్రజలు ఈ చిత్రాన్ని ఆకాశానికి ఎత్తుతున్నారు. ముంబైలో చాలా థియేటర్లలో రాత్రిపగలు ఈ చిత్రాన్నే ప్రదర్శిస్తున్నారు.

ఈ చిత్రంలో లయారీ, ఆ ప్రాంతం ఉన్న కరాచీ యథాతథంగా కనిపిస్తుంది. కానీ అదంతా థాయ్‌లాండ్, బ్యాంకాక్‌లలో సెట్‌లు వేసి చిత్రించారు. ఇంకొంత లద్దాక్, చండీఘడ్‌లలో చిత్రించారు. అచ్చంగా లయారీలోనే ఉన్న అనుభూతి కలిగించడానికి మరొక కారణం నేపథ్య సంగీతం.

ఇందులోని పాత్రలన్నీ నిజ జీవితంలోనివే. హమ్జా మజారీ పాత్రకు మోహిత్ శర్మ అనే రహస్య గూఢచారి పాత్రను నమూనాగా తీసుకున్నారు. దీనిని రణ్‌వీర్ సింగ్ అత్యద్భుతంగా పండించారు. ఇక రహమాన్ డెకాయిట్ పాత్రలో అక్షయ్ ఖన్నా విశేష ప్రతిభను ప్రదర్శించారు. రహమాన్ డెకాయిట్ గ్యాంగులను మట్టుపెట్టడమే లక్ష్యంగా ఉన్న ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ ఎస్పీ చౌదరీ ఆలంగా సంజయ్ దత్ మరపురాని నటనను ప్రదర్శించారు. అజయ్ సన్యాల్ పాత్రలో ఆర్ మాధవన్ చెరగని ముద్ర వేసే విధంగా నటించారు. వికాస్ నవలఖా సినిమాటోగ్రఫీ, శాశ్వత్ సచిదేవ్ సంగీతం అందించారు. దర్శకత్వం చిత్రానువాదం, సంభాషణలు కూడా ఆదిత్య ధర్ సమకూర్చారు.

ఈ చిత్రం సీక్వెల్ వచ్చే సంవత్సరం మార్చిలో రాబోతున్నది.

భారత చలనచిత్రంలోని అన్ని రికార్డులను బద్దలు కొట్టిన ధురంధర్ ఇప్పుడు కేవలం భారత్‌లోనే చర్చనీయాంశం కాదు. పాకిస్తాన్ ఈ చిత్రాన్ని నిషేధించి అక్కడ కూడా చర్చకు అవకాశం ఇచ్చింది. బ్రహైన్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఒమన్ దేశాలు కూడా పాక్‌ను అనుసరించాయి. ధురంధర్‌కు పోటీగా 'మేరా లయారీ' పేరుతో చిత్రం నిర్మిస్తున్నట్టు సింధ్ ప్రాంత ప్రభుత్వం ప్రకటించింది. ధురంధర్ ప్రతికూల ప్రచారం చేసే ఉద్దేశంతో నిర్మించారని సింధ్ ప్రాంత ప్రభుత్వ సమాచార మంత్రి షర్జిల్ ఇనామ్ మెమన్ డిసెంబర్ 13న ప్రకటించారు. మేరా లయారీలో ఎంత శాంతిభద్రతలు పరిఢవిల్లాయో, సంపద ఉండేదో, పాకిస్తాన్‌కు ఎలా గర్వకారణమో ఆ చిత్రం తెలియచేస్తుందని కూడా ఆ మంత్రి ప్రకటనలో తెలియచేశారు. ఈ చిత్రంలో పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ చిహ్నాలను ఉపయోగించి అవమానించారని, లయారీని ఉగ్రవాద కేంద్రంగా చిత్రించడం వాస్తవానికి విరుద్ధమని మహమ్మద్ ఆమీర్ కరాచీ కోర్టుకు ఫిర్యాదు చేశారు. దీనితో దర్శకుడు ధర్ మీద, ఇతరుల మీద కేసు నమోదైంది. ★

కథ

చెయ్యేరు నిండుగా పారుతోంది. ఏటి ఒడ్డున ఇసుకలో దాదాపు రెండువందలకు పైగా గోవులు ఉన్నాయి. ఏటిలో పారుతున్న నీళ్లకు నాలుగు బారల దూరంలో కూర్చుని నెమరు వేస్తున్నాయి. ఏ ఒక్కదాని మెడలోనూ తాడు లేదు. ముకుతాడూ లేదు. తొగూరుపేటలో సుమారు ఇంటికి నాలుగైదు ఆవులుంటాయి. వాటిని ఎవ్వరూ వ్యవసాయం పనులకు వాడుకోరు. పాలు కూడా పితకరు. దూడలకే వదిలేస్తారు. ఆ ఆవులను రోజూ కొండకు తోలుకునిపోయి మేపుకుని వచ్చేది శివరామయ్య. అతడు ఉచితంగానే ఈ పనిచేస్తాడు. అతడి తాతల కాలం నుంచి ఆలమందలను మేపడమే వృత్తి. అప్పట్లో వ్యవసాయంలో పశువులదే ప్రధాన పాత్ర. యాంత్రీకరణ పెరిగాక.. ఎగువన అన్నమయ్య డ్యాం వచ్చాక.. పశువులతో వ్యవసాయం చేయడం లేదు. అయినా ఎవ్వరూ తమ ఇంట్లో ఉండే పశువులను అమ్ముకోలేదు. వాటిని మేపడం అలవాటైన శివరామయ్య...ఆ పని మానుకోలేదు. ఇప్పటికీ రోజూ పొద్దున్నే తొమ్మిది గంటలకంతా వాటిని తోలుకుని పోయి పులికొండ ఎక్కిస్తాడు. తిరిగి సాయంత్రం కొండ నుంచి ఊర్లోకి తోలుకుని వస్తాడు. నీటి ప్రవాహం వాటి దగ్గరకు రావడంతో గోవులన్నీ లేచి తిరిగి కాస్త దూరం వెళ్లి ఇసుకలో కూర్చున్నాయి. అవి రోజూ రాత్రిపూట అక్కడే ఇసుకలో సేదతీరుతాయి.

* * *

దబదబా తలుపు బాదుతున్న చప్పుడు కావడంతో మెలకువ వచ్చింది రాజేంద్రకు. పక్కనున్న సెల్‌లో టైమ్ చూశాడు. రెండుగంటలు. ఈ టైమ్‌లో ఎవరబ్బా! అనుకుంటూ లేచి లైటు వేశాడు. ఇంకా తలుపు బాదుతూనే ఉన్నారు. దొంగలు కాదు కదా! అనే అనుమానం వచ్చింది రాజేంద్రకు. ఆ బాదుడు శబ్దానికి అప్పటికే రాజేంద్ర భార్య, కొడుకు, కోడలు, కూతురు కూడా నిద్ర లేచేశారు.

"ఎవురాడ?" అన్నాడు గట్టిగా.

"అన్నా.. నేను.. తొందరగా తలుపు తీన్నా"

ఆ గొంతు శివరామయ్యది. "ఓరి పిచ్చోడా.. ఈ యాళ ఎందుకురా వచ్చినావు.. దబదబా తలుపు కొట్టకపోతే నా సెల్లుకు ఫోన్ చేసిండచ్చు కదా" అంటూ రాజేంద్ర గెడి తీసి తలుపు తెరిచాడు.

గుమ్మం బయట నుంచే లోపలికి తొంగి చూసి.. పడకలోంచి లేచి కూర్చొని కళ్లు నులుముకుంటున్న రాజేంద్ర భార్యతో "ఒదినా.. అన్నమయ్య డ్యాం తెగిపోతాదంట.. నీళ్లు నిండిపొయ్యి నిండుకుండాల ఉందంట. ఆ పక్క పించా డ్యాం నుంచి నీళ్లు వస్తాండాయంట.. అన్నమయ్య డ్యాం తెగిపోయిందంటే మన ఊరు మునిగిపోతాది. ముందు పాణాలు కాపాడుకుందాం. అందురూ దాసాలమ్మ గుట్టపైకి పాండి.. నేనింగా దిగవీధిలో వాళ్లకు చెప్పేసి వస్తా"



అంటూ గుక్క తిప్పుకోనంత వేగంగా గబగబా చెప్పి అట్నుంచటే వీధిలోకి వెళ్లిపోయాడు శివరామయ్య.

ఆ ఇంట్లో అందరిలో నిద్రమత్తు ఎగిరిపోయింది.

రాజేంద్ర గుమ్మం దాటి వరండాలోంచి వీధిలోకి చూశాడు. అప్పటికే ఊర్లో జనం పది మందికి పైగా వీధిలో నిలబడుకుని మాట్లాడుకుంటున్నారు. కొందరు ఫోన్లల్లో ఉన్నారు. అక్కడున్న వారిలో ఒకతను "రాజేంద్రా.. రాప్పా" చేయూపుతూ పిలిచాడు. రాజేంద్ర గబగబా వారి వద్దకు వెళ్లాడు.

ఆకాశం మొత్తం మాసిపోయిన తెల్లటి దుప్పటిలా ఉంది. సన్నటి జల్లులు కురుస్తున్నాయి. మూడు రోజులుగా వాన ఆగి ఆగి కురుస్తూనే ఉంది. చెయ్యేరులో నీళ్లు గలగలా పారుతున్నాయి. ఎగువనున్న అన్నమయ్య డ్యాంకు ఎనిమిది గేట్లున్నాయి. వాటిలో అప్పటికే నాలుగు గేట్లు ఎత్తేశారు. పై నుంచి వస్తున్న వరద నీరు చాలా ఎక్కువగా ఉండటంతో.. అన్నమయ్య డ్యాం ఎప్పుడైనా తెగిపోతుందని అక్కడ పనిచేసేవాళ్లలో భయం పట్టుకుంది. ఆ డ్యాం వద్ద లష్కర్‌గా పనిచేసే రామయ్యది తొగూరుపేట. ఊర్లో జనాలంతా సుమారు అర్ధరాత్రి వరకు మేలుకునే ఉన్నారు. కొందరు వీధిలోకి వచ్చి.. మరికొందరు

భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన రచన

నీళ్లు

సుంకోజి దేవేంద్రాచారి

వాళ్ల ఇంట్లోనే.. ఇంకొందరు ఫోన్లల్లో మాట్లాడుతూ.. మేలుకునే ఉన్నారు. అందరి మాటలూ వాన.. వరద గురించే. ఎప్పుడో అమాసకో పున్నమికో అన్నట్టు ఐదేండ్లకో పదేండ్లకో ఇట్లా వానపడతాదిలే.. ఏం కాదులే అని ఒకరికొకరు ధైర్యం చెప్పుకుని ఇళ్లల్లోకి వెళ్లి పడుకున్నారు. నిద్ర పట్టీపట్టకముందే.. ఇలా డ్యాం తెగిపోతుందనే సమాచారం లష్కర్ రామయ్య నుంచి అందడంతో అందరిలో కంగారు పుట్టింది.

''డ్యాం తెగిపోతాదా..?'' భయంగా అడిగాడొకతను.

"రేయ్.. డ్యాం ఎందుకు తెగతాదిరా.. తెగినా మనూరుదాంకా నీళ్లు వస్తాయా...ఆ దిగదాల చెట్లుండాయే.. ఆడికొస్తాయేమో నీళ్లంతే" ఒకతను ఏమీకాదన్నట్టు చాలా తేలిగ్గా చెప్పాడు.

''లేదు మామా.. ఉత్తరాఖండ్‌లో వరదల వీడియోలు చూసినావా.. అక్కడ డ్యాం తెగిపోయిందంటే ఒగేసారి ఎల్లవ ముంచేస్తాది. ఐదారు అంతస్తుల ఎత్తుతో నీళ్లు వచ్చేస్తాయి.. చూసేదానికి పులికొండ రయ్యిమని జారుకుంటూ మన ఇళ్లమీదికి వచ్చేసినట్టే ఉంటాది" చెప్పాడో యువకుడు.

వాళ్లున్న చోటుకు వంద మీటర్ల దూరంలో ఏటి ఇసుకలో ఉన్న ఆవుల్లో కొన్ని నిలబడుకుని ఆకాశం వైపు చూస్తూ ఎవరినో పిలుస్తున్నట్టుగా ఆగి ఆగి గట్టిగా అంబా అంటున్నాయి.

వీధిలో మాటలు చెప్పుకుంటున్న వారి చెవుల్లో ఆవుల అరుపులు చేరడం లేదు. ఇప్పుడింకా చాలామంది వీధిలోకి వచ్చేశారు.

"ఇంగా ఈన్నే ఉండారా.. ఇదేమన్నా పెండ్లి సాంగెమా.. తోడు పెండ్లికొడుకొచ్చి చెయ్యి పట్టుకోని పిల్చుకోని పోవాల్నా.. పాండి పాండి.. దాసాలమ్మ గుట్టపైకి పాండి" అంటా పరుగులాంటి నడకతో వచ్చాడు శివరామయ్య.

కరెంటు పోవడంతో వీధి దీపాలు వెలగడం లేదు. ఆ రోజు పౌర్ణమి. చంద్రుడి కిరణాలకు మబ్బులు అడ్డంగా ఉన్నా.. ఇరవై ముప్పై బారల దూరంలో ఉన్న మనుషులు కూడా కనిపించేంత వెలుగు ఉంది. ఆ మసక వెలుగులో శివరామయ్య

గుడిలోని నల్లరాతి విగ్రహంలా ఉన్నాడు.

అప్పటికే కొంతమంది దాసాలమ్మ గుట్టపైకి చేరుకున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న చెయ్యేరు అందరి గుండెల్లో గుబులు రేపుతోంది.

ఆ ఊరుపేరు తొగూరుపేట. నలభై నుంచి యాభై ఇళ్లుంటాయంతే. ఊరికి ఒక చివర దాసాలమ్మ గుట్ట ఉంది. ఏటిని అనుకుని ఆ గుట్టపై దాసాలమ్మ గుడి ఉంది. ఊర్లో అందరికీ ఆమే ముఖ్యదైవం. రెండేళ్ల క్రితమే దాదాపు రూ.50 లక్షలు ఖర్చుపెట్టి గుడిని బాగా కట్టుకున్నారు. దాసాలమ్మ గుట్టకు ఆనుకునే శేషాచలం కొండలు. వాటిలో ఒక కొండను ఊర్లో వాళ్లు పులికొండ అని పిలుస్తారు.

అందరి మాటలు కలగా పులగంగా వినిపిస్తున్నాయి. నిద్రలో ఉండే పిల్లలను లేపడంతో వారు ఏడుస్తూ పెద్దల వెంట వస్తున్నారు. కొందరు పిల్లలను

ఏటి ఒడ్డున ఉన్న ఆలమందలో కొన్ని ఆవుల అరుపులు లీలగా వినిపించాయి. వాటి అరుపులు దాసాలమ్మ గుట్టపైన ఉండే మనుషుల చెవుల్లో చేరడం లేదు. ఏటికి అటువైపున్న పాలేశ్వరుడి గుడిలో గంట మోగింది. ఏటి నీటి చప్పుడు.. ఊరందరి మాటల మధ్య గుడిగంట చప్పుడు వినిపించీ వినిపించనట్టుగా ఉంది. అయినా సరే.. అందరికీ ఆ గంటానాదం వినపడింది. ఒక్కసారిగా అందరూ చేతులెత్తి "పాలేశ్వరా.. కాపాడు తండ్రీ" అంటూ మొక్కుకున్నారు.

భుజాన వేసుకుని నడుస్తున్నారు. మెల్లెక్కి ముందుగా.. గుడిలో దీపం వెలుగులో చిరునవ్వులు చిందిస్తున్న దాసాలమ్మను దర్శించుకుంటున్నారు. "దాసాలమ్మ తల్లీ! మమ్మల్ని నువ్వు కాపాడాలి" అని మొక్కుకుని గుట్టపైకి పోతున్నారు.

తెల్లవారుజామున మూడు గంటలు అయ్యేప్పటికి ఊర్లో జనం అంతా గుట్టపైకి చేరుకున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వానతో నేలంతా చెమ్మగా ఉంది. కొంతమంది ఆ చెమ్మ నేలలోనే కూర్చున్నారు. చాలామంది నిలబడుకునే ఉన్నారు. ఎవరేం మాట్లాడుతున్నా.. అందరి దృష్టీ ఏటినీటిమీదే ఉంది.

"ధైర్యంగా ఉండండిప్పా.. ఇంతకంటే పెద్దపెద్ద వానలు పన్నేయి. ఎల్లవలు వచ్చినాయి. మా తాతల కాలం నించీ చెయ్యేరు ఏ పొద్దూ మనూరిని ముంచింది లేదు" తమ పూర్వికులు చెప్పిన మాటలు గుర్తు చేసుకుంటూ ఎనభై ఏళ్ల వృద్ధుడు చెప్పాడు.

"ఆ కాలం వేరు తాతా.. మనం కూడా పైన డ్యాం లేకుండా ఉంటే భయపడే అవసరం లేదు. వచ్చిన నీళ్లు వచ్చినట్టు పోతాంటాయి. పైన్నుంచి ఎన్ని ఎక్కువ నీళ్లు వచ్చినా ఏట్లో ఐదారడుగుల ఎత్తుకు మించి వచ్చిండవు. ఇప్పుడు ఆ డ్యాం తెగిపోయిందంటే.. ఒగేసారి వచ్చి మిందపడతాయి" అన్నాడో యువకుడు.

"మనకు ఐదారుమైళ్ల దూరంలో కదా డ్యాం ఉండాది. ఆట్నించి ఈడికి వచ్చేలోపల నీళ్లు తగ్గిపోతాయిలే" ఒకతని సమాధానం.

"ఎట్ల తగ్గతాయి. నాలుగు దినాల నుంచి వాన పడతానే ఉండాది. ఏటి నీళ్లు పొయ్యేదానికి వేరే దావేముండాది..? ఆ పక్కా ఈ పక్కా కొండలే.. డ్యాం కాన్నించి నీళ్లు కదిలినాయంటే.. ఏటిగడ్డన ఉండే తొలిఊరు ఆ పక్కన పులపత్తూరు...ఈపక్కన మనదే.."

"అవును.. అయినా మనం భయపడే అవసరం లేదు"

"గ్లాసు నీళ్లు ముఖాన ఒకేసారి పడేదానికి.. కుండడు నీళ్లు ఒకేసారి ముఖాన పడేదానికి తేడా లేదా.. ఇదీ అంతే.. భయపడమని కాదు.. జాగ్రత్తగా ఉండాల"

"ఏం భయం లేదులేప్పా.. అందరం ఒగేతావన ఉండాంలే... గుట్టపైన్నే ఉండాం" ఒకామె ఫోన్‌లో ఎవరికో చెప్తోంది.

"డ్యాం తెగిపోయి నీళ్లన్నీ వచ్చేస్తాయంట కదా.. డ్యాంలో పెద్ద పెద్ద చేపలు ఉంటాయేమో" పదేళ్ల పిల్లాడి సందేహం.

"పెద్ద చేపలేందిరా.. సినిమాలో చూళ్లా.. అనకొండలు, డాల్ఫిన్లు, క్రోకడైల్స్ ఉంటాయి" పన్నెండేళ్ల పిల్లాడి సమాధానం.

"అనకొండలు ఉంటే మనల్ను మింగేస్తాయా.." పదేళ్ల పిల్లాడిలో భయం.

"మనం ఈడుండామని వాటికి తెలీదు కదా.. అయ్యి నీళ్లల్లో ఎళ్లిపోతాయి"

"నేను ఇంట్లో నించి ఏమీ తెచ్చుకోలేదు ఒదినా.. ముక్కల్లో చెవుల్లో ఉండే వాటితోనే వచ్చేసినానే" ఒక మహిళ ఆందోళన.

"ఇదేమన్నా పేరంటమా ఒంటిమింద నగలేసుకుని వచ్చేదానికి.. అయినా ఏం కాదులేమ్మా.. మనం ఎందుకైనా మంచిదని గుట్టమిందికి వచ్చినాం.. ఎన్ని నీళ్లొచ్చినా ఊర్లోకి రావులే" మరో మహిళ ధైర్యం వాక్కు.

రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు. ఒకరితో ఒకరు భయాన్ని పంచు కుంటున్నారు. ఒకరికి ఒకరు ధైర్యం చెప్పుకుంటున్నారు. మొత్తానికి అందరిలోనూ ఒక ఉద్వేగం. అలజడి.. ఏమవుతుందో.. ఏమో..? డ్యాం పరిస్థితి ఏమైందో కనుక్కుందామంటే లష్కర్ రామయ్య ఫోన్ స్విచ్ఛాఫ్.

ఏటి ఒడ్డున ఉన్న ఆలమందలో కొన్ని ఆవుల అరుపులు లీలగా వినిపించాయి. వాటి అరుపులు దాసాలమ్మ గుట్టపైన ఉండే మనుషుల చెవుల్లో చేరడం లేదు. ఏటికి అటువైపున్న పాలేశ్వరుడి గుడిలో గంట మోగింది. ఏటి నీటి చప్పుడు.. ఊరందరి మాటల మధ్య గుడిగంట చప్పుడు వినిపించీ వినిపించనట్టుగా ఉంది. అయినా సరే.. అందరికీ ఆ గంటానాదం వినపడింది. ఒక్కసారిగా అందరూ చేతులెత్తి "పాలేశ్వరా.. కాపాడు తండ్రీ" అంటూ మొక్కుకున్నారు.

అందరూ మాటలు చెప్పుకుంటున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలయింది. ఆడవాళ్ల ధ్యాస ఇంటిమీదకు మళ్లింది. కార్తిక పౌర్ణమి.. ఇళ్ల ముందు అలికి ముగ్గులేయాలి. స్నానం చేసి నిమ్మకాయలు, ఒత్తులు, నూనె తీసుకుని పాలేశ్వరాలయం పోయి దీపాలు వెలిగించి స్వామిని మొక్కుకుని రావాలి అని చెప్పుకుంటున్నారు.

''ఏందో శబ్దం ఇనిపిస్తాందే'' అన్నాడో యువకుడు.

''ఏం శబ్దమప్పా.. ఆ.. అవును ఏందో ఇనిపిస్తాంది..''

''అద్దో.. ఏందది నల్లమోడం మాదిర్తో వస్తాంది..''

"రేయ్.. ఇంగా పైకి పాండి.. పైకి పాండి.."

"ఓయమ్మో.. పాండి పాండి.." అరుపులు కేకలు.

అన్నమయ్య డ్యాం తెగిపోయింది. నీళ్లు సునామీ అలల్లా రెండు తాటిచెట్లు ఎత్తుతో వేగంగా వస్తున్నాయి. అటూ ఇటూ ఉండే శేషాచల కొండలను ఒరుసుకుంటూ వస్తున్న ఆ నీళ్లను చూడగానే అందరిలోనూ ఒక్కసారిగా వణుకు. కొందరు గుట్టలో మరింత ఎత్తుగా ఉండే వైపు పరుగులు తీశారు. ధైర్యవంతులు అక్కడే ఆగి గంగ ఉధృతిని కళ్లప్పగించి చూస్తున్నారు. క్షణాల్లో నీళ్లు వచ్చేశాయి. ఏటికి అటువైపుండే పులపత్తూరును సగం ముంచేశాయి నీళ్లు. ముందుగా పులపత్తూరును తాకి అటు నుంచి అటే పాలేశ్వరాలయాన్ని ఊడ్చుకుంటూ వంపు తిరిగి నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దాసాలమ్మ గుడి ప్రహరీ గోడవరకు వరద నీరు వచ్చింది. తొగూరుపేటలో ఇళ్లన్నీ మునిగిపోయాయి. పులపత్తూరులో వీరు చూస్తుండగానే ఏటిని ఆనుకుని బండపైన ఉన్న సగం ఇళ్లు గోడలతో సహా నీటిలో కొట్టుకు పోయాయి. ఆ ఊర్లో నుంచి జనం అరుపులు కేకలు స్పష్టంగా వినిపించాయి.

ఆ దృశ్యం చూసిన వారందరిలో భయంతో కాసేపు మాటలే రాలేదు. వెలుగు విచ్చుకుంటూ చీకటి కనుమరుగు అవుతోంది. అరగంటలోనే వరద ఉధృతి తగ్గింది. తొగూరుపేటలో ఇంకా ఐదారడుగుల ఎత్తుతో నీళ్లు పారు తున్నాయి. అటువైపు గుట్టపైనున్న పాలేశ్వరాలయాన్ని గంగమ్మ పూర్తిగా మింగేసింది. అక్కడ సుబ్రహ్మణ్యస్వామికి కొత్తగా కట్టిన చిన్న గుడి మాత్రం నీటి ధాటికి తట్టుకుని నిలబడింది. పులపత్తూరులో ఏటికి అనుకుని బండపైన ఉన్న ఇళ్లు దాదాపు వందకు పైగా ధ్వంసం అయిపోయాయి. నీళ్లు రాకముందే వాళ్లూ అప్రమత్తమై ఎగువ ప్రాంతానికి వెళ్లిపోయారు.

“శివరామయ్య మంచి పనిచేసినాడు.. ఇంటింటికి వచ్చి తలుపులు దబదబా కొట్టి నిద్రలేపి గుట్ట ఎక్కించినాడు.. లేకుంటేనా..” అన్నాడు రాజేంద్ర.

“అవును.. తిక్కలోడే అయినా.. మనుషులకు సాయం చేసేదాంట్లో ముందుంటాడు. మనం ఇండ్లల్లో పొనుకోనున్నింటే.. ఈ పాటికి ఎన్ని పాణాలు గంగలో కలిసిపోయింటాయో..” మరొకతను అన్నాడు. ఆ మాటలంటున్నప్పుడు భయంతో అతని గొంతులో వణుకు స్పష్టంగా వినిపించింది.

అందరూ శివరామయ్యను పొగిడేవాళ్లే..

“ఇంతకూ శివరామయ్య యాడా..” అడిగింది ఒకామె.

యాడా.. యాడా.. అంటూ ఒకర్నొకరు.. అందరినీ అడిగారు. అక్కడున్న ఊరి జనంలో శివరామయ్య లేడు.

“శివరామయ్య లేడే.. ఈ తిక్కలోడు ఏమై పోయినాడో” ఒక పెద్దాయన బాధ వ్యక్తం చేశాడు.

“ఊరందరినీ కాపాడి వాడు గంగకు బలైపోలా కదా” ఇంకో పెద్దాయన అనుమానం వ్యక్తం చేశాడు.

‘‘శివరామయ్య తిక్కమాలోకం...ఏటిలో గొడ్లకాడికి పోయినాడేమో” అందొకామె.

“అయ్యో.. గొడ్లు.. శివరామయ్య..” ఒక యువకుడు అన్నాడు.

బాగా తెల్లవారిపోయింది. ఏటిలో నీళ్లు జోరుగా ప్రవహిస్తున్నాయి. ఏటి ఒడ్డున ఇసుక మీద మాత్రమే కాదు.. ఊరిలోనూ ఐదారడుగుల ఎత్తుతో నీళ్లు పారుతున్నాయి. అయితే పశువులన్నీ ఏమై పోయాయి..?

“అయ్యో.. ఆ గొడ్లన్నీ మనయే అయినా.. ఇంతకాలం వాటిని కంటికి రెప్పలా కాపాడు కుంటాన్నింది శివరామయ్యే.. వాటితో పాటు నీళ్లలో కొట్టకపాయనేమో” అందొకామె.

అందరూ అయ్యో.. అయ్యో.. అంటున్నారు.

* * *

ఏటిలో నీళ్లు మరో రెండడుగులు తగ్గాయి. ఊర్లోకి పోదామని కొందరు.. వద్దని మరికొందరు అంటున్నారు. ఒక్క ఆవూ కనిపించకపోవడంతో

“శివరామయ్య మంచి పనిచేసినాడు.. ఇంటింటికి వచ్చి తలుపులు దబదబా కొట్టి నిద్రలేపి గుట్ట ఎక్కించినాడు.. లేకుంటేనా..” అన్నాడు రాజేంద్ర. “అవును.. తిక్కలోడే అయినా.. మనుషులకు సాయం చేసేదాంట్లో ముందుంటాడు. మనం ఇండ్లల్లో పొనుకోనున్నింటే.. ఈ పాటికి ఎన్ని పాణాలు గంగలో కలిసిపోయింటాయో..” మరొకతను అన్నాడు.

అందరూ నిట్టూరుస్తున్నారు. మనం దాదాపు నూటేభై మంది ఉన్నే మూగజీవాలను కాపాడుకోలేక పోయామే అనుకుని బాధపడుతున్నారు.

దాసాలమ్మ గుట్ట ఎగువన.. పులికొండ దిగవ నుంచి ఈల వినిపించింది. ఊరి జనమంతా ఒక్క సారిగా అటువైపు చూశారు. అలా ఈల వేసేది శివరామయ్యే. సాయంత్రం పూట కొండ వద్దకు పోయి ఈల వేశాడంటే.. మేతకు పోయిన ఆవులన్నీ అతడుండే చోటుకు వచ్చేస్తాయి.

గుట్టపైన ఉండే జనాన్ని చూసి పులికొండ దగ్గర పెద్ద గుండుపై నుంచి శివరామయ్య చేయి ఊపుతున్నాడు. అతడుండే చోట చుట్టూ ఆలమంద.

ఊరి జనం సంతోషంగా కేకలు వేశారు. కిందకు రా అన్నట్టు చేతులు ఊపారు. శివరామయ్య ఐదు నిమిషాల్లో వాళ్ల వద్దకు చేరుకున్నాడు.

కొందరు ఆయనను గట్టిగా హత్తుకున్నారు. అందరూ కలిసి శివరామయ్యను చేతులపైకి ఎత్తుకుని నువ్వు మా దేవుడివి అన్నారు సంతోషంగా. అందరి కళ్లల్లో ఆనందబాష్పాలు.

“నువ్వు నీళ్లల్లో కొట్టకపోయినావేమో అని భయపడినాము” అన్నారు.

వాళ్ల చేతుల్లోంచి కిందకు దిగిన శివరామయ్య.. “నీళ్లు.. కొండలు.. గుట్టలు.. పులులు మా వంశానికే మన్నా కొత్తా.. దేనికీ భయపడేది లేదు. అయితే.. అన్నింటి కాడా ఒళ్లు దెగ్గిర పెట్టుకోని ఉండాల” అన్నాడు.

“నువ్వు ఈన్నే మాతోపాటు ఉన్నేవు కదా.. ఎప్పుడు పోయినావు ఆవుల తోలుకోని” అడిగాడొక యువకుడు.

“మనమంటే మనుషులం. మాట్లాడతాం. ఒగరినొకరం హెచ్చరించుకుంటాం. ఫోన్లల్లో అయినా చెప్పుకుంటాం. అయ్యి.. మూగజీవాలు కదా.. ఎగదాల డ్యాం ఉండాది... తెగితే నీళ్లు ముంచే స్తాయని మనకు తెలుసు. మూగజీవాలకేం తెలస్తాది.. వాటికి ఎవరు చెప్తారు..? అందుకే ఊర్లో వాళ్లంతా గుట్టమిందికి వస్తానే నేను గుట్ట దిగి ఏట్లోకి పోయినా.. వాటిని కొండమిందికి తోలకపోదామంటే కదలవే.. ఏట్లో నీళ్లు పెరగతాంటే నాలుగడుగుల దూరం పోతాయే కానీ ఆట్నుంచి రామంటాయి.. ఏం చేసేది.. వాటిని అడుక్కున్నే ఇనలా.. దేవుడికంటే దెబ్బే గురువంటారు కదా.. కట్టి ఎత్తుకుని రెండు దెబ్బలేసినానంతే.. అన్నీ ఆట్నించి కదిలినాయి.. ఊరెనకాల దొంకలోంచి పులికొండ ఎక్కించేసినా.. వాటిని అట్ల కొండ ఎక్కించినా.. ఇట్ల నీళ్లు వచ్చేసినాయి ఏట్లో” అన్నాడు శివరామయ్య.

“నువ్వు శివరామయ్య కాదు.. గోపాలకృష్ణుడివి. కలకాలం చల్లగా ఉండు నాయనా” ఒక పెద్దాయన ఆశీర్వదించాడు. “అయ్యో.. ఎవరో నీళ్లల్లో కొట్టుకోనా స్తాండారు..” అరిచాడొక పిల్లవాడు. అందరూ ఏటివైపు చూశారు.

ఒక వ్యక్తి నీళ్లల్లో కొట్టుకొస్తున్నాడు. అతడికి ప్రాణం ఉందో లేదో తెలీడం లేదు. శివరామయ్య క్షణం కూడా ఆలస్యం చేయకుండా గబగబా దాసాలమ్మ గుడి వద్దకు వెళ్లి.. అక్కడున్న పొడవాటి తాడు తీసుకుని నీళ్లల్లో మనిషి కొట్టుకొస్తున్న వైపు అడుగులు వేశాడు. ★



తత్త్వవిచారానికి సరైన మార్గం

శ్రీకరపాత్రీస్వామి మార్క్స్ కంటే ముందున్న పాశ్చాత్యులు చెప్పిన భౌతికవాదాన్ని, గతివాదాన్ని, వారి తర్క పద్ధతులలోని లోటుపాట్లను మన భారతీయ వేదాంతశాస్త్రం ఆధారంగా నిరూపించారు. అటు తర్వాత మార్క్స్ గురువైన హెగెల్ సిద్ధాంతాన్ని విడమరిచారు. హెగెల్‌కు మార్క్స్‌కు మధ్యనున్న ఫాయర్ వాఖ్ తత్త్వవిచారాన్ని గురించి ఇలా చెప్పారు.

దార్శనిక విచారములో హెగెల్‌కి శిష్యుడైనప్పటికీ మార్క్స్ ఏమంటాడంటే, 'హెగెల్ మేధస్సు అంతా ఆయన శిరస్సులో దాగిఉంది. నేను నా తెలివితేటలను నా కాళ్లయందు భావించి, స్వయంగా లేచి నిలబడ్డాను' అని. హెగెల్‌కి మార్క్స్ కి మధ్య ఫాయర్ వాఖ్ తత్త్వశాస్త్రం పుట్టింది. వాటినుంచి చాలా అంశాలను మార్క్స్ గ్రహించాడు. చాలావాటిని ఖండించాడు.

'ఈశ్వరుడు నా మొదటి చింతన. జ్ఞానం రెండోది. మూడోది, అంతిమమైనది మానవుడే' అని వీటే పేర్కొన్నాడు. దీనిపై ఫాయర్ వాఖ్, 'ఆదర్శవాదం, భౌతికవాదాల నడుమ పరస్పర యుద్ధం జరగడానికి తగిన స్థలం మానవుని మస్తిష్కం. మస్తిష్కం ఏవిధమైన వస్తువులతో రూపొందిందో తెలుసుకోగలిగితే... అన్యవస్తువులతో దానికి గల సంబంధాల విషయంలో చింతన స్పష్టరూపాన్ని దాల్చుతుంది' అని చెప్పాడు. అతడే ఇంకా, 'అస్తిత్వమే కర్త. తత్త్వచింతన క్రియ. చింతన అస్తిత్వం తాలూకు క్రియయే కానీ, కారణం కాదు. అస్తిత్వమే స్వయంగా సృష్టికి మూలం' అని కూడా చెప్పాడు. అతడే మరికొంచెం వివరంగా, 'ఆదర్శవాదుల దర్శనానికి ఆరంభమే పెద్ద తప్పు. స్పష్టమైన దర్శనం ఎన్నడూ, 'నేను' నుంచి ప్రారంభం కాదు. 'నేను – నువ్వు' నుంచి ప్రారంభం అవుతుంది. అలా ప్రారంభమైన తత్త్వవిచారము లేదా పదార్థము కర్త – కర్మలకు గల సంబంధాన్ని సరైన రీతిలో అర్థం చేసుకోవడం సాధ్యమవుతుంది. 'నేను' అనే భావం స్వయంగా తనకోసమే 'నేను' అవుతుంది. కానీ ఇతరుల విషయంలో 'నీవు' అనాల్సి వస్తుంది.

'ఇదెలాగంటే 'నేను' అనేది ఒకేసారి కర్త, కర్మ కూడా కాగలదు. కానీ 'నేను' అనేది అమూర్తసత్త కాజాలదు. 'నా' వాస్తవిక అస్తిత్వం నా శరీరమే. 'నా' సమగ్ర స్వరూపంలో 'నా' వాస్తవిక సత్త ఇమిడి ఉంది. ఎక్కడ తత్త్వవిచారం జరుగుతుందో... అక్కడ అది అమూర్తం కాదు. భౌతిక అస్తిత్వమే కర్త అవుతుంది. తత్త్వవిచారమే దానికి క్రియ. తత్త్వవిచారము, దానితో పొసగని విరోధానికి గల అస్తిత్వమే ఈ రెండే సమస్యలను రేకెత్తించేవి. ప్రకృతి లేదా పంచభూతాలను నియంత్రించి ఉంచడం ద్వారా లేదా వాటిని మిథ్యగా తలపోయడం ద్వారా సమస్యలు మొలకెత్తకుండా పోతాయి' అని చెప్పాడు.

ఫాయర్ వాఖ్ చెప్పేది ఏమిటంటే, 'స్పినోజ్ సిద్ధాంతం చేత ధర్మవిద్యలోని గజిబిజితనాన్ని తీసివేయగలిగితే మూలమునందు అంతా సరిగ్గా ఉంటుంది' అని. ఆదర్శవాదులతో సంబంధాన్ని తెగదెంపులు చేసుకున్న తరువాత మార్క్స్ – ఏంగెల్స్ మునుముందుగా ఈ తత్త్వచింతననే తమ సొంతం చేసుకున్నారు అని చెబుతుంటారు. ఫాయర్ వాఖ్ ఇలా చెబుతాడు... 'బయటి వస్తువుల క్రియను విషయమాత్రంగా భావించిన మానవుడు ఆయా వస్తువులను గుర్తించగలుగుతాడు.' కానీ మార్క్స్ అభిప్రాయంలో, 'వస్తువుపై మనదైన ప్రతిక్రియను ఆచరించడం ద్వారా ఆయా వస్తువులను గుర్తించగలుగుతాం.'

పైన పేర్కొన్న పండితుల తత్త్వచింతన అంతా భారతీయ దర్శనాల దృష్టిలో చాలా స్థూలమైనది. విషయేంద్రియ సంయోగజన్యమైన సుఖమే వాస్తవిక సుఖం కాజాలదు. అనశ్వర సుఖం ఆత్మస్వరూపమే అయి ఉన్నది. వాళ్లు చెప్పిందే నిజమైతే ఒక వృద్ధుడు గోక్కోవడం ద్వారా దురద తీర్చుకోవడం కూడా సుఖమే అని చెప్పాలి. బుద్ధిమంతుడు అయిన వాడు ఎవడైనా దానిని సుఖంగా చెప్పగలడా? ఈ విధంగా సూక్ష్మవివేచన కొరవడితే అస్తిత్వయుక్త పదార్థాన్నే అస్తిత్వంగా భావించి దానిని కర్తగానూ, విచారాన్ని కర్మగానూ సంభావిస్తుంటారు.

అస్తిత్వం అనేది సూక్ష్మవస్తువు. తత్త్వవిచారంలో కూడా అనుస్యూతంగా వస్తూనే ఉంటుంది. ఇట్టి అస్తిత్వం లేనికారణంగా దేహము – దేహానికి అంతర్గతమైన దాని సమగ్రతకు పూరకంగా నిలిచేది కూడా అసత్తుగానే మిగిలిపోతుంది. సర్వ విశేషణా రహితమైన అస్తిత్వమే సర్వత్ర సమానరూపంలో అనుస్యూతంగా వస్తున్న కారణంగా దానిని నర్వబీజంగా పేర్కొనాలి. దానికి వక్కనే తత్త్వవిచారంలోని సూక్ష్మత దాగి ఉంటుంది. దానియందే 'నేను – నీవు' అనే భావాలన్నీ అంతర్భావాలుగా కలగలిసిపోతాయి. బహిర్ముఖాలైన ప్రాణులకు 'నేను'పై ఆధారపడియే 'నీవు' అనేది ఆవశ్యకమని అధిక స్పష్టంగా కనిపిస్తుంది.

ఫాయర్ వాఖ్ దర్శనానికి టిప్పణి రాస్తూ మార్క్స్ ఇలా అన్నాడు. భౌతిక సిద్ధాంతంలో దేని అనుసారంగా అయితే మానవులు పరిస్థితులు, విద్య ద్వారా రూపుదిద్దుకుంటారని చెప్పడానికి వీలవుతోందో... అట్టి దానిని పూర్తిగా మరిచిపోయారు.

మానవుడు పరిస్థితులకు అనుగుణంగా పరివర్తన చెందుతాడు. అందుకు శిక్షకుడు స్వయంగా సుశిక్షితుడు కావాల్సిన అవసరం ఉంది. అదే ఈ సమస్యకు సమాధానం అవుతుంది. ఇతిహాసాలను భౌతిక ధారణ చేయగలిగితే రహస్యాల ద్వారా తెరుచుకుంటాయి.' ఫాయర్ వాఖ్ తత్త్వవిచార ప్రణాళికల వికాసాన్ని మానవసత్త వికాసంగా కూడా చెప్పాడు. పంచభూతాలు మానసమందు (జ్ఞానమందు) పుట్టినవి కావు. మానసమనేది భూతసృష్టి కంటే సర్వోత్కృష్టమైనది అన్నాడు. హెగెల్ చెప్పిన ద్వంద్వవాదాన్ని వాఖ్ ఖండించాడు. మార్క్స్ దానినే గ్రహించి, తనదైన ద్వంద్వాత్మక భౌతిక వాదాన్ని రూపొందించాడు.

(వచ్చేవారం...తెలుసుకోవాల్సిన సత్యాలు)

హిందీమూలం : కరపాత్రీ స్వామి
అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ

భారత క్రికెట్... నిరంతరం నిండుగా ప్రవహించే ఓ జీవనది. గత కొన్ని దశాబ్దాలుగా వందల సంఖ్యలో వచ్చే ఆటగాళ్లు వస్తుంటే.. పోయే ఆటగాళ్లు పోతూనే ఉన్నా.. అరుదైన రికార్డులు, ఘనతలతో చరిత్రలో కలకాలం నిలిచిపోయే అదృష్టం కొందరికి మాత్రమే దక్కింది. మాస్టర్ సచిన్ టెండుల్కర్ నుంచి యార్కర్ల కింగ్ జస్ ప్రీత్ బుమ్రా వరకూ తమతమ పేర్లతో కళ్లు చెదిరే పలు రికార్డులను లిఖించుకోగలిగారు....

ఆధునిక భారత క్రికెట్లో అరుదైన రికార్డులు.!

క్రికెట్ అంటే కేవలం మూడక్షరాల ఆట మాత్రమే కాదు. మూడు ముఖాల ' మహామాయా దీపం'. అభిమానులకు వినోదం, ఆటగాళ్లకు రికార్డులు, నిర్వాహ కులకు కాసులవర్షం కురిపించడంలో క్రికెట్ తర్వాతే ఏదైనా. ఐదురోజుల సాంప్రదాయ టెస్టు క్రికెట్, ఒక్కరోజులో ముగిసిపోయే 50 ఓవర్ల వన్డే క్రికెట్, కేవలం మూడున్నర గంటల్లోనే మూడుముక్కలాటలా సాగిపోయే 20 ఓవర్ల టీ-20 క్రికెట్.. ఇలా మూడు రకాల ఫార్మాట్లూ అభిమానులను ఓలలాడిస్తూనే ఉన్నాయి. అయితే.. కాలానుగుణంగా, అభిమానుల అభిరుచికి తగ్గట్టుగా మార్పులు చేర్పులకు లోనైన ఈ క్రీడ మూడు విభాగాలలోనూ ఒకే తీరుగా రాణించే అసాధారణ ఆటగాళ్లు అతికొద్దిమంది మాత్రమే కనిపిస్తారు.

మాస్టర్ సచిన్ నుంచి పేసర్ బుమ్రా వరకూ...

ఆధునిక భారత క్రికెట్ కు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన బ్యాటింగ్ దిగ్గజం మాస్టర్ సచిన్ టెండుల్కర్ టెస్టు, వన్డే విభాగాలలో కలిపి శతశతకాలు, పలు అనితర సాధ్యమైన రికార్డులు సాధించడం ద్వారా చరిత్రలో నిలిచిపోతే... ఆ తర్వాత వచ్చిన ఆటగాళ్లు మాత్రం మూడు ఫార్మాట్లకు అనుగుణంగా తమ ఆటతీరును మార్చుకొని, మలచుకొని గొప్పగొప్ప రికార్డులే నెలకొల్పగలిగారు.

టెస్టులు, వన్డేలు, టీ-20 విభాగాలలో శతకాలు నమోదు చేసిన తొలి భారత బ్యాటర్ ఘనత సురేశ్ రైనాకు మాత్రమే దక్కుతుంది. ఆ తరువాత మాత్రమే రోహిత్ శర్మ, విరాట్ కొహ్లీ, కెఎల్ రాహుల్ లాంటి పలువురు దిగ్గజ క్రికెటర్లు ఈ ఘనతను సాధించ గలిగారు.

వన్డే క్రికెట్లో మూడు ద్విశతకాలు సాధించిన తొలి, ఏకైక ఆటగాడిగా భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ నిలిచాడు. ఇక భారత క్రికెట్ నయామాస్టర్ విరాట్ కొహ్లీ ఇప్పటికే వన్డే ఫార్మాట్లో 53 శతకాలతో ప్రపంచ రికార్డు నెలకొల్పడంతో పాటు మరో అరుదైన రికార్డు సైతం నెలకొల్పాడు. భారత్ తరపున వందేసి టెస్టులు, వన్డే, టీ-20 మ్యాచ్ లు. ఆడిన తొలి క్రికెటర్ గా చరిత్ర సృష్టించాడు.

టీ-20ల్లో తొలి 5 వికెట్ల బౌలర్...

కేవలం 4 ఓవర్లలో 5 వికెట్లు పడగొట్టడం అంటే మాటలా మరి. వీరబాదుడు టీ-20 ఫార్మాట్ ఓ ఇన్నింగ్స్‌లో ఐదుగురు బ్యాటర్లను పడగొట్టిన భారత తొలి బౌలర్ రికార్డు స్వింగ్ కింగ్. భువనేశ్వర్ కుమార్ పేరుతో ఉంది. అంతేకాదు... టెస్టు, వన్డే, టీ-20 మ్యాచ్ ల్లో ఐదేసి వికెట్లు పడగొట్టిన భారత తొలిపేసర్ ఘనతను సైతం భువనేశ్వర్ కుమార్ సొంతం చేసుకోగలిగాడు. ఇక.. యార్కర్ల కింగ్ జస్ ప్రీత్ బుమ్రా క్రికెట్ మూడు విభాగాలలోనూ వందేసి వికెట్లతో' వికెట్ల సెంచరీ 'రికార్డు నెలకొల్పాడు.

భారత తొలి, ఏకైక ఫాస్ట్ బౌలర్ బుమ్రా...

అంతర్జాతీయ క్రికెట్లో ఓ ఫాస్ట్ బౌలర్ 100 వికెట్లు పడగొట్టడాన్ని గొప్ప ఘనతగా పరిగణిస్తారు. అదే క్రికెట్ మూడు (టెస్టు, వన్డే, టీ-20) విభాగాలలోనూ వందేసి వికెట్లు పడగొడితే..అది ఆక్సిజన్ లేకుండా ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడంతో సమానమే.

దక్షిణాఫ్రికాతో కటక్ వేదికగా ముగిసిన 2025 సిరీస్ లోని తొలి టీ-20 మ్యాచ్ లో రాణించడం ద్వారా బుమ్రా మూడు ఫార్మాట్లలోనూ వందవికెట్ల రికార్డును చేరుకోగలిగాడు. భారత క్రికెట్ చరిత్రలో ఈ ఘనత సాధించిన తొలి, ఏకైక బౌలర్ బుమ్రా మాత్రమే. ప్రపంచ క్రికెట్ చరిత్రలో ఈ అసాధారణ రికార్డు సాధించిన ఐదో బౌలర్ గా బుమ్రా రికార్డుల్లో చేరాడు. శ్రీలంక బౌలర్ లాసిత్ మలింగ, న్యూజిలాండ్ పేసర్ టిమ్ సౌథీ, బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబుల్ హసన్, పాకిస్థాన్ మాజీ స్పిన్ ఆల్ రౌండర్ షాహీద్ అఫ్రిదీల సరసన బుమ్రా చోటు సంపాదించగలిగాడు.

అరుదైన ఈ ఘనత సాధించిన మొత్తం ఐదుగురు బౌలర్లలో అత్యుత్తమ సగటు రికార్డు బుమ్రాకు మాత్రమే ఉంది. మూడు ఫార్మాట్లలోనూ కలిపి వందేసి వికెట్లను 7 ఎకానమీతో 25 కంటే తక్కువ సగటుతోనే బుమ్రా సాధించగలిగాడు. టీ-20 ఫార్మాట్లో బుమ్రా సగటున 6.35 ఎకానమీ (ప్రతి 6.35 పరుగులకూ ఓ వికెట్) రికార్డు సాధించగలిగాడు.

భారత క్రికెటర్లు సాధించిన ఈ అరుదైన రికార్డులు క్రికెట్ ఉన్నంతకాలం చిరస్మరణీయంగా, శాశ్వతంగా నిలిచిపోతాయి.

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

నంద్యాల జిల్లాలో హిందూ సమ్మేళనాల దృశ్య మాలిక

బేతంచర్ల, క్రాంతినగర్లో జరిగిన సమ్మేళనాలలో వేదాంత గీత ఫౌండేషన్ చైర్మన్ శ్రీశ్రీశ్రీ అభినవ శంకరానంద స్వామి ఆశీఃప్రసంగం చేయగా, దక్షిణమధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ వక్తగా పాల్గొని ప్రసంగించారు. బేతంచర్లలో 4700మంది, క్రాంతినగర్‌లో 4500 మంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో జరిగిన సమ్మేళనానికి దత్త ఆశ్రమం స్వామీజీ శ్రీశ్రీశ్రీ శివస్వామీజి ఆశీఃప్రసంగం గావించారు.
సామాజిక సమరసత వేదిక కళా విభాగం అఖిల భారత కన్వీనర్ అప్పాలప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి 620 మంది హాజరయ్యారు.

ముత్యాలపాడులో జరిగిన సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా శ్రీశ్రీశ్రీ అభినవ శంకరానంద స్వామీజి ఆశీఃప్రసంగం చేశారు.
ముఖ్యవక్తగా ప్రాంత శారీరక్ ప్రముఖ్ చంద్రశేఖర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో 855 మంది హిందువులు పాల్గొన్నారు.

సిరివెళ్లలో జరిగిన సమ్మేళనంలో శ్రీశ్రీశ్రీ విరజానందస్వామీజి ఆశీఃప్రసంగం చేశారు.
జాతీయ సాహిత్య పరిషత్, కర్నూలువిభాగ్ సంయోజకులు డా.ఉదయ్‌శంకర్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 1632 మంది పాల్గొన్నారు.

ఖాల్సా పరిరక్షణ ప్రతీ ఒక్కరి కర్తవ్యం

భాగ్యనగర్ : ఖాల్సా అనేది పదో గురువు ద్వారా వచ్చిందని, అది అత్యంత పవిత్రమైందని ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ కార్యకారిణి సదస్యులు ఇంద్రేశ్ కుమార్ అన్నారు.ఇంత పెద్ద సమాజానికి ఖాల్సాను ఇవ్వడం అంత సులభం కాదని, ఇది గొప్ప విషయమని తెలిపారు. దాని పవిత్రతను పరిరక్షించడం

ప్రతీ ఒక్కరి కర్తవ్యమని పిలుపునిచ్చారు.

డిసెంబర్ 14న గురుతేగ్ బహదూర్ సాహిబ్ 350వ బలిదాన దివస్ సందర్భంగా ఆర్ఎస్ఎస్, ఆల్ గురుద్వారాస్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో భాగ్యనగర్, నెక్లెస్‌రోడ్, జలవిహార్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఇంద్రేశ్ మాట్లాడుతూ తాను పాఠశాలకు వెళుతున్నప్పుడు దారిలో ఉన్న మందిరంతోపాటు గురుద్వారాకి వెళ్ళమని తల్లి ప్రోత్సహించేదని గుర్తు చేసుకున్నారు. అందువల్లనే తాను బాల్యం నుంచీ సిక్కు మత గురువుల పరంపరను అధ్యయనం చేసే అలవాటు చేసుకున్నానని తెలిపారు. నిర్భయంగా ఉండాలన్నది వారి నుంచి నేర్చుకున్నానని అన్నారు. ఇతరుల దుఃఖాన్ని పోగొట్టి, సుఖాన్ని పంచడమే భరతభూమి మట్టికి ఉన్న గొప్ప గుణం అని చెప్పారు. త్యాగంతో, తెగువతో, అవసరమైతే యుద్ధం చేసి మరీ ధర్మాన్ని రక్షించుకోవడం మన స్వభావమని తెలిపారు.

మనమందరం భారతీయులం, భారతీయులుగానే ఉంటాం. ఇక్కడున్న వారందరం రకరకాల పూజాపద్ధతులు పాటించేవాళ్లం కావచ్చు. మనందరి రూపం ఒకే విధంగా ఉండకపోవచ్చు, కానీ మనందర్నీ ఫొటో తీస్తే ఇవ్వన్నీ అమెరికన్, అరెబియన్ ముఖాలు కాదు, అందరి ముఖాలు భారతీయులవే అని స్పష్టంగా చెప్పవచ్చు. ఇలా వివిధ రకాలుగా ఉండడమనేది కొట్లాడినందువల్ల కాదు, కలిసి మెలిసి ఉన్నందువల్ల సాధ్యం అవుతుందని అన్నారు. ఆ విధంగా మన గుర్తింపును నిలుపుకోవడం మన సహజ స్వభావమని చెప్పారు. మన దేశాన్ని బంగారు పిచ్చుక అని వర్ణించారు. అది ఎప్పుడో విశ్వగురుస్థానాన్ని పొందింది. మనం చాలా తెలివైనవారం. దానితోపాటు శీలవంతులం. శీలం అన్నింటికన్నా ముఖ్యమైనది. రామాయణంలో ఈ విషయం స్పష్టంగా కనపడుతుంది. రావణుడు జ్ఞానంలో చాలా గొప్పవాడే. కానీ అతనివద్ద శీలం లోపించింది. అందుకే నశించిపోయాడు అని తెలిపారు.

ఇప్పటివరకు ఆర్ఎస్ఎస్‌ను అవినీతి సంస్థఅని గానీ, దేశవిరోధి సంస్థ అనిగానీ, క్రమశిక్షణ లేని సంస్థ అనిగానీ ఎవరూ వేలెత్తి చూపలేదు అని చెప్పారు. గురుతేగ్‌బహదూర్ 350 బలిదాన ఉత్సవాన్ని దేశంలోని సిక్కులందరితో కలిసి వేడుకగా జరుపుకోవాలి. మనమందరం రకరకాల సాంప్రదాయాలను పాటించే వారమైనప్పటికీ మనందరివలన దేశానికి మేలు జరగాలి. గురుగ్రంథ సాహెబ్‌లోని విషయాలను మనం ఆచరించాలని సభికులకు ఇంద్రేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

పోస్టల్ సిబ్బందికి సన్మానం

కోరుట్ల: గత 78 ఏళ్లుగా జాగృతి వారపత్రిక సమాజాన్ని జాగృతం చేస్తూ పాఠకులలో జాతీయ భావాలను పెంపొందించడమే కాకుండా మన సంస్కృతి, సాంప్రదాయాలను, పండగలను గురించి ప్రత్యేక వ్యాసాలతో, కథనాలతో వాస్తవ విషయాలను మన ముందు ఉంచు తుందని విభాగ్ వ్యవస్థా ప్రముఖ్ వడ్లకుండ రాజగంగాధర్ అన్నారు. డిసెంబర్ 10న జాగృతి మిత్రబృందం కోరుట్ల ఆధ్వర్యంలో పోస్టల్ కార్యాలయ సిబ్బందికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పోస్ట్‌మాష్టర్ లోకిని గంగాధర్, సిబ్బంది, జాగృతి పాఠకులు పాల్గొన్నారు.

జ్యేష్ఠ స్వయంసేవక్ కనుమూరి వెంకటరాజు కన్నుమూత

రాజమండ్రి: జ్యేష్ఠ స్వయంసేవక్ కనుమూరి వెంకటరాజు(93) డిసెంబర్ 7న భాగ్యనగర్‌లో తుదిశ్వాస విడిచారు. వీరు ప్రసిద్ధ న్యాయవాది. దశాబ్దాలుగా స్వయంసేవక్. విశ్వహిందుపరిషత్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చాలా సంవత్సరాలు కార్యాధ్యక్షులుగా బాధ్యత నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తుని పట్టణంలో శ్రీ సరస్వతీ శిశుమందిర్‌ను ప్రారంభించటంలో, భవనాలను నిర్మించడంలో ఎంతగానో శ్రమించారు.

భక్తాగ్రేసరులు

శ్రీరామానంద

శ్రీరామానందుడు విశిష్టాద్వైతాచార్యుడు రామానుజాచార్య సంప్రదాయానికి చెందినవారు. పుష్పసదన, సుశీలాదేవి దంపతులకు ప్రయాగలో జన్మించారు. వారణాసిలో స్వామి రాఘవానంద వద్ద శిష్యరికం చేసి, దీక్ష పొందారు. సమాజంలోని దురాచారాలను, సంకుచిత భావాలను నిరసిస్తూ, సమానత్వం, సమాజ ఐక్యత, దైవభక్తి ప్రాతిపదికగా విశిష్ట సంప్రదాయం పాదుకొల్పారు. ఎంత విద్వాంసులో అంత ఉదారులు. వర్ణ, వర్గ, లింగభేదాలకు అతీతంగా అందరూ భక్తిమార్గానికి అర్హులేనని చాటిచెప్పారు. మానవులంతా సమానమనే వైదిక సంప్రదాయాన్ని పునరుజ్జీవం చేశారు. 'జాతి పంథ్ పూచో నహి, హరికో భజే సో హరికా హోయ్' (జాతి మతాలకతీతంగా భగవంతుడిని పూజించండి) అనే సూక్తిని తెచ్చారు. కులమతాలకు అతీతంగా ఎందరో శిష్యులను తీర్దిదిద్దారు. వారిలో ముఖ్యంగా పన్నెండు మంది గురువు రామానందుని సంస్కరణోద్యమాన్ని విరివిగా ప్రచారం చేశారు. ప్రజలలోని అంధ విశ్వాసాలను, అపోహలను, భ్రమలను పటాపంచలు చేశారు. అందుకు ప్రజల భాషనే మాధ్యమంగా స్వీకరించారు.

కథ | నక్క - కోడిపుంజు

ఒక రోజున ఒక నక్క ఆకలితో మలమల మాడిపోతూ, ఎక్కడైనా ఏదైనా తిండి దొరుకుతుందేమోనని అంతటా వెదకుతోంది. అప్పుడు దానికొక కోడిపుంజు కన్పించింది. కాని అది ఒక చెట్టు కొమ్మమీద కూర్చొని ఉంది. దాన్ని చూడగానే నక్కకు ఆకలి రెట్టింపైంది. ఏదో విధంగా ఆ పుంజును చంపి ఆకలి తీర్చుకోవాలనుకొంది.

మెల్లగా ఆ చెట్టు వద్దకు వచ్చి "మిత్రమా! ఆకాశవాణి నుండి నిన్న ఒక వార్త విన్పించింది. ఇక మీదట జంతువులన్నీ కలసి మెలసి స్నేహితుల్లాగా జీవించాలట. ఎవరూ ఎవర్నీ ఏమీ చేయకూడదట. ఇందుకోసం ఏదో సమావేశం కూడా ఏర్పాటు చేస్తున్నారట. అందుచేత కిందికి రా! మనమిద్దరం స్నేహితుల్లాగా కలసి మెలసి ఉందాం!" అంది.

ఆ జిత్తులమారి నక్క చెప్పేదాంట్లో నిజమెంతో ఆ కోడిపుంజుకు తెలుసు. అందుచేత అది "అవును ఆ వార్త నేను కూడా విన్నాను." అంది.

లోలోపల కోడిపుంజు నక్కబారినుండి ఎలా తప్పించుకోవాలో ఆలోచిస్తోంది.

పద్యం

శ్రీరాముని దయచేతను
నారూఢిగ సకలజనులు నౌరాయనగా
ధారాళమైన నీతులు
నోరూరఁగఁ జవులుపుట్ట నుడివెద సుమతీ!

భావం : మంచిబుద్ధి గలవాడా! శ్రీరాముని దయవల్ల నిశ్చయముగా అందరు జనులనూ శెభాషని అనునట్లుగా నోటి నుంచి నీళ్లూరునట్లు రసములు పుట్టగా న్యాయమును బోధించు నీతులను చెప్పెదను.

శ్లోకం

'పాపా న్నివారయతి యోజయతే హితాయ
గుహ్యం నిగూహతి గుణాన్ ప్రకటీకరోతి
ఆపద్గతంచ న జహాతి దదాతి కాలే
సన్మిత్ర లక్షణ మిదం ప్రవదన్తి సంతః

భావం : చెడు పనులు చేయకుండా నివారించడం, మంచి పనులకు ప్రోత్సహించడం, వెల్లడించదగని అంశాలను గోప్యంగా ఉంచడం, సుగుణాలను ప్రచారం చేయడం, ఆపద సమయంలో అంటి పెట్టుకొని ఉండడం మంచి మిత్రుడి లక్షణాలు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

వెలుగు	రాత్రి
పగలు	బుట్ట
కలసి	నీడ
అండ	మెలసి
తట్ట	దండ

ఠ్ఠిణ-ఠ్ఠిళ 'ణ్ఠిఇ-ణ్ఠిఇ 'ఇఇ-ఇఇ 'ఇడఇ-ఇడఇ 'ఇఇ-ఇడఇ : ఐఐఐఐఐ

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

గణేష్ ప్రసాద్ (1876 - 1935)



యూపీకి చెందిన ప్రముఖ గణిత శాస్త్రవేత్త. పొటెన్షియల్ సిద్ధాంతం, వాస్తవ చరరాశుల ప్రమేయాలు, ఫోరియర్ శ్రేణులు, ఉపరితల సిద్ధాంతం అనే గణిత విభాగాలలో ప్రత్యేకతను సంతరించుకున్నారు. మనదేశంలో గణిత పరిశోధనల సంస్కృతిని ప్రోత్సహించారు. 1924లో గణేష్ ప్రసాద్ కలకత్తా గణిత సంఘానికి అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఇండియన్ అసోషియేషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్‌కు ఉపాధ్యక్షుడిగానూ పని చేశారు.

జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచంలో మొదటి పేపర్ నోట్లు ఏ దేశం ప్రవేశపెట్టింది?
2. భారతదేశంలో 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా' అని ఏ నగరాన్ని అంటారు?
3. ప్రపంచంలో అతి పురాతన యూనివర్సిటీగా పేర్గాంచినది ఏది?

జవాబులు: 1. చైనా, 2. బెంగళూరు, 3. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ

మెదడుకు మేత

వంకర టింకర
మాను, కష్టజీవుల
గూడు.. ఈడూ
జోడూ అవును?

కవిత : యామిజ

మంచిమాట

పుట్టిన నేలనీ,
దేశాన్ని ప్రేమించలేని వాడు
దేనినీ ప్రేమించలేడు

అప్పుడు దానికో ఉపాయం వచ్చింది. "అదిగో! నీ స్నేహితులెవరో ఇటే వస్తున్నారు. వాళ్లని కూడా రానీ! అందరం కలిసి అప్పుడు పండుగ చేసుకొందాం!"

"ఈ దారిన వచ్చే నా స్నేహితులెవరూ లేరే! ఇంతకూ ఎవరొస్తున్నారు?" అని అడిగింది నక్క.

''వేటకుక్కలూ, వాటి స్నేహితులూ'' జవాబిచ్చింది పుంజు.

వేటకుక్కల పేరు వినగానే నక్క హడలెత్తి పోయి వణకడం మొదలెట్టింది. "వాటి కంటబడితే ఇక నా పని అంతే" అనుకుంది నక్క.

"అలా భయంతో వణికిపోతున్నావెందుకు?" అని అడిగింది కోడిపుంజు. అందుకు నక్క "వాళ్లు బహుశా నిన్నటి వార్త వినలేదేమో అనుకుంటా" అంటూ పారిపోయింది. ★

వారఫలాలు

22 -28 డిసెంబర్ 2025

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

భూములు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఆదాయం గతం కంటే మెరుగుపడుతుంది. నూతన విద్యావకాశాలు లభిస్తాయి. వ్యాపారులు ఒత్తిడుల నుంచి బయటపడతారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో సమస్య తీరుతుంది. రాజకీయ, కళారంగాల వారి యత్నాలు సఫలం. రచయితలు, క్రీడాకారులు అనుకున్నది సాధిస్తారు 23,24 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. శివపంచాక్షరి పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

భూవివాదాలు పరిష్కారమవుతాయి. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. బంధువులతో కొన్ని విషయాలపై చర్చిస్తారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. కాంట్రాక్టులు అనూహ్యంగా దక్కుతాయి. వ్యాపారులు సకాలంలో విస్తరిస్తారు. ఉద్యోగులకు హోదాలు దక్కుతాయి. పారిశ్రామికవేత్తలకు ఊహించని ఆహ్వానాలు రాగలవు. క్రీడాకారులు, పరిశోధకులకు అన్నింటా విజయమే. 22,23 తేదీల్లో వృథా ఖర్చులు. విష్ణునామ ధ్యానం చేయండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

బంధువులు,మిత్రుల నుంచి పిలుపు అందుతుంది. దైవకార్యాలలో పాల్గొంటారు. కొంత కాలంగా వేధిస్తున్న శారీరక రుగ్మతలు తీరతాయి. వాహనాలు, భూములు కొంటారు. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు దక్కుతాయి. పారిశ్రామికవేత్తలకు కొత్త సంస్థల ఏర్పాటులో విజయం. కళాకారులు, పరిశోధకులకు ఆశయాలు ఫలిస్తాయి. 24,25 తేదీల్లో బంధువులతో తగాదాలు. వృథా ఖర్చులు. శ్రీరామరక్షా స్తోత్రాలు పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

ఇంటి నిర్మాణాలు ముమ్మరం చేస్తారు. ప్రముఖులతో ఉత్తరప్రత్యుత్తరాలు సాగిస్తారు. దేవాలయాలు సందర్శిస్తారు. మీ అంచనాలు కొన్ని నిజం కాగలవు. సమావేశాలలో పాల్గొంటారు. వ్యాపారులకు పెట్టుబడులు అనూహ్యంగా దక్కుతాయి. ఉద్యోగులు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. కళాకారులకు అవకాశాలు పెరుగుతాయి. 26,27 తేదీల్లో బంధువులతో విభేదాలు. మానసిక అశాంతి. కనకధారా స్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

రుణదాతల ఒత్తిడులు తొలగుతాయి. విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వస్తాయి. దేవాలయాలు సందర్శిస్తారు. భాగస్వాముల సలహాలతో వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు కొత్త హోదాలు రాగలవు. కళాకారులకు యోగదాయకంగా ఉంటుంది. రచయితలు, క్రీడాకారుల కృషి ఫలిస్తుంది. 27.28 తేదీల్లో మానసిక అశాంతి. దూరప్రయాణాలు. దేవీస్తోత్రాలు పఠించండి.

కన్య: ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. తీర్థయాత్రలు చేస్తారు. వాహనాలు, భూములు కొంటారు. సమాజంలో విశేష గౌరవం. ఇంతకాలం పడిన కష్టం ఫలిస్తుంది. వ్యాపారులకు విస్తరణలో అవాంతరాలు తొలగుతాయి. ఉద్యోగులకు ప్రమోషన్లు. రచయితలు, క్రీడాకారులకు నూతనోత్సాహం. 22,23 తేదీల్లో అనుకోని ఖర్చులు. కుటుంబ బాధ్యతలతో సతమతమవుతారు. ఆంజనేయ దండకం పఠించండి..

తుల: చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

నిరుద్యోగులకు ఉద్యోగలాభ సూచనలు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. వ్యాపారులకు మరింత ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది. పారిశ్రామికవేత్తలకు సంతోషకరమైన సమాచారం. రచయితలు, క్రీడాకారులకు అనుకూల సమయం. 26,27 తేదీల్లో శారీరక రుగ్మతలు. స్నేహితులతో విరోధాలు. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కుటుంబంలో సమస్యలు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. శారీరక రుగ్మతలు. విద్యార్థులకు అవకాశాలు చేజారవచ్చు. గృహం, వాహనాల కొనుగోలు యత్నాలు. ఉద్యోగులకు మార్పులు అనివార్యం. కళాకారులకు కొంతమేర ఒత్తిడులు తప్పవు. క్రీడాకారులు, నాయకులకు ఒడుదొడుకులు. 24,25తేదీల్లో శుభవార్తలు. ఆకస్మిక వస్తులాభాలు. ఆహ్వానాలు అందుతాయి. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి..

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ప్రముఖులతో పరిచయాలు. రాబడి మరింత మెరుగుపడి ఉత్సాహంగా గడుపుతారు. వేడుకలకు హాజరవుతారు. సాంకేతిక విద్యావకాశాలు దక్కుతాయి. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. రాజకీయవేత్తలకు ఊహించని ఆహ్వానాలు అందుతాయి. కళాకారులు, పరిశోధకులకు పట్టింది బంగారమే. 26,27 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. దత్తస్తోత్రాలు పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంటారు. ఇంటి నిర్మాణ యత్నాలు కలసి వస్తాయి. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు కొత్త పోస్టులు లభిస్తాయి. రాజకీయవేత్తలకు నూతన పదవులు. క్రీడాకారులు, రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 23,24 తేదీల్లో బంధువిరోధాలు. మానసిక అశాంతి. ఆదిత్య హృదయం పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ప్రముఖులతో చర్చలు సఫలం. వాహనసౌఖ్యం. నూతన పరిచయాలు ఏర్పడతాయి. కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారులకు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు విధుల్లో అనుకూల వాతావరణం. రాజకీయవేత్తలకు శుభవార్తలు అందుతాయి. రచయితలు, క్రీడాకారులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 25,26 తేదీల్లో కుటుంబంలో సమస్యలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ప్రముఖులతో చర్చలు ఫలిస్తాయి. బంధువులతో సంబంధబాంధవ్యాలు మెరుగువడతాయి. దేవాలయాలు సందర్శిస్తారు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యాపారులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు ఉన్నతస్థితి లభించే సూచనలు. కళాకారులకు కొత్త అవకాశాలు దక్కుతాయి. పారిశ్రామికవేత్తలు, రచయితల ఆశలు నెరవేరతాయి. 24,25 తేదీల్లో శారీరక రుగ్మతలు. స్నేహితులతో విభేదాలు. గణేశాష్టకం పఠించండి.

పదరసం-543

ఆధారాలు

అడ్డం

1. ప్రధాని పేరులోని తొలిభాగం (3)
3. అభ్యసనం, నేర్వడం (3)
5. ఆజ్ఞ, ఒట్టు (2)
6. ఎనిమిదో తిథి తడబడింది (3)
8. ఆకాశం (3)
9. కోట, చదరం (2)
10. కృష్ణ భక్తురాలు (2)
11. వ్యాపారుల జమాఖర్చుల చిట్టా (2)
14. పశుపక్ష్యాదుల పిల్లలు (3)
15. యుద్ధమే.... అటు నుంచి (2)
16. కథ కంటే పెద్దది... (3)
18. హారం, దండ (2)
19. మంచి, దానం (2)
20. గమ్మత్తులు (4)
21. వాటా...క్షీరం (2)
24. మయన్మార్ పాతపేరు .. తిరగబడింది (2)
27. ఇక్కట్లు (4)
29. కోలాహలం, హడావిడి (3)
30. ముసలితనం (2)
32. పుష్పం (2)
33. ఎగుమతి కాదు (4)
34. దూషణం, శాపం (2)

నిలువు

1. ప్రపంచంలోనే ఎత్తైన జలపాతం (4)
2. మనసుతో చూసేవాడు (2)
3. స్వామికి వికృతి (2)
4. పట్టణాల కంటే పెద్దవి (4)
5. తిరుమలేశుని మందిరం పేరు (6)
7. సగం, సొరుగు (2)
10. ఎటూ తేల్చక కాలయాపన చేయడం (5)
12. ఆయుధమే... తలకిందులైంది (2)
13. సత్తా,బలం (2)
16. పరిహాసం, వినోదం (2)
17. తీగలు (3)
19. మార్గశిర మాసానికి మరోపేరు (4)
22. అందం (3)
23. సోపానాలు (2)
25. రేగు, ఒక క్షేత్రం (3)
26. నడకకు వ్యతిరేకం.. రన్ (3)
28. బంతి లాంటి పువ్వు (3)
31. ఖర్చుకు వ్యతిరేకం (2)



పదరసం - 542 సమాధానాలు



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలయికలో వచ్చిన సింహా, లెజెండ్, అఖండ' చిత్రాలు మంచి విజయాన్ని అందుకున్నాయి. దాంతో వారి కాంబినేషన్ లో రూపుదిద్దుకున్న 'అఖండ 2 తాండవం' పైనా భారీ అంచనాలు నెలకొన్నాయి. దానికి తోడు ఇది బాలకృష్ణకు తొలి పాన్ ఇండియా మూవీ కావడం, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా వీస్తున్న హిందుత్వ గాలులను బలపరుస్తూ ఈ కథను తయారు చేయడంతో అందరి దృష్టీ దీనిపై పడింది. అంతేకాకుండా బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్వినీ ఈ సినిమాతో చిత్ర నిర్మాణంలోకీ అడుగుపెట్టింది. ఫోర్టీన్ రీల్స్ ప్లస్ ఎంటర్ టైన్ మెంట్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ఈ సినిమాను నిర్మించారు. అయితే వారి గత చిత్రాల బకాయిల కారణంగా 'అఖండ 2' విడుదల ఓ వారం ఆలస్యమైంది. డిసెంబర్ 5న రావాల్సిన ఈ సినిమా 12న విడుదలైంది.

బాలకృష్ణ 'శివ తాండవం' అఖండ 2

'అఖండ' చిత్రంలో 'ప్రకృతిని దోచుకుంటే దైవం చూస్తూ ఊరుకోదు... ఖచ్చితంగా శిక్షిస్తుంద'ని చూపించారు దర్శకుడు బోయపాటి శ్రీను, 'అఖండ -2' సినిమాలో సనాతన హైందవ ధర్మం గొప్పతనాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేశారు. గత కొన్నేళ్లుగా మన దేశంలో జరిగిన సంఘటనలను, ప్రస్తుతం జరుగుతున్న వాటిని ఆధారంగా చేసుకుని ఈ కథను బోయపాటి తయారు చేసుకున్నారు. టిబెట్‌ను ఆక్రమించుకున్న చైనా... భారతపై కన్నేసి, ఇక్కడ కల్లోలాలను సృష్టించాలనుకోవడం, హిందు ధర్మాన్ని, దైవభక్తిని ప్రజల మనసుల నుండి తొలగించాలనుకోవడం వంటి అంశాలపై బోయపాటి దృష్టి పెట్టారు.

'అఖండ' సినిమా ఎక్కడ ముగిసిందో అక్కడ నుండి ఈ కథను ఆరంభించారు. శత్రువులను తుదముట్టించిన అఖండ రుద్ర (బాలకృష్ణ) అష్ట లింగ పీఠంలో తపస్సు చేయడానికి హిమాలయాలకు వెళ్ళిపోతాడు. ఇక్కడ మురళీకృష్ణ (బాలకృష్ణ) ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజలకు సేవ చేస్తుంటాడు. అతని భార్య శరణ్య కన్నుమూయడంతో కూతురు జనని (హర్షాలీ మల్హోత్ర)ని విద్యావంతురాలని చేస్తాడు. ఆమె సైంటిస్ట్‌గా మంచి పేరు తెచ్చుకుని, దేశ హితం కోసం తన టీమ్‌తో హిమాచల్‌ప్రదేశ్‌లో పని చేస్తుంటుంది. వారంతా ఆర్మీ ఆఫీసర్ అర్చన (సంయుక్త) సంరక్షణలో ఉంటారు. ఇదిలా ఉంటే... ప్రధాని పీఠంపై కన్నేసిన ప్రతిపక్ష నేత అజిత్ ఠాకూర్ (కబీర్ దుహాన్ సింగ్), చైనా జనరల్ జంగ్లీ (సాంగ్యా)తో చేతులు కలుపుతాడు. ఈ దేశాన్ని నాశనం చేయాలంటే ప్రజలలో ఉన్న దైవభక్తిని తొలగించాలని, దేవుడు సైతం తమను కాపాడలేడనే భావనకు వారిని లోను చేయాలని అజిత్ ఠాకూర్ ప్రయత్నిస్తాడు. మహా కుంభమేళ సందర్భంగా పవిత్ర గంగాజలాన్ని కలుషితం చేసి తద్వారా ప్రజలు వైరస్ బారిన పడేలా పన్నాగం పన్నుతాడు. ప్రతిపక్ష నేత, చైనా జనరల్ చేసిన ప్రయత్నాలను అఖండ రుద్ర ఎలా అడ్డుకున్నాడు? సనాతన ధర్మాన్ని తుడిచి వేయాలని వారు చేసిన కుతంత్రాన్ని ఎలా ఎదుర్కొన్నాడు? జనని తయారు చేసిన వాక్సిన్‌ను ప్రభుత్వానికి దక్కకుండా చేయాలనుకున్న వారి కుట్రలను ఎలా భగ్నం చేశాడు? అనేది మిగతా కథ.

'అఖండ'లో తన తమ్ముడి కూతురు ఆపదలో ఉన్నప్పుడు రక్షించడానికి వచ్చిన అఖండ రుద్ర... ఇందులో ఈ దేశ కార్యంలో నిమగ్నమైన అదే అమ్మాయికి శత్రువుల నుండి ప్రమాదం సంభవించినప్పుడు రంగంలోకి దిగుతాడు. వాక్సిన్ ప్రభుత్వానికి చేరకుండా అడ్డుకున్న నేత్ర (ఆది పినిశెట్టి) అనే తాంత్రికుడు చేసే పన్నాగాన్ని భగ్నం చేయడమే కాకుండా... శత్రు దేశ సైనికులనూ దునుమాడి, ధర్మరక్షణ ఆవశ్యకతను జనాలకు బోధిస్తాడు. ప్రస్తుత సామాజిక, రాజకీయ అంశాలను మిళితం చేసి బోయపాటి రాసుకున్న ఈ కథ బాలకృష్ణ అభిమానులను బాగా ఆకట్టుకుంటుంది. అదే సమయంలో సనాతన ధర్మం గురించిన బోధ చేయడం కూడా కలిసొచ్చే అంశమే. ప్రథమార్ధంను బాలకృష్ణకు ఉన్న ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని పంచ్ డైలాగ్స్ రాసుకున్న బోయపాటి ద్వితీయార్ధాన్ని యాక్షన్ సన్నివేశాలతో నింపేశాడు. తల్లి మరణానంతరం వచ్చే సన్నివేశం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 'అఖండ'లో బాలకృష్ణ, ప్రగ్యా జైస్వాల్ జోడీ మధ్య సన్నివేశాలు బాగా పండాయి. ఇందులో అలాంటివి లేకపోవడం ఓ లోపం. ఇక హీరోయిన్ కాని హీరోయిన్ పాత్రను సంయుక్త పోషించింది. ఆమె పాత్ర కేవలం ఓ పాటకు, ఫైట్‌కు పరిమితమై పోయింది.

నటీనటుల విషయానికి వస్తే బాలకృష్ణ రెండు పాత్రలకు న్యాయం చేశాడు. ఎమ్మెల్యే మురళీకృష్ణగా ఆకట్టుకున్న బాలకృష్ణ, అఖండ రుద్రగా తన నట విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. అఖండ పాత్రతో చెప్పించిన సంభాషణలు సినిమాకు హైలైట్‌గా నిలిచాయి. ఇందులో బాలకృష్ణ తర్వాత మళ్లీ అంత ప్రాధాన్యం గల పాత్ర ఆయన కూతురుగా నటించిన హర్షాలీ ది. హిందీ చిత్రం 'బజరంగీ భాయీజాన్'లో చిన్నపిల్లగా నటించిన హర్షాలికి ఆ తర్వాత నటించడం ఇదే. ఆమె కారణంగా ఈ సినిమాకు ఉత్తరాదిన కాస్తంత క్రేజ్ వస్తుందని మేకర్స్ భావించినట్టున్నారు. అయితే ఆ పాత్రకు తెలుగమ్మాయిని తీసుకుంటే ఇంకా బాగుండేది. ఆది పినిశెట్టి పాత్ర సైతం చెప్పుకోదగ్గదిగా లేదు. ద్వితీయార్ధంలో వచ్చే ఆ పాత్రతో బ్యాక్ టు బ్యాక్ రెండు ఫైట్స్ చేయించి పక్కన పెట్టేశారు. ఇతర ప్రధాన పాత్రలను సాంగ్యా, కబీర్ దుహాన్ సింగ్, 'కల్కి' ఫేమ్ శాశ్వత్ ఛటర్జీ, పూర్ణ, మురళీమోహన్, ఝాన్సీ, అనీశ్ కురువిల్లా, సర్వదమన్ బెనర్జీ, రవివర్మ, విజీ చంద్రశేఖర్, వై జి మహేంద్ర, శరత్ లోహితస్య తదితరులు పోషించారు. వీరంతా పాత్రల పరిధి మేరకు నటించారు తప్పితే... తమదైన ముద్రను వేయలేకపోయారు. బోయపాటి శ్రీను చిన్న కొడుకు వర్షిత్ ఇందులో భక్త ప్రహ్లాదుడి పాత్రలో కనిపిస్తాడు.

ఈ చిత్రానికి తమన్ అందించిన నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణ. సినిమాటోగ్రఫీ, ప్రొడక్షన్ వాల్యూస్ గొప్పగా ఉన్నాయి. బాలకృష్ణ ఫ్యాన్స్‌కు, యాక్షన్ సన్నివేశాలను ఇష్టపడే వారికి 'అఖండ-2' నచ్చుతుంది. హైందవ ధర్మ విశిష్టతను, ఆవశ్యకతను చెప్పడమనదే అభినందించాల్సిన విషయం. అయితే దాన్ని మరింత బలమైన కథలో ఇమిడ్చి చెప్పి ఉంటే ఎక్కువ మందికి ఆ సందేశం చేరి ఉండేది.

– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.300/-



వెల : ₹.100/-



వెల : ₹.400/-

వెల : ₹.300/-



వెల : ₹.60/-

వెల : ₹.800/900 : 999/1200



వెల : ₹.200/-

వెల : ₹.45/-

వెల : ₹.99/-



వెల : ₹.899/-

వెల:₹.350/-



వెల :₹.450/-



వెల : ₹.500/-

వెల : ₹.500/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

సాహిత్య నికేతన్ : వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722.

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 10